



# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...

తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY








SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 9 | సంచిక : 37 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | గురువారం 30 అక్టోబర్ 2025 | పేజీలు : 12 | వెల : 2/-


- దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంట నష్టం
- నేలకొరిగిన వరి.. 30 శాతం విస్తీర్ణంలో పంటకు దెబ్బ
- ఇతర ప్రధాన పంటలదీ అదే పరిస్థితి
- ముంపునకు గురైన మొక్కజొన్న, అపరాలు, వేరుశనగ పంటలు
- కుండపోత వర్షాలకు కుళ్లిపోతున్న పత్తి కాయలు.. తుది అంచనాలు ఎప్పుడు కొలిక్కి వస్తాయో తెలియని దుస్థితి
- వీటన్నింటికీ తోడు కూటమి ప్రభుత్వ నిర్వాకంతో అపార నష్టం
- ఈ-క్రాప్‌కు మంగళం.. ఉచిత పంటల బీమాకు ఎసరు

# అన్నదాతకు కన్నీరు

## పంటలపై 'మోంథా' తాండవం!

## అన్నదాతల ఆశలను చిదిమేసిన తుపాను

## ముంచెత్తిన వానలు.. ఈదురు గాలులతో పంటలకు తీవ్ర నష్టం



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'మోంథా' తుపాను రైతుల ఆశలను చిదిమేసింది. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎటు చూసినా లక్షలాది ఎకరాల్లో పంటలు నేలకొరిగాయి. వరి, మొక్క జొన్న, పత్తి, అరటి ఇలా ఏ పంట చూసినా ముంపు నీటిలో నానుతున్నాయి. కోతకొచ్చే దశలో తుపాను బారిన పడడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. దాదాపు 15 లక్షల ఎకరాల్లో పంటలపై తీవ్ర ప్రభువం ఉన్నట్టు తెలుస్తోంది. తుపాను ప్రభావం వల్ల 30 శాతం మేర దిగుబడులు తగ్గిపోనున్నాయని ప్రాథమిక అంచనా. తుపాను ప్రశాంతంగానే తీరం దాటినప్పటికీ, కుండపోత వర్షాలతో ఉమ్మడి ఉభయుగోదావరి జిల్లాలను అతలాకుతలం చేసింది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ఉత్తరాంధ్ర మొదలు బాపట్ల వరకు.. ఒంగోలు నుంచి తిరుపతి వరకు వ్యవసాయ, ఉద్యాన పంటలకు అపార నష్టం వాటిల్లింది. తీర ప్రాంత జిల్లాల్లో లక్షులాది ఎకరాల్లో పంటలు ముంపునకు గురయ్యాయి. పలు జిల్లాలుల్లో పంట పొలాలు - మిగతా 2లో



# విద్యుత్, రవాణా పునరుద్ధరణే లక్ష్యం



- మొంథా బీభత్సంపై సీఎం చంద్రబాబు సమీక్ష...
- మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షలు
- తుఫాను బాధితులకు తక్షణ సాయం.. సమీక్షలో సీఎం కీలక ఆదేశాలు
- భారీ పంట నష్టం.. యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టాలన్న చంద్రబాబు
- విద్యుత్, రహదారుల పునరుద్ధరణకు తక్షణ చర్యలు
- తుపాను మృతుల కుటుంబాలకు రూ. 5 లక్షల పరిహారం
- పారిశుధ్యం, తాగునీటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్న సీఎం

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

మొంథా తుపాను సృష్టించిన బీభత్సం నుంచి ప్రజలను, రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టింది. పంట నష్టానికి సంబంధించిన పూర్తి వివరాలతో ఐదు రోజుల్లోగా సమగ్ర నివేదిక సమర్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో సిబ్బంది వేగంగా నష్టాన్ని అంచనా వేసేలా చర్యలు - మిగతా 2లో




# పీపీపీ ఆపలేం

- అది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయం
- చట్టవిరుద్ధమైతే తప్ప జోక్యం చేసుకోలేం
- టెండర్ పక్రియ ఆగేలా ఉత్తర్వులివ్వలేం
- మెడికల్ కాలేజీలపై తేల్చిచెప్పిన హైకోర్టు
- కౌంటర్ దాఖలుకు సర్కారుకు సమయం
- థర్డ్ పార్టీకి హక్కులివ్వకుండా చూడాలన్న
- పిటిషనర్ అభ్యర్థనను తిరస్కరించిన ధర్మాసనం

2

# ఓట్ల కోసం మోదీ దేనికైనా రెడీ



- బిహార్ ప్రచార సభల్లో రాహుల్ విమర్శ
- 'ఛఠ్ పూజ నిర్వహించేందుకు మోదీ యమునా నదీ స్నానానికి వెళ్తున్నారంటూ జరిగిన డ్రామాను చూసే ఉంటారు.
- 'ఛఠ్ పూజ నిర్వహించేందుకు మోదీ యమునా నదీ స్నానానికి వెళ్తున్నారంటూ జరిగిన డ్రామాను చూసే ఉంటారు.

5



# రఫేల్‌లో రాష్ట్రపతి గగన విహారం

- హరియాణాలోని అంబాలాలో ఉన్న భారత వాయుసేన (ఐఏఎఫ్) స్థావరం నుంచి ఈ యుద్ధ విమానంలో నింగిలోకి దూసుకెళ్లిన ఆమె
- దాదాపు 30 నిమిషాల్లో 200 కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించారు.
- వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము చరిత్ర సృష్టించారు.

5

# మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండండి



- విద్యుత్తు సరఫరా పునరుద్ధరణ,పారిశుధ్య పరిరక్షణ కీలకం
- ఆర్టీజీఎస్ నుంచిమంత్రి లోకేశ్ టెలికాన్ఫరెన్స్
- వర్షాలకు దెబ్బతిన్న పంటలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పంట నష్టం అంచనాలు రూపొందించాలి'
- తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లు, వాణిజ్య సముదాయాలన్నింటికీ విద్యుత్తు పునరుద్ధరించాలి.

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

వర్షాల కారణంగా రహదారులపై పేరుకుపోయిన బురద తొలగించేందుకు అగ్నిమాపకశాఖ చర్యలు చేపట్టాలని మంత్రి లోకేశ్ సూచించారు. బుధవారం ఆయన ఆర్టీజీఎస్ నుంచి హోం మంత్రి అనిత, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఆర్టీజీఎస్ కార్యదర్శి కాటంనేని భాస్కర్‌తో కలిసి జిల్లాల అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. 'రానున్న 48 గంటలపాటు అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలి. తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని ఇళ్లు, వాణిజ్య సముదాయాలన్నింటికీ విద్యుత్తు పునరుద్ధరించాలి. వర్షాలకు దెబ్బతిన్న పంటలు కాపాడేందుకు తగిన చర్యలు తీసుకోవడంతోపాటు పంట నష్టం అంచనాలు రూపొందించాలి' - మిగతా 2లో



# తనయుల కోసం సోనియా, లాలూ ఆరాటం

- ప్రధాని, బిహార్ సీఎం పదవులపై వారి కళ్లు
- ఆ రెండూ ఖాళీగా లేవు
- దాణా, తారు, ఉద్యోగాల కుంభకోణంలో లాలూప్రసాద్ ఉన్నారు
- కేంద్ర హోం మంత్రి అమిత్ షా

# విద్యుత్, రవాణా పునరుద్ధరణే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, తుపాను కారణంగా మృతి చెందిన వారి కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు ప్రకటించారు. బుధవారం ఉదయం తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి, ప్రజల ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్న ముఖ్యమంత్రి, సాయంత్రం సచివాలయంలోని ఆర్టీజీ కేంద్రంలో ఉన్నతాధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సహాయక, పునరుద్ధరణ చర్యలపై పలు కీలక ఆదేశాలు జారీ చేశారు.

**భారీగా పంట నష్టం.. ప్రాథమిక అంచనాలు వెల్లడి**

సమావేశంలో అధికారులు తుపాను వల్ల జరిగిన నష్టాన్ని ముఖ్యమంత్రికి వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 304 మండలాల్లోని 1,825 గ్రామాల్లో సుమారు 87 వేల హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు ప్రాథమికంగా అంచనా వేశామని తెలిపారు. ఇందులో 59 వేల హెక్టార్లకు పైగా వరి పంట నీట మునిగిందని, ప్రత్తి, మొక్కజొన్న, మినుము వంటి ఇతర పంటలు కూడా తీవ్రంగా దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా 78,796 మంది రైతులు నష్టపోయారని, 42 పశువులు కూడా మృత్యువాత పడ్డాయని వివరించారు.

అయితే ఇది కేవలం ప్రాథమిక అంచనా మాత్రమేనని, క్షేత్రస్థాయిలో వాస్తవ నష్టం ఇంకా ఎక్కువగా ఉండే అవకాశం ఉందని అధికారులు అభిప్రాయపడ్డారు. దీనిపై స్పందించిన ముఖ్యమంత్రి, వ్యవసాయ శాస్త్రవేత్తలు వెంటనే దెబ్బతిన్న పొలాలను సందర్శించి, పంటలను కాపాడుకునే మార్గాలపై రైతులకు తగిన సూచనలు, సలహాలు ఇవ్వాలని నిర్దేశించారు. సహాయక చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్న చంద్రబాబు, విద్యుత్ సరఫరా, రహదారుల పునరుద్ధరణ పనులను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. బుధవారం రాత్రికి అన్ని ప్రాంతాలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, గురువారం నాటికి దెబ్బతిన్న రహదారులకు మరమ్మతులు పూర్తి చేయాలని గడువు విధించారు. ఈ పనుల్లో ఎలాంటి అలసత్వం ప్రదర్శించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సు సర్వీసులను యధావిధిగా కొనసాగించాలని సూచించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ.. కూలిపోయిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నామని, ఫీడర్లను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు.

**ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి.. కలెక్టర్‌పై అసహనం**

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పారిశుధ్య పనులు ముమ్మరం చేయాలని, ఎక్కడా నీరు నిలిచిపోకుండా డ్రైనేజీలను శుభ్రపరచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్న ప్రతి కుటుంబానికి గురువారం నాటికల్లా బియ్యం, నిత్యావసర సరుకులు అందజేయాలని స్పష్టం చేశారు.





తాగునీరు కలుషితం కాకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా రూరల్ వాటర్ సప్లయ్ అధికారులు చర్యలు తీసుకోవాలని హెచ్చరించారు.

ఈ సందర్భంగా ఒంగోలు పట్టణంలోని పలు కాలనీలు నీట మునగడంపై ప్రకాశం జిల్లా కలెక్టర్ రాజాబాబు పనితీరుపై ముఖ్యమంత్రి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి పాలనా వైఫల్యాలు పునరావృతం కావొద్దని, విపత్తుల నిర్వహణలో పాఠాలు నేర్చుకోవాలని సూచించారు. ప్రతి జిల్లా ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని అన్నారు.

**భారీ ఎత్తున సహాయక చర్యలు**

మొంథా తుఫాన్ ప్రభావంతో రాష్ట్రంలోని 249 మండలాలు, 1,434 గ్రామాలు, 48 మున్సిపాలిటీల్లోని దాదాపు 18 లక్షల మంది ప్రజలు ప్రభావితమయ్యారు. ప్రభుత్వం ముందుజాగ్రత్త చర్యగా 1,209 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి, 1.16 లక్షల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించింది. తుపాను కారణంగా రాష్ట్రంలో 380 కిలోమీటర్ల పంచాయతీరాజ్ రహదారులు, 14 వంతెనలు, కల్వర్టులు దెబ్బతినడంతో రూ. 4.86 కోట్ల నష్టం వాటిల్లింది. అలాగే 2,294 కిలోమీటర్ల ఆర్ అండ్ బీ రోడ్లకు రూ. 1,424 కోట్ల మేర నష్టం వాటిల్లినట్లు అంచనా. గ్రామీణ నీటి సరఫరా విభాగానికి రూ. 36 కోట్లు, జలవనరుల శాఖకు రూ. 16.45 కోట్ల నష్టం జరిగింది. సహాయక చర్యల్లో భాగంగా 3,175 మంది గర్భిణీలను ఆసుపత్రులకు తరలించగా, 2,130 వైద్య శిబిరాలు నిర్వహించారు. రహదారులపై విరిగిపడిన 380 చెట్లను తొలగించి రవాణాకు అంతరాయం లేకుండా చేశారు. తుపాను తీరం దాటడంతో వర్షాలు తగ్గుముఖం పట్టాయని, ప్రభుత్వ చర్యలపై ప్రజల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోందని అధికారులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో మంత్రులు నారా లోకేశ్, వంగలపూడి అనిత, అనగాని సత్యప్రసాద్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పీపీపీ ఆపలేం

అమరావతి

రాష్ట్రంలోని 10 మెడికల్ కాలేజీలు, వాటికి అనుబంధంగా ఉండే ఆసుపత్రులపై పీపీపీ విధానంలో థర్డ్ పార్టీకి హక్కులు కల్పించకుండా అడ్డుకోవాలన్న పిటిషనర్ అభ్యర్థనను హైకోర్టు ధర్మాసనం తోసిపుచ్చింది. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులూ జారీ చేయలేమని తేల్చిచెప్పింది. పబ్లిక్, ప్రైవేట్, పార్ట్‌నర్‌షిప్(పీపీపీ)తో మెడికల్ కాలేజీలు, ఆసుపత్రులు నిర్మించాలనేది ప్రభుత్వ విధానపరమైన నిర్ణయమని స్పష్టం చేసింది. ఒకవేళ ఆ నిర్ణయం పూర్తిగా చట్టవిరుద్ధమైతే తప్ప కోర్టులు జోక్యం చేసుకోలేవని పేర్కొంది. కాలేజీలు, ఆసుపత్రులను పీపీపీ విధానంలో చేపట్టాలని ఎందుకు నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది?. దీని వల్ల లాభనష్టాలు ఏంటి?. అన్ని అంశాలను లోతుగా పరిశీలించాల్సి ఉందని తెలిపింది. "పీపీపీ ప్రక్రియ ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉంది. ప్రభుత్వం ఆహ్వానించిన వెంటనే డబ్బుల సంచులతో పెట్టబడిదారులు హడావుడిగా రారుకదా!" అని ధర్మాసనం వ్యాఖ్యానించింది. రాష్ట్ర ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేసిన తరువాత అన్ని అంశాలను పరిశీలిస్తామని పేర్కొంది. కౌంటర్ వేసేందుకు సమయం ఇస్తూ తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం ఉత్తర్వులు ఇచ్చింది.

**స్టే ఇవ్వండి!**

రాష్ట్రంలోని ఆదోని, మదనపల్లి, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం మెడికల్ కాలేజీలను పీపీపీతో అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదిస్తూ గత నెల 9న ప్రభుత్వం జీవో 590ని జారీ చేసింది. దీనిని సవాల్ చేస్తూ గుంటూరుజిల్లా, తాడేపల్లికి చెందిన సామాజిక కార్యకర్త డాక్టర్ కుర్రా వసుంధర హైకోర్టులో పిల్ వేశారు. ఈ వ్యాజ్యం బుధవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్. శ్రీరామ్, న్యాయవాది అశోక్‌రామ్ వాదనలు వినిపించారు. "లాభ, నష్టాలను సమగ్రంగా అధ్యయనం చేయకుండానే పీపీపీ విధానంలో నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. నిర్వహణ బాధ్యతను 33ఏళ్ల పాటు థర్డ్ పార్టీకి అప్పగించడం ద్వారా ప్రైవేటు వ్యక్తులు రూ.వేల కోట్లు ఆర్జిస్తారు. ఇప్పటికే పిలిచిన టెండర్లను ఖరారు చేయకుండా కోర్టు స్టే ఇవ్వాలి" అని కోరారు. ధర్మాసనం స్పందిస్తూ.. ఆసుపత్రుల నిర్మాణానికి ఎంత ఖర్చు అవుతుందని, కాలేజీల నిర్మాణం ఏదశలో ఉందని ఆరా తీసింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది (ఎస్‌జీపీ) వాదనలు వినిపిస్తూ.. "మొత్తం 17 మెడికల్ కాలేజీలు, ఆసుపత్రుల నిర్మాణానికి రూ.8,500 కోట్లు అవసరం. పులివెందుల మెడికల్ కాలేజీ నిర్మాణం 80 శాతం పూర్తయింది. మిగిలిన కాలేజీల నిర్మాణాలు 20–30శాతం మాత్రమే జరిగాయి. పీపీపీ విధానంలో అభివృద్ధి వ్యవహారం టెండర్ల దశలో ఉంది. పూర్తి వివరాలతో కౌంటర్ వేస్తాం. ఈ దశలో ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వద్దు" అని ధర్మాసనాన్ని కోరారు.

## మరో రెండు రోజులు అప్రమత్తంగా ఉండండి

-మొదటిపేజీ తరువాయి

అని ఆదేశించారు. 'మొంథా తీవ్ర తుపాను ప్రభావంతో జరిగిన ప్రాణనష్టం, దెబ్బతిన్న నిర్మాణాల గురించి నివేదికలివ్వండి. వంతెనలు, కల్వర్టుల్ని పర్యవేక్షించడంతోపాటు వర్షాల ధాటికి దెబ్బతిన్న చెరువులు, కుంటలు, కాలువగట్ల పటిష్ఠానికి చర్యలు తీసుకోండి. ముంపు ప్రాంతాల్లో అంటు వ్యాధులు ప్రబలకుండా తగిన ముందు జాగ్రత్తలు తీసుకోండి. పాముకాటు మందు అందుబాటులో ఉంచండి. పారిశుద్ధ్య పరిరక్షణ, ముంపు ప్రాంతాల్లో సురక్షిత తాగునీరు అందించడం చాలా కీలకం. మత్స్యకారులు, తుపాను ప్రభావిత ప్రాంతాల్లోని బాధిత కుటుంబాలకు నిత్యావసర సరకుల్ని వెంటనే పంపిణీ చేయాలి' అని లోకేశ్ అధికారులకు సూచించారు.

# అన్నదాతకు కన్నీరు

-మొదటిపేజీ తరువాయి

చెరువులను తలపిస్తున్నాయి. కోతకొచ్చిన పంట ఇలా నీటి పాలవడంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. భారీగా తగ్గనున్న దిగుబడులతో వందల కోట్ల రూపాయల విలువైన ఉత్పత్తి నష్టం రైతులను కోలుకోలేని దెబ్బ తీసింది.

**ప్రతికూల పరిస్థితులకు ఎదురొడ్డి..**

ఖరీఫ్ సీజన్ ఆరంభం నుంచి అడుగడుగునా కూటమి ప్రభుత్వం ప్రదర్శించిన నిర్లక్ష్యానికి తోడు అతివృష్టి%–%అనావృష్టి వంటి ప్రతికూల వాతావరణ పరిస్థితులకు ఎదురొడ్డి రైతులు పంటలు సాగు చేశారు. ప్రభుత్వం అదునుకు విత్తనాలతోపాటు యూరియా అందించలేకపోయింది. ఆగస్టు 7వ తేదీ వరకు తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొనగా, ఆ తర్వాత కురిసిన అధిక వర్షాలు రైతులను ఉక్కిరిబిక్కిరి చేశాయి. ఓ వైపు పెట్టుబడులు తడిసి మోపెడైనా.. మరోవైపు ప్రభుత్వం పట్టించు కోకపోయినా మొక్కవోని పట్టుదలతో ఖరీఫ్ సాగు చేశారు.

ఈ ఏడాది సాగు లక్ష్యం 86.32 లక్షల ఎకరాలు కాగా, అతికష్టమ్మీద 72.90 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. లక్ష్యానికి మించి ఇప్పటి వరకు వరి, మొక్కజొన్న పంటలు మాత్రమే సాగయ్యాయి. 38.97 లక్షల ఎకరాల్లో వరి, 11 లక్షల ఎకరాల్లో పత్తి, 5 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 4.67 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు సాగయ్యాయి. వరి, మొక్కజొన్నకు ఎకరాకు రూ.25 వేల నుంచి రూ.30 వేలు, పత్తికి రూ.35 వేల నుంచి రూ.40 వేల వరకు పెట్టుబడి పెట్టారు. అయితే మొంథా తుపాను వల్ల దాదాపు 8 లక్షల ఎకరాలకు పైగా వరి, 1.14 లక్షల ఎకరాల్లో పత్తి, 1.15 లక్షల ఎకరాల్లో వేరుశనగ, 2 లక్షల ఎకరాల్లో మొక్కజొన్న, 1.9 లక్షల ఎకరాల్లో ఉద్యాన.. ఇతర పంటలకు నష్టం వాటిల్లింది.

**వరి పంటపై 30 శాతం ప్రభావం**

సాగైన వరి విస్తీర్ణంలో 30 శాతం పంటను తుపాను దెబ్బ తీసిందని తెలుస్తోంది. తుపాను ప్రభావిత జిల్లాల్లో దాదాపు 6%–%10 లక్షల ఎకరాలకు పైగా పంట ముంపునకు గురైనట్టుగా అంచనా. ఇతర పంటలన్నీ కలిపి మరో నాలుగైదు లక్షల ఎకరాల్లో దెబ్బతిన్నట్టు సమాచారం. లేటుగా నాట్లు వేసిన చోట పంట నిలదొక్కుకున్నప్పటికీ ముందుగా సాగైన చోట మాత్రం పంట చాలా వరకు దెబ్బతిన్నట్టు రైతులు చెబుతున్నారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని సెంట్రల్%–%ఈస్టర్న్ డెల్టా పరిధిలో పంటలు ఎక్కువగా దెబ్బతినగా, ఉత్తరాంధ్ర, కృష్ణా, పల్నాడు, బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, నంద్యాల, కర్నూలు జిల్లాల్లో కుండపోత వర్షాల వల్ల అపార నష్టం వాటిల్లినట్టుగా తెలుస్తోంది.

కృష్ణా, గోదావరి లంకల్లో అరటి, బొప్పాయి పంట దెబ్బతినగా.. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మిరప పంట దెబ్బతింది. కాగా రాష్ట్ర ప్రభుత్వం మాత్రం అధికారికంగా 396 మండలాల పరిధిలో 2,320 గ్రామాల్లో 1.38 లక్షల మంది రైతులకు సంబంధించి 2.82 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్టుగాప్రాథమికంగా అంచనా వేసింది. దాంట్లో ప్రధానంగా 1.79 లక్షల ఎకరాల్లో వరి, 75 వేల ఎకరాల్లో పత్తి, 15 వేల ఎకరాల్లో మినుము, 10 వేల ఎకరాల్లో మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నట్టుగా చెబుతోంది. నంద్యాల యార్డులో కొనేవారు లేక విక్రయానికి సిద్ధంగా ఉంచిన మొక్క జొన్న రాసులు తడిసిపోవడంతో రైతులు కన్నీరు పెడుతున్నారు.

**తగ్గనున్న దిగుబడులపై అన్నదాత గుబులు**

అధిక వర్షాల కారణంగా లక్షలాది ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. వర్షాలు పూర్తిగా తెరిపినిచ్చి, ముంపు నీరు కాస్త దిగినా ముంపునకు గురైన ప్రాంతాల్లోని పంట ఆశించిన దిగుబడి వచ్చే అవకాశాలు ఎంతమాత్రం లేవంటున్నారు. గతేడాది హెక్టారుకు 5,578 కిలోలు చొప్పున దిగుబడి రాగా, ఈ ఏడాది 5,543 కిలోలకు మించి రాదని మొదటి ముందస్తు అంచనాలను బట్టి లెక్కగట్టారు. కానీ ఈ తుపాను ప్రభావం వల్ల దిగుబడి కాస్త 4,000%–ు%4,500 కిలోలకు పడిపోతుందని తాజా అంచనా.

మొదటి ముందస్తు అంచనా ప్రకారం 81.87 లక్షల టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని అంచనా వేయగా, తుపాను ప్రభావం వల్ల 65 లక్షల టన్నులకు మించదని తెలుస్తోంది. మరొక వైపు గతేడాది పత్తి హెక్టార్‌కు 442 కిలోలు రాగా, ఈ ఏడాది 357 కిలోలు, మొక్కజొన్న గతేడాది 4,710 కిలోలు రాగా, ఈసారి 4,259 కిలోలు, కంది గతేడాది 171 కిలోలు రాగా, ఈసారి 117 కిలోలు, వేరుశనగ గతేడాది 258 కిలోలు రాగా, ఈ ఏడాది 149 కిలోల చొప్పున దిగుబడులొస్తాయన్నది మొదటి ముందస్తు అంచనా. అయితే తుపాను ప్రభావంతో కనీసం 20%–%30 శాతం మేర పంటల దిగుబడులు తగ్గిపోతాయని తెలుస్తోంది.

**పంట నష్ట పరిహారం పరిస్థితీ అంతే**

వైఎస్ జగన్ ప్రభుత్వం ఉండగా ఏ సీజన్‌కు సంబంధించిన పంట నష్టపరిహారాన్ని అదే సీజన్ ముగిసేలోగా అందజేసేవారు. ఇప్పుడా పరిస్థితి మచ్చుకైనా కన్పించడం లేదు. నిర్ణీత గడువులోగానే వ్యవసాయ, ఉద్యాన శాఖలు తుది అంచనాలు తయారు చేస్తున్నప్పటికీ పరిహారం మంజూరు విషయంలో మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. కరువు సాయంతో పాటు పంట నష్ట పరిహారాన్ని కూటమి ప్రభుత్వం ఎప్పటికప్పుడు ఎగ్గొడుతూనే వస్తోంది.

గడిచిన 17 నెలలుగా పెండింగ్ ఇన్‌పుట్ సబ్సిడీ బకాయిలు 5.50 లక్షల మంది రైతులకు సంబంధించి రూ.595 కోట్లకు పైగానే ఉన్నాయి. వీటిలో గతేడాది వరదలతో పాటు అకాల వర్షాలకు సంబంధించి 76.75 కోట్లు ఉండగా, ఖరీఫ్ 2024, రబీ 2024%–%25 సీజన్‌లకు సంబంధించి దాదాపు రూ.100 కోట్లకు పైగా కరువు సాయం రూ.వంద కోట్ల వరకు చెల్లించాల్సి ఉంది. సాంకేతిక కారణాలతో నిలిచిన ఖరీఫ్ 2023, రబీ 2023%–%24 సీజన్‌లకు సంబంధించి మరో రూ.311.39 కోట్లు కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టింది.

మొంథా తుపాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు దాదాపు రాష్ట్రంలోని సగం జిల్లాల్లో పంటలకు భారీ నష్టం వాటిల్లింది. రైతులను కదిలిస్తే చాలు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఒక్క నంద్యాల జిల్లాలోనే 1.05 లక్షల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లినట్లు స్పష్టమవుతోంది. కర్నూలు జిల్లాలో వేలాది ఎకరాల్లో వాణిజ్య, ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ఉమ్మడి చిత్తూరు, వైఎస్సార్ కడప, అనంతపురం జిల్లాల్లో వేలాది ఎకరాల్లో వేరుశనగ, వరి, టమాటా, ఉద్యాన పంటలు నీట మునిగాయి. ప్రకాశం జిల్లా వ్యాప్తంగా దాదాపు 33వేల ఎకరాల్లో పంటనష్టం వాటిల్లింది.

పల్నాడు జిల్లాలో ప్రధానంగా 43,375 ఎకరాల్లో పత్తి, 5,250 ఎకరాల్లో వరి, 3,048 ఎకరాల్లో మిర్చి పంటలు దెబ్బతిన్నాయి. బాపట్ల జిల్లాలో వరి, పత్తి, మినుము, సోయాబీన్, మిర్చి, అరటి, బొప్పాయి పంటలు.. మొత్తంగా 12,293 ఎకరాల్లో నెలకొరిగాయి. ఉమ్మడి కృష్ణా జిల్లాలో వరి పంటతోపాటు బొప్పాయి, అరటి, కూరగాయ పంటలకు అపార నష్టం వాటిల్లింది. 1,15,892 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలకు రూ.73.45 కోట్ల నష్టం జరిగినట్టు అంచనా. ఎన్టీఆర్ జిల్లాలోని 17 మండలాల్లో 42,483 ఎకరాల్లో వ్యవసాయ పంటలకు నష్టం వాటిల్లింది. విజయనగరం జిల్లాలో రూ.60 కోట్ల మేర పంట నష్టం వాటిల్లింది. శ్రీకాకుళం జిల్లాలో 6 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లింది. వేలాది కొబ్బరి చెట్లు పడిపోయాయి. పశ్చిమగోదావరి జిల్లాలో 10,309 ఎకరాల్లో పంట నీట మునగ్గా, ఈదురు గాలుల ధాటికి 16,072 ఎకరాల్లో వరి పంట నేలవాలింది. వేలాది ఎకరాల్లో ఆక్వా పంటకు నష్టం వాటిల్లింది. నల్లి క్రిక్ సముద్రపు ఆటుపోట్లతో చెరువుల గట్లు తెగి ముంపు బారిన పడ్డాయి. ఏలూరు జిల్లాలో 15 వేల ఎకరాల్లో వరికి నష్టం వాటిల్లింది. వర్షాలు, చలిగాలుల ప్రభావంతో చెరువుల్లో ఆక్సిజన్ లెవల్స్ తగ్గిపోతుండటం ఆక్వా రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. తూర్పుగోదావరి జిల్లాలో 16,092 హెక్టార్లలో వరి నేలకొరిగింది. వేలాది హెక్టార్లలో ఇతర పంటలు దెబ్బతిన్నాయి.

**ఉచిత పంటల బీమా ఉండి ఉంటే..**

? కూటమి ప్రభుత్వంలో పంటలకు ఈ%–%క్రాప్ లేదు.. ఇన్సూరెన్సూ లేదు.. ఇన్‌పుట్ సబ్సిడీ అంతంతే.. పెట్టుబడి సాయం రూ.40 వేలకు గాను తూతూ మంత్రంగా కొద్ది మందికే రూ.5 వేలు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఒక్క పంటకూ గిట్టుబాటు ధర లేదు. ఉల్లి, టమాటా పంటలకు కూలి కూడా దక్కక పశువులకు వదిలేస్తున్న దీన స్థితి. కూటమి ప్రభుత్వం ఆర్బీకేలను పూర్తిగా నిర్వీర్యం చేసి రైతులకు తీవ్ర అన్యాయం చేసింది. రైతులకు విత్తనాలు, ఎరువులు అందకుండా చేసింది. ఉచిత పంటల బీమా పథకం ఉండి ఉంటే ఇలాంటి విపత్తు వేళ రైతులకు అక్కరకొచ్చేది. నూరు శాతం కవరేజీతో నోటిఫై చేసిన పంటలకు సాగు చేసిన ప్రతి ఎకరాకు బీమా రక్షణ లభించేది. కానీ ఇప్పుడా పరిస్థితి లేకుండాపోయింది. కూటమి ప్రభుత్వం ఈ పథకాన్ని అటకెక్కించి స్వచ్ఛంద నమోదు పద్ధతిన పంటల బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ప్రీమియం భారం కావడంతో ఈ పథకంలో చేరేందుకు రైతులెవ్వరూ ముందుకు రాలేదు.

ఉచిత పంటల బీమా పుణ్యమా అని ఖరీఫ్%–%2024లో 84.80 లక్షల మంది రైతులు 69.51 లక్షల ఎకరాల్లో సాగు చేసిన పంటలకు బీమా రక్షణ పొందగలిగారు. ఉచిత పంటల బీమాను ఎత్తివేయడంతో రబీ 2024%–%25 సీజన్‌లో 9.93 లక్షల ఎకరాలకే పరిమితం కాగా, 7.65 లక్షల మంది రైతులు మాత్రమే బీమా కవరేజ్ పొందలిగారు. ఖరీఫ్ 2024%–%25 సీజన్‌లో 19.60 లక్షల ఎకరాల్లో మాత్రమే బీమా కవరేజ్ లభించగా, 19.51 లక్షల మంది బీమా చేయించుకోగలిగారు. 2024 జూన్‌లో చెల్లించాల్సిన రూ.930 కోట్ల ప్రీమియం బకాయిలను కూటమి ప్రభుత్వం ఎగ్గొట్టడంతో 2023%–%24 సీజన్‌కు సంబంధించి రూ.1,385 కోట్లు నేటికీ రైతులకు అందని పరిస్థితి నెలకొంది. మరొక వైపు ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఖరీఫ్ 2024 సీజన్‌కు రూ.894.62 కోట్లు, రబీ సీజన్‌కు రూ.758.74 కోట్లు, ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రూ.774.87 కోట్లు చొప్పున రాష్ట్ర ప్రభుత్వం తన వాటా ప్రీమియం చెల్లించాల్సి ఉండగా, ఒక్క పైసా కూడా చెల్లించిన పాపాన పోలేదు. ఫలితంగా పంటల బీమా పరిహారం అందని ద్రాక్షగా మారింది.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి


పంట నష్టం అంచనాలు పక్కాగా రూపొందించాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో మాదిరిగా తూతూ మంత్రంగా చేపట్టుడం కాకుండా, పక్కాగా చేపట్టి సాధ్యమైనంత త్వరగా రైతుల ఖాతాకు పరిహారం జమ చేయాలని, పెండింగ్ బకాయిలు కూడా చెల్లించాలని కోరుతున్నాయి. ఎన్నికలకు ముందు జనసేన అధినేత పవన్ కళ్యాణ్ గోదావరి జిల్లాల పర్యటన సందర్భంగా విపత్తుల్లో దెబ్బతిన్న వరి పంటకు ఎకరాకు రూ.25 వేలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారని, ఇప్పుడు డిప్యూటీ సీఎంగా ఆ మాటను నిలబెట్టు కోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. ఉచిత పంటల బీమాను కొనసాగించి, నూరు శాతం పంటల బీమా వర్తింప చేయాలని, దెబ్బతిన్న ప్రతి ఎకరాకు ప్రభుత్వమే బాధ్యతగా తీసుకొని పంటల బీమా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేస్తున్నాయి. తుపాను అనంతరం పంటలను కాపాడుకునేందుకు పంటను బట్టి ఎకరాకు రూ.5 వేల నుంచి రూ.8 వేల వరకు రైతులకు ఖర్చవుతుందని అంచనా. ఇందు కోసం ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసి, లేబరు ఖర్చును పూర్తిగా ఈ పథకం కింద ఖర్చు చేసేలా చర్యలు తీసుకోవాలని రైతు సంఘాల నేతలు డిమాండ్ చేస్తున్నారు.





# మొత్తానికి క(న)ష్టాలనే మిగిల్చి తలొగ్గిన "మొంథా"

◆ ఎక్కడికక్కడ చెట్లు కుప్పకూలాయి ◆ విద్యుత్తు స్తంభాలు నేలకొరిగాయి ◆ విద్యుత్తు తీగలూ తెగిపడ్డాయి ◆ గ్రామాల్లో రేయంతా చీకట్లు కమ్ముకున్నాయి ◆ తాగునీటి కొరత సమస్య పట్టి పీడించింది ◆ నేటి నుంచి పాఠశాలలు యధాతథం









**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో తన ప్రభావాన్ని అంత ప్రబలంగా చూపెట్టక పోయినప్పటికి మొత్తానికి ప్రజలను, ప్రభుత్వ అధికార యంత్రాంగాన్ని ముప్పుతిప్పలు పెట్టింది. తాను చేయగలిగినంత నష్టాన్ని కలిగించింది. ఇటు సాధారణ ప్రజలు మొదలుకొని రైతులు, వ్యాపారులు, కుటీర పరిశ్రమలు, ప్రైవేట్ రవాణా వ్యవస్థలో తనదైన కష్టాలను, నష్టాలనూ మిగిల్చింది. నియోజకవర్గం మొత్తం మీద తుఫాను వల్ల ఎంత నష్టం సంభవించిందో ఇంకా గణాంకాల జోలికి అధికారం పోలేదు. ఇంకా పునరావాస, సహాయక చర్యల్లోనే అధికార యంత్రాంగం, ప్రజా ప్రతినిధులు మునిగి తేలుతున్నారు. ఇటు అధికారులు, ప్రజా ప్రతినిధులు తమ ఇళ్ళూ, కార్యాలయాలను మరచి గూడు విడిచిన పక్షుల్లా గ్రామాలు, మురుగునీటి, సాగునీటి కాలువలు, చెరువులు, జలాశయాలు, వ్యవసాయ క్షేత్రాలు, పునరావాస కేంద్రాల తట్టు పర్యటిస్తూ ఎక్కడి కక్కడ ప్రజలతో మమేకం అవుతూ ఉన్నారు. వారి శాయశక్తులా ప్రజల కష్ట, నష్టాల్లో పాలు పంచుకుంటూ ప్రభుత్వం సూచించిన ఉపశమన మార్గాలను ప్రజలకు చేరువ చేస్తున్నారు. ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల తరఫున గ్రామాల్లో సచివాలయాల్లో అత్యవసర ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తూ, సిబ్బంది వంతులు వారీ విధులను నిర్వహిస్తూ ప్రజారోగ్య పరిరక్షణలో నిమగ్నమై ఉన్నారు.

**ఏడాదిలో అప్పన్నపాలెం వంతెన పూర్తి చేస్తాం ...**

కాకినాడ జిల్లాలోని మొంథా తుఫానుకు జిల్లా వ్యాప్తంగా జన జీవనానికి పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రత్తిపాడు నియోజక వర్గంలోని ఏలేశ్వరం మండలం ఏలేశ్వరం గ్రామం ఏలేరు జలాశయం, శంఖవరం మండలం అన్నవరంలోని పంపా జలాశయం, శంఖవరంలోని బొర్రా పెదబాపన్నదొర చెరువు పూర్తిగా నిండిపోయాయి. నియోజకవర్గం ఆవలి ప్రాంతంలోని కొండల ఎగువ ప్రాంతాల్లో ఈ మూడు రోజులూ కురిసిన వర్షాలకు భారీగా వరద నీరు ఏలేరు జలాశయానికి వచ్చి చేరింది. ఈ జలాశయం ఆయకట్టు ప్రాంతంలోని పొలాలు, సమీప గ్రామాల ప్రజల భద్రత దృష్ట్యా ముందస్తు జాగ్రత్త చర్యగా సుమారు 5,000 క్యూసెక్కుల నీటిని జలాశయం నుండి దిగువకు నీటి పారుదలశాఖ అధికారులు బుధవారం విడుదల చేశారు. ఈ నేపథ్యంలో ఏలేరు ప్రాంతంలోని పరిస్థితులను కాకినాడ ఎంపీ సానా సతీష్ బాబు, జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్ కుమార్, స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, తోట నవీన్ కలిసి ప్రత్యక్షంగా పరిశీలించారు. తరచుగా వరద నీటి ముంపు సమస్యలను ఎదుర్కొంటున్న ఏలేరు జలాశయం దిగువ ప్రాంతాల ప్రజలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు ఏలేరు ఆధునీకరణ పనులను త్వరలో చేపడతామని ఈ సందర్భంగా ప్రజలకు నేతలు హామీ ఇచ్చారు. అనంతరం అప్పన్న పాలెం వంతెనలను పరిశీలించారు. ఈ వంతెన గతంలో కూలిపోవడంతో జగ్గంపేట నియోజకవర్గం వరకూ 10 గ్రామాలకు రాకపోకలు స్తంభించి పోయాయి. ఈ గ్రామ ప్రజలు చుట్టూ తిరిగి వెళ్ళవలసి వస్తోంది. ఈ వంతెన పునర్నిర్మాణానికి రూ. 14 కోట్ల నిధులు మంజూరుకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ లోగడ పంపించారు. వంతెన నిర్మాణం త్వరలో ప్రారంభమవుతుందని ఏడాది లోపు పూర్తి చేస్తామని ఎంపీ. సానా సతీష్ బాబు గ్రామస్తులకు తెలిపారు. ప్రజల సమస్యలను శాశ్వతంగా పరిష్కరించడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**పంపాలోకి భారీగా వరదనీరు ...**

కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలం అన్నవరం పంపారిజర్వాయర్లోకి ఎగువ ప్రాంతాల నుండి భారీగా వరదనీరు చేరుతోంది. మొంథా తుఫాన్ ప్రభావం వల్ల ఎగువ ప్రాంతం నుండి వర్షం నీరు పంపాలోకి వస్తుండటంతో ఇన్ ఫ్లో పెరిగి పంపా నీటి సామర్థ్యం గరిష్టస్థాయికి చేరుకుంటోంది. పంపా జలాశయం గర్భంలోని నీటి నిల్వ సామర్థ్యం 103 అడుగులు కాగా మంగళవారం నాటికి 98 అడుగుల నీటి మట్టానికి చేరుకుంది. బుధవారం నాటికి అది గరిష్ఠ స్థాయికి చేరుకునే అవకాశం ఉన్నందున మంగళవారమే నీటి పారుదల శాఖ అధికారులు 2 వ నంబర్ వరద గేటును ఎత్తారు. పంపాలోకి వచ్చే అదనపు నీరు ఉధృతంగా ఉండటం వలన ఇరిగేషన్ అధికారులు ముందస్తు జాగ్రత్తగా రెండవ నెంబరు వరద గేటు ద్వారా అదనపు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. రిజర్వాయర్లోకి చేరే ఇన్ ఫ్లో 750 క్యూసెక్కులు కాగా వరద గేటు ద్వారా ఔట్ ఫ్లో 650 క్యూసెక్కుల జలాలు బయటకు పోతున్నాయని, తుఫాను తీవ్రత అధికంగా ఉన్న దృష్ట్యా నీటి నిల్వ పెరిగితే మరిన్ని వరద గేట్ల ద్వారా అదనపు జలాలు దిగువకు విడుదల చేస్తామని ఇరిగేషన్ అధికారులు ప్రకటించారు. అయితే వరద నీరు సముద్రంలోకి వెళ్ళే క్రమంలో తొండంగి మండలం గ్రామాల్లోని లోతట్టు ప్రాంతాల్లోని వారికి ముప్పు పొంచి ఉండటం వలన ప్రజలను అధికార్లు అప్రమత్తం చేశారు. అత్యవసరాలకు జెసిబిలు, ట్రాక్టర్లను సిద్ధం చేసారు.

**చెట్టు కూలి రవాణాకు అంతరాయం ....**

మాయదారి మొంతా తుఫానుకు అనేక పకృతి నష్టాలు సంభవిస్తున్నాయి. అవి ఒక్కొక్కటిగా ఆలస్యంగా వెలుగు చూస్తున్నాయి. శంఖవరం మండలం నెల్లిపూడిలో బుధవారం ఉదయం 5.30 గంటలకు చెట్టు కూలి రోడ్డుకు అడ్డంగా పడి కత్తిపూడి శంఖవరం గ్రామాల మధ్య 1 గంటసేపు రవాణాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. నెల్లిపూడి నుంచి కత్తిపూడి వైపు వెళ్ళే దారిలో బీరువాల తయారీ ఖారా?నా వద్ద ఈ చెట్టు కూలిపోయింది. అయితే దీని వల్ల ఎవరికీ ఏం ప్రమాదం సంభవించలేదు. ఉదయాన్నే శంఖవరం కార్యాలయానికి వస్తున్న మండల తాహసిల్దార్ అల్లాడి తాతారావు సంఘటనను గమనించి రాష్ట్ర టి.ఎన్.ఎస్.ఎఫ్. కార్యనిర్వాహక కార్యదర్శి బద్ది రామకృష్ణకు విషయాన్ని వివరించారు. సహాయక చర్యలను చేపట్టాలని సూచించారు. దీంతో బద్ది రామకృష్ణ స్థానికులతో సమస్యను అప్పటికప్పుడే పరిష్కరించారు.

**తుఫానుకు కొన్ని ఇళ్ళకు పాక్షిక నష్టం ...**

శంఖవరం మండలం శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లోని కొన్ని ఇళ్ళకు మోంతా తుఫాన్ పాక్షిక నష్టం కలిగించింది. తూఫాన్ గాలులకు కత్తిపూడిలోని 3 వ వార్డులో కొజ్జారపు సందయ్యా, వాడపాటి అప్పారావు రెండు కుటుంబాలూ నివాసం ఉంటున్న పెంకిటిల్లుకు నష్టం సంభవించింది. ఈ వర్షాలకు బాగా తడిసిన ఇంటి గోడ పాక్షికంగా కూలింది. ఇంటి పైకప్పు కూడా చెదిరిపోయి పెంకులు విరిగి పోయి నష్టం సంభవించింది. శంఖవరం 1 వార్డులోని జక్కల మాణిక్యం పెంకుటిల్లు వర్షాలకు తడిసి ముద్దై ఇంటి పైకప్పు ఛిద్రమై ఇంటిలోకి వర్షం నీరు చేరి పోతూ గోడలు తడిసి పోతున్నాయి. ఫలితంగా ఇంటి నాలుగు గోడలూ నెర్రలు బారాయి. ఈ ఇల్లు ఎప్పుడు కూలుతుందో... ఏం ప్రమాదం ముంచుకూ వస్తోందోనని ఆ గృహస్తురాలు ఆందోళన చెందుతోంది. అలాగే ఈమె కుమారుడు జక్కల నాగసత్యానారాయణకు చెందిన డాబా ఇల్లు కూడా ఈ వర్షాలకు స్లాబు నుంచి బాగా నీరు ఇంకుతోంది. గదుల్లో పూర్తి నివాస యోగ్యంగా లేదు. గోడలు గుండా కిందకు నీరు చిమ్ముకుంటూ వస్తోంది.

**వెంటాడుతున్న నిరంతర విద్యుత్తు అంతరాయం ...**

నంగనాచి మొంథా తుఫాను కారణంగా ప్రత్తిపాడు నియోజకవర్గంలో నిరంతరం విద్యుత్తు సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. మంగళవారం రోజు మొత్తం మీద గరిష్ట సమయం పాటు విద్యుత్తు సరఫరా నిలచి పోయింది. ఇటు మైదాన ప్రాంతాలో పాటు అటు గిరిజన గ్రామాల్లోనూ, అలాగే అటవీ ప్రాంతాల్లోనూ చెట్లూ, వాటి కొమ్మలు విద్యుత్తు తీగలపై పడి తీగలు తెగిపోయి విద్యుత్తు సరఫరా తరచుగా నిలచిపోతోంది. దీంతో రేయింబవళ్ళ ప్రజల దైనందిన కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడుతోంది. రాత్రిళ్ళు విద్యుత్తు సరఫరా లేక చిమ్మ చీకటిలో దోమల పోరుతో నిద్రలేమితో కాలం వెళ్ల బుచ్చాల్సి వస్తోంది. ఇక పంచాయతీల రక్షిత తాగు నీటి సరఫరా వ్యవస్థ విద్యుత్తు యంత్ర పరికరాలు పనిచేయక తాత్కాలికంగానైనా తీవ్ర తాగు నీటి కొరత సమస్యలను ఎదుర్కొంటున్నారు. రౌతులపూడి మండలం ఏ.మల్లవరం గ్రామంలో మంగళవారం విద్యుత్తు సరఫరా లేకపోవడంతో తాగునీటి సమస్య ఎదురైంది. అయితే సకాలంలో జనరేటర్లను అమర్చి ప్రజలకు తాగు నీటిని అందించి సమస్యను పరిష్కరించారు. ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సూచన మేరకు రౌతులపూడి గ్రామంలో ముంపు ప్రాంత కాలనీల్లో తుఫాను వరద ముంపు నుంచి రక్షణకు నీరు నిల్వ ఉండకుండా ముందస్తుగా మురుగునీటి కాలువల్లోని పూడికలను రెవిన్యూ అధికారులు బుధవారం తొలగించారు. బుధవారం సాయంత్రానికి తుఫాను ప్రభావం తగ్గడంతో గురువారం ఉదయం నుంచి యధావిధిగా పాఠశాలలను పునఃప్రారంభించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ బుధవారం సాయంత్రం ప్రకటించింది.

# రైతుల పంట రుణాలన్నీ పూర్తిగా మాఫీ చేయాలి..

### మొంథా తుఫాన్ బీభత్సం..కోలుకోలేని భారీ నష్టం - ప్రభుత్వం తక్షణమే స్పందించాలి - మాజీ ఎంపీ జి.వి.హర్ష కుమార్ విజ్ఞప్తి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతుల పంట రుణాలన్నింటినీ బేషరతుగా, పూర్తిగా మాఫీ చేయాలని మాజీ పార్లమెంట్ సభ్యులు జి.వి. హర్ష కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ తుఫాన్ వల్ల జరిగిన పెను నష్టాన్ని వివరిస్తూ, ఇది రైతాంగాన్ని పూర్తిగా కుంగదీసిందని, ప్రభుత్వం నుండి గణనీయమైన సహాయం అందకపోతే వారు కోలుకోలేని తీవ్ర నష్టాల్లో కూరుకుపో యారని, ఈ దఫా రైతులు పంటపై తీసుకున్న రుణాన్ని పూర్తిగా మాఫీ చేయాలి. మొంత తుఫాన్ రైతులకు తీరని నష్టం కలిగించింది. తుఫాన్ ప్రభావంతో పంటలు పూర్తిగా దెబ్బతినడం, వ్యవసాయ మౌలిక సదుపాయాలు నాశనం కావడం మరియు పశుసంపద నష్టపోవడం వంటి కారణాలతో రైతాంగం తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టబడింది.ఈ విపత్తు తీవ్రతను ఎదుర్కోవడానికి సాధారణ సహాయక చర్యలు లేదా పాక్షిక మాఫీలు సరిపోవని, "రైతులు తమ పంటను, ఆదాయాన్ని మరియు తదుపరి సాగుకు అవసరమైన పెట్టుబడిని - సర్వస్వం కోల్పోయారు. తిరిగి చెల్లించే మార్గం లేని అప్పుల ఊబిలో వారు చిక్కుకున్నారు,అని ఆయన పేర్కొన్నారు. "రుణాలను రీషెడ్యూల్ చేయడం వల్ల ఈ సమస్య పరిష్కారం కాదు. పూర్తి మాఫీ మాత్రమే దీనికి ఏకైక ఆచరణాత్మకమైన, న్యాయమైన పరిష్కారం." రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు దీనిని ఒక అసాధారణ సంక్షోభంగా పరిగణించి, తక్షణమే స్పందించాలని హర్ష కుమార్ విజ్ఞప్తి చేశారు. నష్టాన్ని వెంటనే అంచనా వేయాలని, కష్టాల్లో ఉన్న రైతులకు నిజమైన ఉపశమనం అందించడానికి మరియు తీవ్ర వ్యవసాయ సంక్షోభాన్ని నివారించడానికి సమగ్ర రుణ మాఫీ ప్యాకేజీని వెంటనే ప్రకటించాలని ఆయన పిలుపునిచ్చారు.

# రాజమండ్రిలో తుఫాన్ బాధితులకు ఊరట

### గుడ్ కేర్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో పలు సేవలు



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ తీవ్రతకు బాధితులైన కొన్ని కుటుంభములు రాజమండ్రి పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న నిరాశ్రయులకు రాజమండ్రి లయన్స్ క్లబ్ మైత్రి, రాజమండ్రి అలయన్స్ క్లబ్ సహేలి సహకారంతో దాదాపు 150 కుటుంబాలకు చెందిన స్త్రీలు, పురుషులు, పిల్లలు మొదలైన వారికి దుప్పట్లు, చాపలు, రగ్గులు బ్రెడ్స్, బిస్కెట్లు మరియు నిత్యావసర వస్తువులు అందజేయడమైనది. బాధితులకు ధైర్యం, సహాయం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లాయర్ కావూరి సురేష్ కుమార్, లయన్స్ క్లబ్ మైత్రి వారు మరియు అలియన్స్ క్లబ్ ప్రెసిడెంట్ శ్రీదేవి, సెక్రటరీ శిల్ప,వి ఫర్ పీపుల్స్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ సన్నీ,కావూరి వరలక్ష్మి,అక్కడ సహాయక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### పంటల నష్టం కారణంగా

# అప్పుల ఊబిలో పడిన రైతులు

### పందలపాకలో తుఫాను కారణంగా వరిచేన్లకు భారీ నష్టం..
### పరిశీలించిన మాజీ మంత్రి చెల్లుబోయిన, డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి





**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో తుఫాను ప్రభావంతో వరిచేన్లు నేలమట్టం అయ్యాయి. 80 శాతం వరిచేన్లు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రభుత్వం వెంటనే కౌలు రైతులను ఆదుకోవాలని చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. అనపర్తి నియోజకవర్గం బిక్కవోలు మండలం పందలపాక గ్రామంలో 'మొంథా' తుఫాను ప్రభావంతో వరిచేన్లు నేలమట్టం అయ్యాయి. రైతులు భారీ నష్టాన్ని చవిచూశారు. ముఖ్యంగా కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. గత వైయస్ఆర్సీపీ ప్రభుత్వ హయాంలో ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వంలో అమలైన 'రైతు భరోసా' కార్యక్రమం ద్వారా ప్రభుత్వం పంట నష్టాన్ని భరిస్తూ, ఇన్సూరెన్స్ రిజిస్ట్రేషన్ (క్రాప్ బుకింగ్)ను సక్రమంగా నిర్వహించేది. పంటల నష్టం కారణంగా అప్పుల ఊబిలో పడిన రైతులు కూడా ఉన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి, కౌలు రైతుల పంట నష్టానికి తగిన పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలి. రైతులకు భరోసా కల్పించడం, ఇన్సూరెన్స్ సాయం సమర్థవంతంగా అందించడం తక్షణ అవసరం. రైతుల కష్టాలను తగ్గించేందుకు, ఆర్థిక నష్టాన్ని నియంత్రించేందుకు ప్రభుత్వం ప్రాథమిక చర్యలు చేపట్టాలని తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్సీపీ అధ్యక్షులు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ, అనపర్తి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సబ్బెళ్ళ కృష్ణారెడ్డి (అనపర్తి వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, తూర్పుగోదావరి జిల్లా వైయస్ఆర్సీపీ అధికార ప్రతినిధి),సత్తి హరిప్రసాద్ రెడ్డి(గ్రామ శాఖ అధ్యక్షులు), పోతుల వరప్రసాద్ రెడ్డి (బుజ్జి)(బిక్కవోలు మండల వైయస్ఆర్సీపీ కన్వీనర్), బొడ్డు ముత్యాలరావు (వైయస్ఆర్సీపీ రాష్ట్ర బూత్ కమిటీ సెక్రటరీ), రొంగల అప్పాజీ(అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్సీపీ ప్రచార కమిటీ అధ్యక్షులు), లపతి సత్యనారాయణ(మాజీ జడ్పీటీసీ), పాలచర్ల అబ్బు, గండి వాసు, గొలుగూరి సత్యనారాయణ రెడ్డి, మచ్చ బుజ్జి, కర్రి ఇస్రారెడ్డి, పడాల వీర రాఘవ రెడ్డి, గోరపల్లి సీతారామయ్య, వంక శీను, నల్లమిల్లి సుబ్బారెడ్డి, మల్లిడి తాత కాపు, గొరపల్లి మల్లేష్, వెంకటేష్ మాడెం(పంచాయతీ 14వ వార్డు సభ్యులు), వీర్రాజు కోసూరి, శ్రీను ఇల్లపు, పెంటకోటి శ్రీను,పడాల దుర్గారెడ్డి,కర్రి మణికంఠ తదితర వైయస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


విశ్వవాయిస్

# ఎడిటర్ వాయిస్

## సమస్యలు పట్టని బిహార్ ఎన్నికలు!

బిహార్ రాష్ట్రంలో ఎన్నికలు రానున్నాయి. ఈ ఎన్నికలు నవంబర్ మొదటి వారంలో జరగనున్నాయి. రెండు దశల్లో పోలింగ్ ఉంటుంది. మొదటి దశ నవంబర్ 5న. రెండో దశ నవంబర్ 13న. ఇది రాష్ట్ర అసెంబ్లీకి సంబంధించినది. ఎన్నికల కమిషన్ దీన్ని ప్రకటించింది. ఈ ఎన్నికల్లో హింస పెద్ద ఎత్తున చెలరేగే అవకాశం ఉంటుందని అక్కడ ప్రజలు భయపడుతున్నారు. బిహార్ ఎన్నికలకు భారీ భద్రత ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఎన్నికల కమిషన్ 4.5 లక్షల మంది పోలింగ్ సిబ్బందిని నియమించింది. 2.5 లక్షల మంది పోలీసులు ఉన్నారు. 470 మంది కేంద్ర పరిశీలకులు పని చేస్తారు. ప్రతి నియోజకవర్గంలో ఇతర రాష్ట్రాల నుంచి ఐఏఎస్ అధికారులు ఉంటారు. సీఆర్‌పీఎఫ్, బీఎస్ఎఫ్, ఐటీబీపీ వంటి బలగాల నుంచి లక్ష మంది మోహరించారు. 1200 కంపెనీల సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్స్ వస్తుంది. గయా జిల్లాలో 21 కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇది ఇంతకు ముందు ఎన్నడూ లేని భద్రత. బిహార్ ఎన్నికలు ఇతర రాష్ట్రాలకు భిన్నంగా ఉంటాయి. హింస, నేరాలు ఎక్కువ జరిగే అవకాశాలు ఉంటాయి. నేపాల్ సరిహద్దులోని ఏడు జిల్లాల్లో 21 సీట్లు ప్రభావితమవుతాయి. ఇది ఎన్నికల్లో ఒక సవాలు. బిహార్ రాష్ట్రం నేరాలకు నిలయం. రాష్ట్ర క్రైమ్ రికార్డ్ బ్యూరో ప్రకారం ప్రతి నెలా 229 హత్యలు జరుగుతున్నాయి. రోజూ హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు ఉంటాయి. 2023 ఎన్‌సీఆర్‌బీ డేటా ప్రకారం మర్డర్ రేట్ 2.0 పెర్ 100,000. కిడ్నాపింగ్ రేట్ 8.2. రేప్ రేట్ 4.4. మహిళలపై నేరాలు 16.3 శాతం పెరిగాయి 2018-2022 మధ్య. ప్రతి రోజు 953 నేరాలు జరుగుతున్నాయి. అందులో 8 హత్యలు, 33 కిడ్నాప్‌లు, 55 మహిళలపై నేరాలు. నితీశ్ కుమార్ 20 ఏళ్లుగా ముఖ్యమంత్రి. అయినా ఆ రాష్ట్ర నేర చరిత్రలో మార్పు లేదు. పోలీసు ఉన్నతాధికారులు కూడా ఇదే విషయాన్ని ఒప్పుకుంటున్నారు. అక్కడ న్యాయ వ్యవస్థ కూడా నేరాలను అరికట్టలేకపోతోంది. ఈ రాష్టంలో శాంతి భద్రతల పరిరక్షణ పెద్ద గుదిబండ సమస్యగా ఉంది. బిహార్ ఆర్థికంగా వెనుకబడిన రాష్ట్రం. పేదరికం 33.76 శాతంగా ఉంది. ఇది దేశంలో అత్యధికం. నీతి ఆయోగ్ మల్టీడైమెన్షనల్ పావర్టీ ఇండెక్స్ ప్రకారం బిహార్ లాస్ట్ ర్యాంక్‌లో ఉంది. తలసరి ఆదాయం దేశ సగటు కంటే తక్కువ. స్థూల దేశీయోత్పత్తి కూడా తక్కువ. అన్‌ఎంప్లాయ్‌మెంట్ రేట్ 3.9 శాతం . దేశ సగటు 3.2 శాతం కంటే ఎక్కువ. మహిళల లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ చాలా తక్కువ. 60 శాతం జనాభా 30 ఏళ్ల లోపు వారే. వారికి ఉద్యోగాలు లేవు. దీంతో శాంతిభద్రతల సమస్యలు పెరుగుతున్నాయి. లక్షలాదిమంది యువత చిన్నాచితక పనుల కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోతున్నారు. 74.5 లక్షల మంది బిహారీలు బయట రాష్ట్రాల్లో పని చేస్తుకొని దుర్భరంగా బ్రతుకుతున్నారు. బిహార్ అభివృద్ధి లేకుండా మిగిలిపోయింది. 20 ఏళ్ల క్రితం లాలూ ప్రసాద్ పాలనలో ఆటవిక రాజ్యం అని బీజేపీ విమర్శించింది. 2005 నుంచి జనతాదళ్ (యు) అధికారంలో ఉంది. 15 ఏళ్లు బీజేపీ భాగస్వామి. అయినా బీహార్ రాష్ట్రం నిరుపేదగానే మిగిలిపోయింది. సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం, విద్య, పాలనలో ఇలా అన్ని విధాలా బిహార్ అధమ స్థానంలో ఉంది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం 35 వేల రైల్వే ఉద్యోగాలకు కోసం కోటి మంది అప్లై చేశారు. ఎంపికలో అక్రమాలు జరిగాయని విద్యార్థులు ఆందోళన చేశారు. రైళ్లకు నిప్పు పెట్టారు. కాల్పులు జరిగాయి. ఎన్నికల ముందు పార్టీలు ఉద్యోగాలు ఇస్తామని హామీలు ఇస్తాయి. కానీ అవి నినాదాలుగా మిగులుతాయి. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం బిహార్ లో అత్యధిక పేదరికం, నిరుద్యోగం సమస్యలు ఉన్నాయి. కుల సర్వేలో 94 లక్షల మంది రోజుకు 200 రూపాయల కంటే తక్కువ ఆదాయంతో జీవిస్తున్నారు. 10 వ ,తరగతి పూర్తి చేసుకున్న వారు కేవలం 10 శాతం మాత్రమే. బిహార్ రాజకీయాలు ఎంత సేపు దారిద్ర్యం, వలసలు, పాలనా వైఫల్యాలు, హింస, కులతత్వం, అవినీతి చుట్టూ తిరుగుతుంటాయి. ప్రజలను ఉచితాలతో మభ్యపెట్టడం అక్కడ సర్వ సాధారణం అయిపోయింది. ఇక్కడ విద్యా వ్యవస్థ అధ్వాన్నంగా తయారైంది. బీజేపీ సంకీర్ణ ప్రభుత్వాన్ని సపోర్ట్ చేస్తోంది. మోదీ ప్రభుత్వం లక్షల కోట్ల ప్రాజెక్టులు పేపర్ పై ప్రకటినలను గుప్పిస్తుంది. కానీ ఆచరణలో అమలైన దాఖలా లేదు. ఉపాధి కల్పన లేదు.

బిహార్ రూపురేఖలు గత 15 ఏళ్ళ పాలనలో మారలేదు. దీనికి నితీష్ కుమార్, మోదీ



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# ఉద్యోగ కల్పనకు చిన్న పరిశ్రమలే దిక్కు!



ప్రపంచవ్యాప్తంగా మైక్రో, స్మాల్ మీడియం ఎంటర్ప్రైజెస్‌లే ఆర్థిక అభివృద్ధి పరంగా మొత్తం పారిశ్రామిక రంగానికి ఇంజన్‌లాగా పనిచేస్తున్నాయని ఆర్థికవేత్తలు గుర్తించారు. 145 కోట్ల మంది జనాభా గల మన దేశంలో పేదరికం పోవాలన్నా, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నా, ఆదాయ అసమానత్వం తగ్గాలన్నా.. సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమలు ఎంఎస్ఎంఇ ల అభివృద్ధితోనే సాధ్యం. మన దేశంలో ఎప్పటి నుంచో అంటే 1905 స్వదేశీ ఉద్యమం ద్వారా చేపట్టిన కుటీర పరిశ్రమల స్వదేశీ ఉత్పత్తులను అభి వృద్ధి పరచుకునేందుకు ఆనాడు స్వాతంత్ర్య సంగ్రామాన్నే నడిపించడం జరిగింది. ఈఎంఎస్ఎంఇ ల ద్వారా నేడు మనదేశంలో 97% ఉద్యోగ కల్పన జరుగుతున్నది. భారీ పరిశ్రమల ద్వారా కేవలం 3 శాతం మాత్రమే ఉద్యోగిత ప్రజలకు లభిస్తున్నది. కుటీర పరిశ్రమల రంగంలో ప్రస్తుతం దేశంలో 6.3 కోట్ల సంస్థలు ఎనిమిది వేల రకాల ఉత్పత్తులను చేస్తూ మన స్థూల జాతీయ ఉత్పత్తికి 30 శాతం కల్పిస్తున్నాయి. దేశ పారిశ్రామిక ఉత్పత్తిలో ఇది 33 శాతంగా ఉంది. ఈ పరిశ్రమలన్నీ అసంఘటిత రంగంలో ఉన్నాయి. వీటిని సంఘటిత పరచి ఆర్థిక పరమైన సాంకేతిక పరమైన తదితర సబ్సిడీలు కల్పిస్తే చిన్న తరహా పరిశ్రమలు ఉపాధి కల్పనలో ఆదాయాలు పెంపొందించడంలో దేశంలో ప్రధానమైన పాత్ర పోషిస్తాయి. అభివృద్ధి అంటే అందరి వృద్ధి.. అంతేగాని కొందరి వృద్ధి మాత్రం కాదని గాంధీజీ అన్నారు. దేశ ఆదాయం ఎంత అనేది ముఖ్యం కాదు.. ప్రజలకు కనీస అవసరాలు అయినా తిండి, బట్ట, విద్య, వైద్యం ఏ మేరకు పొందగలుగుతున్నారు అనేది ముఖ్యం అన్నారు. ప్రభుత్వాలు ప్రజల సేవకులుగా పనిచేయాలి కానీ.. పెత్తందారులుగా ప్రజలపై జులుం చేయించకూడదు అన్నారు. ప్రజల కనీస అవసరాలు తీర్చే విధంగా పాలన చేసేదే రాజ్యం. గాంధీజీ ప్రకారం పెట్టుబడిదారీ వ్యవస్థ నిరుద్యోగాన్ని నిర్మూలించలేదు. పరిపాలన విధానాలు చట్టాల ద్వారా అందరికీ క్షేమం అనిపించేదే రాజ్యం. 1920లో బ్రిటిష్ పెట్టుబడిదారులను వ్యతిరేకించిన భారతీయ పెట్టుబడిదారులు తర్వాత వారితో లాలూచీ పడ్డారు. అందుకే స్వదేశీ, విదేశీ ఫైనాన్స్ పెట్టుబడిదారులు చారిత్రక నేపథ్యం తెలుసుకోకుండా.. వారి స్వలాపేక్ష విధానాన్ని అర్థం చేసుకోకుండా మన ఆర్థిక వ్యవస్థను పెట్టుబడిదారులకు అప్పగించడం ఎంతవరకు సమంజసమో? పాలకులు ఆలోచించాలి. తాము ప్రభుత్వాన్ని నడిపిస్తున్నది ప్రజల కోసమా, పెట్టుబడిదారుల కోసమా? అన్న ప్రశ్న వేసుకోవాలి. రోజురోజుకు ప్రస్తుత పాలకులు గాంధీజీ ఆర్థిక విధానాలకు ఎంత దూరం అవుతున్నారో గమనించాలి. పెద్ద పరిశ్రమల్లో కోటి రూపాయల పెట్టు బడికి ఒకరికి ఉద్యోగం వచ్చేదే కష్టం.

అదే కోటి రూపాయలను చిన్న తరహా కుటీర పరిశ్రమలో పెడితే పదిమందికి పైగానే ఉద్యోగాలు కల్పించవచ్చు. దేశం అభివృద్ధి చెందాలంటే పెద్ద ప్రాజెక్టులు మాత్రమే కాదు చిన్న పరిశ్రమలు కూడా అభివృద్ధి చెందాలి. కానీ ప్రభుత్వాలు దృష్టి అంతా పెద్ద పరిశ్రమల వైపే పోతుంది. నేటి ఆర్థిక విధానాలన్నీ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో జరిగి ఉత్పత్తులు గణనీయంగా పెరిగినప్పటికీ మానవ శ్రేయస్సు పెంపొందించలేకపోవడం శోచనీయం. పెద్ద పరిశ్రమలకు అంతర్జాతీయ సంస్థలకు ఒకదాని తర్వాత ఒకదానికి ప్రోత్సాహకాలు, సబ్సిడీలు, భూములు, టారిఫ్‌లు, రాయితీలు లభిస్తున్నాయి. అదే సమయంలో కోట్లాది ఉద్యోగాలు కల్పించే ఎంఎస్ఎంఈలు (చిన్న, మధ్య తరహా కుటీర పరిశ్రమలు) ప్రోత్సాహ లు లేక మూతపడుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో పెద్ద ప్రాజెక్టులకు ప్రభుత్వం అంది స్తున్న అనేక ప్రోత్సాహకాలు ఈ చిన్న పరిశ్రమలకు కూడా ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రభుత్వాలు కేటాయించే భూముల్లో 80 శాతానికి పైగా భూములు మెగా ప్రాజెక్టులకు భారీ పరిశ్రమలకు దక్కుతున్నాయి. చిన్న పరిశ్రమలు భూమి కోసం సంవత్సరాలు తరబడి ప్రభుత్వ ఆఫీసులో చుట్టూ తిరగాల్సి వస్తోంది. అలాగే పెద్ద పరిశ్రమల వారికి విద్యుత్ ఛార్జీలలో రాయితీలు, సర్దుబాట్లు, సత్వర కనెక్షను, అభివృద్ధి చార్జీల మినహాయింపు తదితర ప్రోత్సాహకాలు లభిస్తున్నాయి. ఉత్పత్తి పద్ధతులు, ఎంపిక, ఉద్యోగ కల్పన ఆవశ్యకతను పాలకులు గుర్తించకపోతే పారిశ్రామిక పాలనాపరమైన విధానాలు ఇలాగే ఉంటాయి. ప్రతి సంవత్సరం వందల ఎంఎస్ఎంఈ యూనిట్లు మూతబడుతున్నాయి. దీనికి కారణాలు మార్కెట్‌తో పోటీ చెల్లింపులు ఆలస్యం, ఫైనాన్స్ లోపం బ్యాంకుల కఠిన విధానాలు, పెరిగిన విద్యుత్ ఛార్జీలు. పెద్ద కార్పొరేట్లకు ఓటిఎస్ అప్పు మాఫీలు లభిస్తే ఎంఎస్ఎంఈలకు అలాంటి అవకాశాలు లేవు. ప్రతి బడ్జెట్‌కు ముందు ప్రభుత్వం, చాంబర్ ఆఫ్ కామర్స్ ఆర్థిక నిపుణులతో చర్చలు చేస్తుంది. కానీ ఎంఎస్ఎంఈ యాజమాన్యాలు, రోజువారీ పోరాటం చేస్తున్న పరిశ్రమలు గ్రామీణ పారిశ్రామిక వేత్తలకు ఆ అవకాశం లేదు. ఎంఎస్ఎంఈలే భారత ఆర్థిక స్వరూపానికి పునాది అని గాంధీజీ ఆనాటి అభిప్రాయం. ఈ రోజుకి కూడా ఈ చిన్న తరహా కుటీర పరిశ్రమలు రిజిస్టర్ కాబడినవి మనదేశంలో 5.93 కోట్ల యూనిట్లు ఉన్నాయి. వీటిలో 25 కోట్ల మంది పనిచేస్తున్నారు. ఇవి చేసే ఉత్పత్తులలో, మన విదేశీ వాణిజ్యంలో 45.73 శాతంగా ఉన్నది. అయితే నేడు కష్టాల్లో ఉన్న ఎంఎస్ఎంఈ యాజమాన్యాల ఇబ్బందులు ప్రభుత్వం వినాలి. వాస్తవ పరిస్థితుల ఆధా రంగా ఎంఎస్ఎంఈల అభివృద్ధికి పాల సీలు రూపొందించాలి. అప్పుడే మన ప్రధాని కోరుకున్నట్లుగా నిజమైన ఆత్మ నిర్భర్ భారత్, మేకిన్ ఇండియా పథకాలు విజయవంతం అవుతాయి.

# భారతదేశ అణు శక్తి పితామహుడు

హెూమీ జహంగీర్ భాభా భారతదేశ అణు శక్తి రంగానికి పునాది వేసిన గొప్ప శాస్త్రవేత్త. భారత దేశం స్వాతంత్ర్యం పొందిన తరువాత, అణుశక్తిని శాంతియుత విధానాల్లో వా డేలా మార్గదర్శకత్వం చేసిన శాస్త్రవేత్తగా గుర్తింపు పొందాడు. ఆయన భారత దేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించ బడ్డాడు. హెూమీ భాభా 1909 అక్టోబరు 30 న బొంబాయి లోని (ముంబై) సంపన్న పార్సీ కుటుంబంలో జన్మించాడు. చిన్నప్పటి నుంచే ఆయనకు చదువు, శాస్త్రాల మీద ఆసక్తి ఉండేది. కుటుంబ సభ్యుల ప్రోత్సాహంతో ఆయన చదువులో ప్రతిభ చూపాడు. హెూమీ భాభా తన ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వ విద్యాల యానికి వెళ్లాడు. అక్కడ రాథర్‌ఫోర్డ్ లేబొరేటరీలో శాస్త్రవేత్తలతో కలిసి కేంద్రక భౌతిక శాస్త్రం రంగంలో తన పరిశోధనలను ప్రారంభిం చాడు. కేంబ్రిడ్జ్‌లో ఉన్నత స్థాయి విద్యను పొందిన తరువాత, ఆయన పరిశోధనల్లో అంతర్జాతీయ గుర్తింపు పొందాడు. రెండవ ప్రపంచ యుద్ధం సమయంలో, భాభా అమెరికాలోని మాంహట్టన్ ప్రాజెక్ట్‌లో కూడా పాల్గొన్నాడు. ఈ ప్రాజెక్ట్ ప్రపంచపు మొట్టమొదటి అణుబాంబు అభివృద్ధికి సంబంధించింది. ఈ ప్రాజెక్ట్ ద్వారా ఆయనకు అణు శక్తి రంగంలో ఉన్న విస్తృత అవకాశాలపై అవగాహన పెరిగింది. రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత భాభా భారత దేశానికి తిరిగి వచ్చాడు. దేశానికి సేవ చేయాలనే తపనతో, భారత దేశంలో శాస్త్రీయ పరిశోధనలు అభివృద్ధి చెందాలన్న ఆశయంతో ముందుకు సాగాడు. దేశంలో సాంకేతిక రంగాన్ని అభివృద్ధి చేయడం కోసం భాభా తాటా ట్రస్ట్ సహకారంతో టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ ను 1945లో స్థాపించాడు. ు×ఖీ= భారతదేశంలో ప్రాథమిక శాస్త్ర, భౌతిక శాస్త్ర, అంతరిక్ష పరిశోధనలు మొదలైన రంగాల్లో ముఖ్య భూమికను పోషించింది. 1948లో భారత దేశం అణు శక్తి రంగంలో ముందుండాలని భావించి అణుశక్తి కమిషన్ను స్థాపించాడు. ఈ కమిషన్ ద్వారా అణుశక్తి పరిశోధనలకు బలమైన పునాది వేసి, శాంతియుత ప్రయోజనాల కోసం అణుశక్తి వినియోగం ఎలా ఉండాలో ప్రణాళికలు రూపొందిం చాడు. ఆయన అణుశక్తిని విద్యుత్ ఉత్పత్తి, వైద్యం, వ్యవ సాయం వంటి రంగాల్లో వినియోగించడానికి మార్గద`ర్శకత్వం అందించాడు. 1954లో, ముంబై సమీపంలోని ట్రాంబేలో భాభా అటామిక్ రీసెర్చ్ సెంటర్‌ను స్థాపించాడు. ఈ సంస్థ అణుశక్తి పరిశోధనలకు కేంద్రంగా మారింది. దీూ=జ ద్వారా స్వదేశీ అణు శక్తి పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేయడానికి ఆయా విధానాలను అనుసరించి, అణు శక్తిని విద్యుత్ ఉత్పత్తిలో వినియోగించే విధంగా ప్రణాళికలు రూపొందించాడు. భాభా అణుశక్తి రంగంలో స్వయం సమృద్ధిని కోరుకున్నాడు. ఆయన ప్రణాళికలు భారతదేశం అణుబాంబును అభివృద్ధి చేయడానికి బాటలు వేశాయి. భారత దేశానికి అత్యవసర సమయంలో సైనిక శక్తిని ప్రదర్శించడానికి అణు శక్తి అవసరమని, అలాగే దీన్ని శాంతియుత కార్యక్రమాల్లో కూడా ఉపయోగించవచ్చని ఆయన భావించాడు. భారత దేశానికి అణు శక్తి రంగంలో ఆయన చేసిన సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆయనను పద్మభూషణ్ పురస్కారంతో గౌరవించింది. ఇది భారత శాస్త్రజ్ఞులకు ఆయన అందించిన ప్రేరణకు గుర్తింపు లాంటిది. భారతదేశపు అణు శక్తి కార్యక్రమానికి చేసిన కృషిని గుర్తిస్తూ, ఆయనను భారతదేశపు అణు శక్తి పితామహుడు అని సత్కరించారు. ఆయన నిరంతరం శాస్త్రీయ అభివృద్ధి కోసం ప్రయత్నించి, దేశానికి శక్తి స్వావలంబనను అందించే ప్రయత్నం చేశారు. భాభా స్థాపించిన ు×ఖీ=, దీూ=జ సంస్థలు ఇప్పటికీ భారతదేశంలో శాస్త్రీయ పరిశోధనలకు ప్రధాన కేంద్రాలుగా ఉన్నాయి. ఆయన అభిప్రాయాలే దేశానికి శక్తి, శాస్త్ర సాంకేతిక రంగాల్లో ఉన్నత స్థితిని తెచ్చాయి. భారతదేశం అణు శక్తి రంగంలో ప్రగతిని సాధించడానికి ఆయన చూపిన మార్గం నేటి వరకు మార్గదర్శకంగా నిలిచింది. హెూమీ జహంగీర్ భాభా భారతదేశంలో అణు శక్తి రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చాడు. ఆయన దృష్టి, పట్టుదల, మరియు శాస్త్రీయ దార్శనికత భారతదేశాన్ని అణు శక్తి రంగంలో ప్రపంచ పటంలో నిలిపింది. భారతదేశ అణు శక్తి పితామహుడు హెూమీ జహంగీర్ బాబా.

# వ్యర్థ జలాల పునర్వినియోగమే భవిష్యత్తు



మన దేశంలో నీటి సంక్షోభం ఎంత తీవ్రంగా ఉందో గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం, భారతదేశంలోని 21 ప్రధాన నగరాల్లో 2020 నాటికే భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. ఇది సుమారు 100 మిలియన్ల ప్రజల జీవితాలపై ప్రభావం చూపింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి ప్రకారం, భారతదేశంలోని పట్టణ ప్రాంతాలు ప్రతిరోజూ సుమారు 72,368 మిలియన్ లీటర్ల మురుగు నీటిని ఉత్పత్తి చేస్తున్నాయి. అయితే, దీనిలో కేవలం 31% నీటిని శుద్ధి చేసే సామర్థ్యం మాత్రమే మనకు ఉంది. ఇది కేవలం పర్యావరణ సమస్య మాత్రమే కాదు, మన భవిష్యత్తు మనుగడకు సంబంధించిన అంశం. ఈ నేపథ్యంలో సాంకేతికతతో అద్భుతాలు సృష్టిస్తూ వ్యర్థ జలాల నిర్వహణలో అనేక దేశాలు విప్లవాత్మకమైన మార్పులు సాధించి, మనకు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నీటి వనరులు చాలా తక్కువగా ఉన్న ఇజ్రాయెల్, వ్యర్థ జలాల పునర్వినియోగంలో ప్రపంచానికే గురువుగా నిలుస్తోంది. ఆ దేశం తన వ్యర్థ జలాల్లో దాదాపు 90% శుద్ధి చేసి, వ్యవసాయానికి ఉపయోగిస్తోంది. సాంకేతికత వారు మెంబ్రేన్ బయోరియాక్టర్, రివర్స్ ఆస్మోసిస్ వంటి అత్యాధునిక సాంకేతికతలను ఉపయోగిస్తారు. ఈ ప్రక్రియలో, నీటిలోని మలినాలను, సూక్ష్మజీవులను, రసాయనాలను తొలగించి, వ్యవసాయానికి సురక్షితమైన నీటిని అందిస్తారు. బిందు సేద్యంతో ఈ నీటిని పొదుపుగా వాడి, ఎడారి లాంటి ప్రాంతాల్లో కూడా పచ్చని పంటలు పండిస్తున్నారు. భూమి కొరత, సహజ నీటి వనరులు లేని సింగపూర్, తన నీటి అవసరాల కోసం మలేషియాపై ఆధారపడేది. కానీ, 'న్యూవాటర్' అనే బ్రాండ్‌తో వారు తమ వ్యర్థ జలాలను అత్యంత ఉన్నత ప్రమాణాలతో శుద్ధి చేసి, తాగడానికి కూడా యోగ్యంగా మార్చుకున్నారు. ఈ ప్రక్రియలో మూడు ప్రధాన దశలు ఉంటాయి మైక్రో ఫిల్ట్రేషన్, రివర్స్ ఆస్మోసిస్, అతి నీలలోహిత కిరణాలతో శుద్ధి చేయడం. ఈ నీటిని పరిశ్రమలకు, శీతలీకరణ వ్యవస్థలకు, పరోక్షంగా తాగునీటి సరఫరాకు కూడా ఉపయోగిస్తున్నారు. ఇది వారి జల భద్రతకు వెన్నెముకగా మారింది. జర్మనీ వ్యర్థ జలాల శు ద్ధిలో కఠినమైన ప్రమాణాలను పాటిస్తుంది. అక్కడ కేంద్రీకృత శుద్ధి ప్లాంట్‌లతో పాటు, చిన్న కమ్యూనిటీలు, పరిశ్రమల కోసం వికేంద్రీకృత ప్లాంట్‌లను కూడా ప్రోత్సహిస్తారు. సాంకేతికత వారు సీక్వెన్సింగ్ బ్యాచ్ రియాక్టర్స్ వంటి టెక్నాలజీలను వాడి, తక్కువ ఖర్చుతో, సమర్థవంతంగా నీటిని శుద్ధి చేస్తున్నారు. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గి, స్థానికంగానే నీటిని పునర్వినియోగించుకునే అవకాశం కలుగుతుంది. భూగర్భ జలాలను పెంచడానికి, వర్షపు నీటిని ఒడిసి పట్టడానికి భారతదేశంలో ఈకో బ్లాక్స్ డ్రెయిన్ అనే ఒక అద్భుతమైన, పర్యావరణ అనుకూలమైన సాంకేతికత ప్రాచుర్యం పొందుతోంది. ఈకో బ్లాక్స్ అనగా ఇవి పోరస్ కాంక్రీట్ లేదా పర్వియస్ కాంక్రీట్‌తో తయారు చేయబడిన ప్రత్యేకమైన బ్లాక్‌లు. సాధారణ కాంక్రీటులా కాకుండా, ఈ బ్లాక్‌ల మధ్య చిన్న చిన్న సూక్ష్మ రంధ్రాలు ఉంటాయి. ఈ రంధ్రాల ద్వారా నీరు సులభంగా భూమిలోకి ఇంకిపోతుంది. ఇది వ్యర్థ జలాల నిర్వహణకు పరోక్షంగా సహాయపడుతుంది. ఇలా నిర్మించిన డ్రెయిన్‌లు లేదా ఫుట్‌పాత్‌లపై పడిన నీరు, ఆ రంధ్రాల ద్వారా నేరుగా భూమిలోకి ఇంకిపోతుంది. ఈ ప్రక్రియలో, మట్టి, ఇసుక పొరలు సహజ ఫిల్టర్‌లుగా పనిచేసి, నీటిలోని కొన్ని మలి నాలను తొలగిస్తాయి. ఇలా శుద్ధి చేసిన వ్యర్థ జలాలను డ్రెయిన్‌ల ద్వారా భూమిలోకి పంపించడం వల్ల, భూగర్భ జలాలు సురక్షితంగా, స్థిరంగా పెరిగే అవకాశం ఉంది. ప్రభుత్వాలు ఈకో బ్లాక్స్ వంటి స్థానిక ఆవిష్కరణలను ప్రోత్సహించడం చాలా అవసరం. ప్రతి నీటి బొట్టును కాపాడుకుంటూ, ప్రతి వ్యర్థపు నీటి చుక్కను పునర్వినియోగించుకుంటూ, మన భవిష్యత్ తరాలకు సురక్షితమైన జల భవిష్యత్తును అందిద్దాం.

# దివ్యాంగుడి అభ్యర్థనకు అదిరిపోయే బహుమానం

**జలవనరుల శాఖ మంత్రి నిమ్మలకు విజ్ఞాపన తెలిపిన వెంకటేశ్వరరావు**

**సోషల్ మీడియా వేదికగా వరమిచ్చిన ఐటీ శాఖ మంత్రి లోకేష్ - సంభ్రమాశ్చర్యానికి గురైన చెల్లూరుకు చెందిన దివ్యాంగుడు**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** తనకు బ్యాటరీ వాహనం ఇప్పించాలని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రిని కలిసిన దివ్యాంగుడి కి సొంత ఖర్చులతో బ్యాటరీ వెహికల్ ను ఇంటికి పంపిస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ ద్వారా తెలిపారు. డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండలం చెల్లూరు గ్రామానికి చెందిన వెంకటేశ్వరరావు ఇటీవల కాలంలో పాలకొల్లు నియోజకవర్గం లో పర్యటనలో ఉన్న రాష్ట్ర జలవనురుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడును ఆటోలో వెళ్లి కలిసారు. ఆయనతో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తాను విరాభిమానినని, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో ఫోటో దిగాలని తెలపగా మంత్రి స్పందించి ముఖ్యమంత్రి ఇటువైపు పర్యటనకు వచ్చినప్పుడు ఏర్పాటు చేద్దామని తెలపారు, అనంతరం తాను వికలాంగుడవడంతో ఎక్కడికి వెళ్ళలేక ఇబ్బంది పడుతున్నానని బ్యాటరీ వాహనం ఏదైనా ఇప్పించాలని కోరగా. వెంటనే మంత్రి నిమ్మల మండపేట నియోజకవర్గ శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావుతో ఫోన్లో మాట్లాడి సబ్సిడీలో వికలాంగులకు ఏదైనా వాహనం వస్తే మొదటి ప్రాధాన్యతగా వెంకటేశ్వరరావుకి ఇవ్వాలని కోరారు. కాగా ఈ తదంగమంతా వీడియో రూపంలో సోషల్ మీడియాలో వైరల్ అవ్వగా ఆ వీడియోను వీక్షించిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ ట్విట్టర్ ద్వారా ఆ వాహనాన్ని సొంత ఖర్చులతో తానే అందిస్తానని, దివ్యాంగులు ఇంటి వద్దకే అది చేరుతుందని హామీ ఇచ్చారు. కాగా సమస్యలపై వెంటనే స్పందించడమే కాక ఉదాహరణ చాటుకుంటున్న ఐటీ శాఖ మంత్రి లోకేష్ విధానంపై టిడిపి కార్యకర్తలు సంబర పడిపోతూ, లోకేష్‌ను ప్రశంసిస్తున్నారు.

పునరావాస శిబిరాల్లో ఉన్నవారికి

# ఆర్థిక సహాయం, నిత్యవసరాలు : మంత్రి వాసంశెట్టి సుభాష్



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుదు ముందు చూపు, వాతావరణ శాఖ హెచ్చరికలు, అధికార యంత్రాంగం సమన్వయంతో మొంథా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొన్నామని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఓదూరు గ్రామంలో తుఫానుకు నేలవారిన పంట పొలాలను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. తుఫాను పట్ల వాతావరణ శాఖ ముందే హెచ్చరికలు జారీ చేసిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేయడం ద్వారా ప్రాణ నష్టం జరగకుండా కాపాదుకున్నాం అన్నారు. తుఫాను ముందస్తు చర్యలతో పాటు,8 నెలలు దాటిన గర్భిణీ స్త్రీలను హాస్పిటల్స్ లో చేర్చడం, వృద్ధులు పిల్లలు పట్ల ప్రత్యేక శ్రద్ధ, లక్షల మందిని తుఫాను సహాయక శిబిరాల్లో చేర్చి వారికి అన్ని సదుపాయాలు కల్పించడం, 24/7 నిరంతరం సీఎం చంద్రబాబు, మంత్రులు, ఎమ్మెల్యేలు, అధికార యంత్రాంగం అందరూ పరిస్థితులు సమీక్షిస్తూ జాగ్రత్తలు తీసుకోవడం వల్ల నష్టాన్ని తగ్గించ గలిగామన్నారు. ఇది ఖచ్చితంగా సీఎం చంద్రబాబు నాయుడు లాంటి అత్యంత సమర్ధ నాయకుడు మైక్రో లెవెల్ మేనేజ్మెంట్ చేయగలగడం వల్లనే సాధ్యమైంది అన్నారు. అలాగే పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న వారికీ కూటమి ప్రభుత్వం ఒక్కొక్కరికి మూడు వేలు ఆర్థిక సహాయం, 25 కేజీల బియ్యం, కేజీ కందిపప్పు, కేజీ ఆయిల్, కేజీ పంచదార, కేజీ బంగాళదుంపలు, కేజీ ఉల్లిపాయలు వంటి నిత్యవసరాలు ఇచ్చేందుకు నిర్ణయించిందన్నారు. తుఫాను కారణంగా పనులు లేని కుటుంబాలకు ఆర్థిక సహాయం ఉపాయోగ కరంగా ఉంటుందన్నారు. అలాగే మత్స్యకారులకు, చేనేత కార్మికులకు 50 కేజీల బియ్యం ఇస్తామని మంత్రి సుభాష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అద్భుతమైన పనితీరుతో

# ఆకట్టుకున్న అధికార యంత్రాంగం

- మొంథా తుఫాన్ ప్రభావం దృష్ట్యా నిత్యం అందుబాటులో సేవలు
- ఉన్నత స్థాయి నుంచి క్రింది స్థాయి వరకూ సమర్థవంతమైన పనితీరు
- పునరావాస కేంద్రాల నుండి క్షేమంగా గమ్యాలకు చేరిన బాధితులు
- అధికారులు, ఉద్యోగులను అభినందించిన కూటమి నాయకులు









**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుఫాను ప్రభావం అధికంగా ఉండనుందనే ఉన్నతాధికారుల ఆదేశాలు అందిన నాట నుండి ప్రజా సంక్షేమం కొరకు, ప్రకృతి వైపరీత్యాల వలన ఏర్పడే ప్రాణ, ఆస్తి నష్టాలను తగ్గించే దిశగా చర్యలు చేపట్టిన యంత్రాంగం. స్థానిక కూటమి నాయకుల సహకారంతో యుద్ధ ప్రాతిపదికన కార్యాచరణ చేపట్టి విజయవంతం అయిందనే చెప్పాలి. మొంథా తీవ్ర తుఫాను దిశను మార్చుకుని మొదటినుంచి అంచనా వేసిన చోట కాక మరొక ప్రాంతంలో తీరం దాటినప్పటికీ నష్ట తీవ్రతను తగ్గించడంలో సర్కారు సఫలీకృతమైందనే చెప్పాలి. ఉన్నత స్థాయి అధికారులు, మంత్రులు మండల స్థాయి అధికారుల నుండి క్రింది స్థాయి అధికారులతో సైతం వీడియో కాన్ఫరెన్స్‌ల ద్వారా ఎప్పటికప్పుడు సమీక్ష నిర్వహిస్తూ, సకల శాఖల సౌజన్యంతో భారీ స్థాయి నష్టం వాటిల్లకుండా జాగ్రత్త పడ్డారు. ముఖ్యంగా ఈ విషయంలో మండల స్థాయి అధికారులు ముఖ్యంగా రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్యాశాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ జరుపుతూ, రేయి పగలు ఉన్నతాధికారుల ఆదేశాల అందిపుచ్చుకుంటూ, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయగా, ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, వారికి సౌకర్యాలను సమకూర్చడం లో క్రింది స్థాయి అధికారులు పడిన యాతన వర్ణణాతీత మనే చెప్పుకోవాలి. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాయవరం మండల వ్యాప్తంగా అధికారులు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సకల శాఖాధికారులు సమర్థవంతంగా నిర్వహించారని స్థానిక కూటమి నాయకులు అధికారుల నుండి క్రింది స్థాయి కార్మికుల వరకూ అభినందనలు తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గిందని తెలిసిన అనంతరం బుధవారం ఉదయం అల్పాహారం అందించిన అనంతరం మండలంలోని పునరావాస కేంద్రాల నుండి బాధితులను వారి, వారి ప్రాంతాలకు తరలించారు. మండల కేంద్రమైన రాయవరంలోని పునరావాస కేంద్రం వద్ద విలేకరులతో స్థానిక కూటమి నాయకులు రాయవరం గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ వుండవిల్లి రాంబాబు విలేకరులతో మాట్లాడుతూ తుఫాను తీవ్రత పై స్పష్టమైన అవగాహన వచ్చేంతవరకూ అధికారులు తీవ్రంగా శ్రమించారని ప్రశంసించారు. ముఖ్యంగా రెవిన్యూ శాఖ, పంచాయతీరాజ్, సచివాలయ ఉద్యోగులు బాధితులను గుర్తించి స్థానిక పునరావాస కేంద్రాలకు తరలించడంలో వర్షం లోనూ శ్రమించారని, అనంతరం పునరావాస కేంద్రాలలో సమర్థవంతంగా విధులు నిర్వర్తించారని కొనియాడారు. ఉపాధ్యాయ, వైద్య శాఖల ఉద్యోగులు, ఎ.ఎన్.ఎం లు, ఆశా కార్యకర్తలు, పునరావాస కేంద్రాలలో నిత్యం అందుబాటులో ఉన్నారని వారిని అభినందించారు, ఉపాధ్యాయ సంఘాలు పునరావాస కేంద్రాల లోని బాధితులకు అల్పాహారం గా పాలు, బ్రెడ్, బిస్కెట్‌ల వంటివి అందించి మానవత్వం చాటుకున్నారని అభినందించారు. ముఖ్యంగా పునరావాస కేంద్రాలు వద్ద నిత్యం పహారా కాస్తూ ఎలాంటి నష్టం సంభవించకుండా బాధ్యతలు నిర్వహించిన పోలీస్ వారికి కృతజ్ఞతలు తెలిపారు. రెండు రోజుల పాటు పునరావాస కేంద్రాల వద్ద శుభ్రం చేస్తూ చిరాకు పడకుండా సేవా చేసిన కార్మికులను ప్రత్యేకంగా అభినందించారు. ఈ పునరావాస కేంద్రాల వద్ద ఏ లోటు రాకుండా అన్ని విధాలుగా సేవలందించిన కూటమి నేతల ఔదార్యాన్ని కొనియాడారు. యుద్ధ ప్రాతిపదికన ముందస్తు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా వ్యవహరించిన విద్యుత్ శాఖ అధికారుల పనితీరుపై ప్రశంసలు కురిపించారు. కాగా గ్రామంలో తుఫాను తీవ్రత తో తీవ్రనష్టం వాటిల్లకుండా వ్యవహరించిన ఉండవల్లి రాంబాబు,జనసేన సీనియర్ నాయకులు, ఎస్ఎంసి చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు(చిన్ని), శ్రీ వెంకటేశ్వర దేవస్థానం ఉత్సవ కమిటీ చైర్మన్ వల్లూరు శ్రీనివాస్, తెదేపా సీనియర్ నాయకులు మల్లిపూడి చిన్న, ఐ టిడిపి ఇన్చార్జ్ దొంతంశెట్టి బాలకేదారీశ్వరుడు, పర్వతిని మణిదీప్, చేకూరి వి.వి.వి.మూర్తి(బాబి), ఆనాల వీరభద్రరావు, జనసేన యువ నాయకులు, బి.సి నాయకులు బేర దుర్గాప్రసాద్, మరువాడ అనిల్ కుమార్, ఎస్సీ సెల్ నాయకులు కందుకూరు గంగరాజు, మచ్చా సూర్యారావు, ఇందుగుమిల్లి అరుణ్ కుమార్ ఇతర కూటమి నాయకులను మండపేట శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు తో సహా పలువురు అభినందించారు.

ఆల్ ఇండియా బాడ్మింటన్ పోటీల్లో

# బ్రాంజ్ మెడల్ సాధించిన అభిషేక్




**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** యోనెక్స్-సన్ రైజ్ ఆల్ ఇండియా జూనియర్ ర్యాంకింగ్ బాడ్మింటన్ టోర్నమెంట్ -2025 లో భాగంగా తమిళనాడు బాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధురైలో జరిగిన బాడ్మింటన్ పోటిల్లో రామచంద్రపురం మోడరన్ జూనియర్ కాలేజీ విద్యార్థి బోను అభిషేక్ డబుల్స్ కేటగిరిలో ఆల్ ఇండియా అండర్ 19 విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించినట్లు మోడరన్ విద్యాసంస్థల అధినేత జి.వి.రావు తెలిపారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ పాల్గొన్న ప్రతీ టోర్నమెంట్ లో అభిషేక్ విజేతగా నిలుస్తుండటం మోడరన్ విద్యా సంస్థలకే కాక, రామచంద్రపురం పట్టణానికే గర్వకారణం అన్నారు. అభిషేక్ భవిష్యత్తులో మరింత రాణించి జాతీయ, అంతర్జాతీయ క్రీడాకారుడిగా మంచి గుర్తింపు తెచ్చుకోవడం తద్యమని రావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా అభిషేక్ ను అకాడమిక్ డైరెక్టర్ కె.సాయిరాం చౌదరి, మోడరన్ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ సి.హెచ్.రాజేష్, వైస్ ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాష్, అకాడమిక్ అడ్వైజర్ సి.హెచ్.శ్రీనివాస్, మోడరన్ స్టాఫ్ అభినందించారు.

# ఉత్తమ సేవలు అందించడంలో ఉద్యోగుల కృషికి అభినందనలు

జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు శాకా నాగేంద్ర



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తీవ్ర తుపాన్ నేపథ్యంలో అప్రమత్తమైన అధికార యంత్రాంగం పునరావాస కేంద్రాల ఏర్పాటు ద్వారా రాయవరం మండలం, సోమేశ్వరం గ్రామంలో ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం సంభవించకుండా అంకిత భావంతో పనిచేసిన అధికారులు,ఉద్యోగులు అందరు సమిష్టి కృషి చూపించారని జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు శాకా నాగేంద్ర బుధవారం ప్రత్యేకంగా అభినందించారు. పునరావాస కేంద్రాల నుండి బుధవారం ఉదయం బాధితులు తమ,తమ గమ్యాలకు చేరుకున్న అనంతరం ఆయన మాట్లాడుతూ పంచాయతీ సెక్రటరీ దాసరి సత్యనారాయణ ఆధ్వర్యంలో వీఆర్ఓలు, సచివాలయ సిబ్బంది, ఎం.ఎన్.ఎం, ఆశా వర్కర్ల తో పాటు పారిశుధ్య శ్రామికులు తీవ్రంగా శ్రమించారని కొనియాడారు. విద్యుత్ సమస్యల పై లైన్ మెన్ వెంకట్ అందుబాటులో ఉంటూ, ఉన్నతాధికారుల, మండల అధికారుల యొక్క దిశా నిర్దేశం ఆవలంబిస్తూ ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కారించారని అభినందించారు. ముందస్తు చర్యలు ద్వారా నష్టం తీవ్రత గణనీయంగా తగ్గించారని ప్రభుత్వ చర్యలను నాగేంద్ర కొనియాడారు.

తుఫాన్ బాధితులను తక్షణమే

# ప్రభుత్వం ఆదుకోవాలి...



ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ డిమాండ్

**అల్లవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుపాన్ ప్రభావానికి లోనై పునరావాస కేంద్రంలో తలదాచుకున్న బాధితులకు తక్షణ సహాయం క్రింద ప్రతి కుటుంబానికి పదివేల రూపాయలు ఆర్థిక సహాయం, 50 కిలోల బియ్యం, నిత్యవసర వస్తువులు అందించాలని ఆంధ్రప్రదేశ్ శాసనమండలి సభ్యులు బొమ్మి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. అదేవిధంగా తుఫాన్ కారణంగా నష్టపోయిన కొబ్బరి తోటలకు ప్రతి చెట్టుకు పదివేల రూపాయలు, అంతర పంటలు జీడిమామిడి, మామిడి తోటలు, సరుగుడు తోటలు వగైరా నష్టపోయిన వారికి పంట విస్తీర్ణం బట్టి ఆర్థిక సహాయం అందించాలని, తుఫాను కారణంగా పశువులు కోల్పోయిన వారికి కూడా ఆర్థికంగా ఆదుకోవాలని ఎమ్మెల్సి ఇజ్రాయిల్ డిమాండ్ చేశారు. మొంథా తుపాన్ కారణంగా తీవ్రంగా నష్టపోయిన రైతులను, నిరుపేదలను, పంట నష్టం, ఆస్తి నష్టం, ఇల్లు కోల్పోయిన నిరాశ్రయులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని, ఇటువంటి ప్రకృతి వైపరీత్యాలు ఏర్పడినప్పుడు ప్రతి ఒక్కరూ పార్టీతో సంబంధం లేకుండా మానవతా దృక్పథంతో సేవా భావంతో పనిచేసి, బాధితులను ఆదుకోవాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. అలాగే ప్రతి గ్రామంలో అధిక భారీ వర్షాలు కారణంగా నీరు నిలువ ఉండటం వల్ల దోమలు విపరీతంగా పెరిగిపోయి, ప్రజలు రోగాల బారిన పడే అవకాశం ఉంది కాబట్టి, తక్షణమే వైద్యశాఖ అధికారులు,పారిశుద్ధ్య కార్మికులు స్పందించి ప్రతి గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు, శానిటేషన్ చేసి ప్రజలను రోగాల భారి నుండి కాపాడాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. అలాగే భారీ వృక్షాలు చెట్లు కూలిపోవడం వల్ల విద్యుత్ అధికారులు తక్షణమే కొత్త విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి గ్రామాలలో విద్యుత్తును త్వరగా ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా ఇజ్రాయిల్ తెలియజేశారు.

పంట నష్టపోయిన రైతులను

# కూటమి ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుంది

**కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు**



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను వలన కురుస్తున్న భారీ వర్షాలకు నేల కోరిగి తడిచిన వరి పంట పొలాలను బుధవారం కొత్తపేట శాసనసభ్యులు బండారు సత్యానందరావు స్థానిక అధికారులతో కలిసి పరిశీలించారు. తుఫాను వల్ల పంట నష్టపోయిన రైతులను కూటమి ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని ఎమ్మెల్యే బండారు అన్నారు. పంట నష్టాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించి నివేదికను సిద్ధం చేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తుఫాన్ నేపథ్యంలో ప్రత్యేక అధికారిగా నియమించిన లక్ష్మీ ప్రత్యూష, తాసిల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఏ.రాజు, మండల వ్యవసాయ అధికారిని మీనా, కూటమి నాయకులు, రైతులు, రెవిన్యూ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

# మండలంలో పంట నష్టంపై ప్రాథమిక అంచనా

**పడిపోయిన, నీటి మునిగిన 4562 హెక్టార్ల విస్తీర్ణం - 7570 మంది రైతులకు పంటనష్టం**

**మండల వ్యవసాయ అధికారి కెవిఎన్ రమేష్ కుమార్**



**రాయవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను తీవ్రత కారణంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, మండల వ్యాప్తంగా పడిపోయిన, నీట మునిగిన వరి పంట పొలాలను రాయవరం మండల వ్యవసాయాధికారి కెవిఎన్ రమేష్ కుమార్ బుధవారం సందర్శించారు. మాచవరం, చెల్లూరు, వెంటూరు, కురకాళ్లపల్లి, కూర్మాపురం గ్రామాల్లోని పంట పొలాలను పరిశీలించిన ఆయన విలేకరులకు వరి పంట నష్టం ప్రాథమిక అంచనాను తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 4562 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నష్టం సంభవించిందని వాటిలో 1879 హెక్టార్ల విస్తీర్ణంలో పంట నీట మునగగా, 2683 హెక్టార్ల విస్తీర్ణంలో నేల కొరిగినట్లు పేర్కొంటూ, సుమారుగా 7570 మంది రైతులు నష్టపోయినట్లు ప్రాథమిక అంచనాను తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, రైతులు, గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామ రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పంట బోధి సమస్యను పరిష్కరిస్తాం..



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలం పరిధిలో జొన్నాడ గ్రామంలో నామాలతోట వారి కాలనీ వద్ద ఎప్పటినుండో ఉన్న పంట బోధి సరిగా లేకపోవడంతో ఇళ్ల నుంచి వచ్చే మురుగునీరు, వర్షాకాల సమయంలో వర్షపు నీరు వల్ల పరిసర ప్రాంతంలో ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. పంట బోధి సమస్యను స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యానందరావు బుధవారం స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి ఆయన అధికారులతో మాట్లాడి పంట బోధి సమస్యను త్వరలోనే పరిష్కరిస్తామని హామీఇచ్చారు. ఈ కార్యక్రమంలో గొడవర్తి దుర్గాప్రసాద్ (బాబి), నామాల సూరిబాబు, మేడపాటి రామారెడ్డి, అయినవిల్లి సత్తిబాబు గౌడ్, ఎంపీటీసీ మారిశెట్టి శ్రీనివాస్, తాసిల్దార్ కేజే ప్రకాష్ బాబు, ఎంపీడీవో ఏ.రాజు, మండల ప్రత్యేక అధికారి లక్ష్మీ ప్రత్యూష, వ్యవసాయ అధికారిని మీనా, తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావంలోనూ వేగవంతమైన సేవలలో విద్యుత్ శాఖ భేష్

**గంటల వ్యవధిలోనే నూతన స్థంబాల పునరుద్ధరణ - ఎడతెరిపి లేకుండా సేవలందించిన విద్యుత్ శాఖ అధికారులు**







**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను తీవ్ర ప్రభావం చూపుతుందనే ఉన్నతాధికారుల ఆదేశాలు అందిన వెంటనే విద్యుత్ ఉద్యోగులు చూపిన చొరవ ఎనలేనిదనే చెప్పాలి. రెండు రోజులు ముందు నుంచే గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని, అంతర్రాష్ట్రాల నుండి సైతం అధికంగా సహాయకుల ను ఏర్పాటు చేసుకుని ముందస్తు చర్యలు చేపట్టారు. తుఫాను ప్రభావం రాయవరం మండలం పై మరింత ఉధృతం గా లేనప్పటికీ, తుఫాను తీవ్రత వలన బలమైన ఈదురు గాలుల వీయడంతో మండలంలోని పలు చోట్ల విద్యుత్ స్తంభాలు విరిగిపోయాయి. అయినప్పటికీ గంటల వ్యవధిలోనే వాటి ప్రాంతంలో కొత్త స్తంభాలను ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూసుకున్నారు. మండలంలోని వెంటూరు, కూర్మాపురం, వెదురుపాక గ్రామాలలో విరిగిన స్థంబాల తీసివేసి, క్రొత్త స్తంభాలను అమర్చడమే కాక, మాచవరం గ్రామంలో తెగిపడిన కండక్టర్లను యుద్ధ ప్రాతిపదికన సరిచేసి, కొత్తవి అమర్చడంలో చాకచక్యంగా వ్యవహరించడంలో అసిస్టెంట్ ఇంజనీర్ సందాక శ్రీనివాసులు, లైన్ మేన్‌లు, ఇతర సిబ్బంది పనితీరు ను మండలంలోని పలువురు ప్రశంసించారు.

విశ్వం వాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY
కాకినాడ జిల్లా ఎడిషన్
గురువారం, 30 అక్టోబర్ 2025
www.viswamvoice.com


# మొంథా తుఫాన్ పొలాలను పరిశీలించిన ఎంపీ

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ సృష్టించిన భీభత్సం కష్టాలూ, నష్టాలను మిగిల్చింది. చేతికందివచ్చే పంటలను నేలమట్టం చేసింది. దీంతో కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో దెబ్బతిన్న పంటల నష్టాన్ని కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాసు, కాకినాడ జిల్లా జనసేన పార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి బుధవారం పరిశీలించారు. పంట నష్టం గురించి వారికి ఫోన్ ద్వారా జిల్లా జనసేపార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు వివరించారు. వెంటనే స్పందించిన నేతల ద్వయం మద్యాహన్నం 12.30 గంలకు నిమిషాలకు దుర్గాడ గ్రామానికి కాకినాడ పార్లమెంటు సభ్యులు



తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాసు, కాకినాడ జిల్లా జనసేనపార్టీ అధ్యక్షులు తుమ్మల రామస్వామి, మాజీ శాసన సభ్యులు పెండెం దొరబాబు, జనసేనపార్టీ శ్రేణులు వచ్చి జిల్లా కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు, జనసేన నాయకులు, కార్యకర్తలతో కలసి దెబ్బతిన్న ప్రత్తి, బొప్పాయి, వరి, అరటి, దొండ పంటలను పరిశీలించారు. మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులను కలిసి వారి పంట నష్టాలను అడిగి తెలుసు కున్నారు. ప్రభుత్వం అందించే పంట నష్టపరిహారాన్ని కౌలు రైతులకు కూడా వర్తింప జేయాలని దుర్గాడ గ్రామ కౌలు రైతులు తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాసుకు విన్నవించారు. ఈ సందర్భంగా ఎంపీ రైతులతో మాట్లాడుతూ... ఈ పంటల నష్టాలను అధికారుల ద్వారా అంచనా వేసిన తరువాత ప్రభుత్వానికి నివేదిస్తారనీ, ఆ తర్వాత ప్రభుత్వం నుంచి పూర్తిగా నష్టపరిహారం వచ్చే విధంగా తగు కృషి చేస్తానని రైతులు అందరికీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాసు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనసేనపార్టీ పిఠాపురం నియోజకవర్గం నాయకులు, దుర్గాడ గ్రామ జనసేన నాయకులు, కార్యకర్తలు, జన సైనికులు, పంటలు దెబ్బతిన్న రైతులు, ఇతర రైతులు గ్రామ ప్రజలు పాల్గొన్నారని శంఖవరం మండలం కత్తిపూడిలోని జ్యోతుల శ్రీనివాస్‌కు చెందిన సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది.

### ఏలేరు జలాశయాన్ని ఎమ్మెల్యే సత్యప్రభతో కలిసి

# పరిశీలించిన రాజ్యసభ ఎంపీ సానా సతీష్

**ఏలేశ్వరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో నిండుకుండలా మారిన కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం, ఏలేశ్వరంలో ఉన్న ఏలేరు జలాశయాన్ని, అప్పన్నపాలెం బ్రిడ్జిని రాజ్యసభ ఎంపీ సానా సతీష్ బాబు స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ, కాకినాడ జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్, ఏలేరు ప్రాజెక్ట్ చైర్మన్ బస్వా వీరబాబు, మాజీ జడ్పీ ప్రతిపక్ష నేత తోట నవీన్, సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్బంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏలేరు జలాశయం దిగువన ఉన్న ముంపు ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం దిశగా కృషి చేస్తామని ఎంపీ సానా సతీష్ మీడియాతో అన్నారు. తుఫాన్ సందర్భంగా సహాయక చర్యలు చేపట్టి సమర్ధవంతంగా పని చేసిన అధికారులని, సిబ్బందిని ఎంపీ సానా సతీష్ అభినందించారు.ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్ళి ఏలేరు ఆధునీకరణ పరిష్కారం దిశగా పనిచేస్తామని అన్నారు. అలాగే అప్పన్నపాలెం బ్రిడ్జి కూలిపోవటం వల్లఅప్పనపాలెం, జగ్గంపేట, ఇర్రిపాక, మామిడాడ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయని స్థానికులు తెలియజేయడంతో పంచాయతీ రాజ్ శాఖ రూ.14 కోట్ల అంచనా వ్యయంతో వంతెన పునరుద్ధరణ ప్రతిపాదనలను సిద్ధం చేసిందని, ప్రభుత్వం నుండి త్వరితగతిన అనుమతులు తెచ్చి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రోడ్డు కార్పొరేషన్ డైరెక్టర్ వెన్నా శివ, జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మేడిశెట్టి బాబీ, మండల



పార్టీ అధ్యక్షుడు జ్యోతుల పెదబాబు, నగర పంచాయతీ చైర్మన్ అలమండ సత్యవతి చలమయ్య, సీనియర్ నాయకుడు పర్వత సురేష్, కిర్లంపూడి ఎంపీపీ తోట రవి,కౌన్సిలర్లు బొద్దిరెడ్డి గోపి, మూది నారాయణస్వామి, కోణాల వెంకటరమణ, ఎండగుడి నాగబాబు, కూటమి నాయకులు భూపాలపలట్నం ప్రసాద్, అంబటి బుజ్జి, వెలుగుల నాని, చిక్కాల లక్ష్మణరావు,కరణం సుబ్రహ్మణ్యం, జిగటాపు సూరిబాబు నూకతాటి ఈశ్వరుడు, పలివెల శ్రీనివాస్, సూతి ప్రభాకర్, రుచి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలల పునఃప్రారంభం నేడే : కలెక్టర్ షన్మోహన్ సగిలి

**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లాలో మొంథా తుఫాన్ ప్రభావం తగ్గడం వలన జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్యాల్లోని అన్ని పాఠశాలలను శుక్రవారం నుండి యధావిధిగా పూర్తి స్థాయిలో పునఃప్రారంభించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు. ఈ మేరకు ఆయన బుధవారం సాయంత్రం ప్రత్యేక ఉత్తర్వులను జారీ చేశారు. తుఫాను పునరావాస కేంద్రాల నిర్వహణకు కేటాయించిన పాఠశాలల ఆవరణల్లో సచివాలయ, పంచాయతీ, మునిసిపల్ శాఖల అధికారుల సహకారంతో సంపూర్ణ పారిశుద్ధ్యాన్ని నిర్వహించాలని, పాఠశాల్లో పరిశుభ్రతను పాటించాలని, పాఠశాలల పరిసరాల్లో ఎక్కడైనా పాత భవనాలు, శిధిల భవనాలు, వర్షపు నీరు ఇంకే భవనాలు ఉంటే వాటి పరిసరాల్లోనికి విద్యార్థులు ఎవ్వరూ వెళ్లకుండా చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, అటువంటి చోట తరగతులను నిర్వహించొద్దని, పాఠశాల పరిధిలో భవన నిర్మాణాలు చేపట్టే ప్రదేశాల్లో త్రవ్విన గోతుల్లో వర్షం



నీరు ఉంటే ఆ ప్రదేశాలకు విద్యార్థులు ఎవ్వరూ వెళ్లకుండా జాగ్రత్త తీసుకోవాలని కుడా కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థులు పాఠశాలలకు వచ్చే, ఇంటికి వెళ్లే సమయాల్లో కాలువలు, నదులను దాటివలసి వచ్చిన చోట్ల విద్యార్థుల కోసం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాలని, పాఠశాల పరిసరాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, అధిక శక్తి విద్యుత్తు సరఫరా చేస్తున్న విద్యుత్తు తీగలు ఉంటే వాటి పరిసరాలకు విద్యార్థులు వెళ్లకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాలల తరగతుల గదుల్లో తడిచిన విద్యుత్ స్విచ్ బోర్డులు, తీగలు, పరికరాలకు విద్యార్థులను చాలా దూరంగా ఉంచాలని, వర్షాల వలన విద్యార్థులకు ఇచ్చే త్రాగు నీరు కలుషితం అవుతుంది గనుక మధ్యాహ్న భోజన సేవల సిబ్బంది ద్వారా వేడి నీటినే విద్యార్థులకు అందించుటకు చర్యలను తీసుకోవాలని, తరగతి గదుల్లో ఉండే మేజా బల్లలు, బెంచీల్లో పాములు, ఇతరత్రా విష పురుగులు చేరే అవకాశం ఉన్నందున విద్యార్థులను ఉదయమే తరగతి గదిలోనికి పంపే ముందుగానే ఆయాలు పరిశీలించాలని, అప్పుడు మాత్రమే విద్యార్థులను తరగతి గదుల్లోనికి అనుమతించాలని, దోమలు పెరగకుండా స్థానిక పంచాయితీ కార్యాలయ ప్రజారోగ్యశాఖ సిబ్బందిని సంప్రదించి బ్లీచింగు, రసాయనాలు చల్లించుకోవాలని, ఈ విషయాలపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖ అధికారులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ షన్మోహన్ సగిలి ఆదేశించారు.

## యానాం నియోజకవర్గంను ఆదుకోవాలి : ఎమ్మెల్యే గొల్లపల్లి

### నష్టం జరిగిన ప్రాంతాల్లో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి పర్యటన



**యానాం, విశ్వం వాయిస్ న్యూస్ :** యానాం నియోజకవర్గ పరిధిలో తుఫాను వల్ల నష్టపోయిన ప్రాంతాలను, పంటపొలాలను బుధవారం పుదుచ్చేరి రాష్ట్ర ఆర్థిక,రెవెన్యూ కార్యదర్శి ఉప్పు కృష్ణమోహన్ ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్అశోక్, ఆర్ఎఒ. ఐఎఎస్అధికారి అంకిత్ కుమార్,తుఫాను ప్రత్యేక అధికారి, పుదుచ్చేరి ఉన్నతవిద్యాకార్యదర్శి అమన్ శర్మ తదితరులుతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా కనకాలపేట, మెట్టకూరు, దరియాలతిప్పు, సావిత్రినగర్ తదితర ప్రాంతాల్లో పర్యటించి బాధితులతో మాట్లాడారు. దరియాలతిప్ప ఆయకట్టు, పరంపేట,కనకాలపేట తదితర ప్రాంతాల్లో వరిపంటకు జరిగిన నష్టం గూర్చి రైతాంగాన్ని అడిగి తెలుసుకున్నారు. అనందరం సావిత్రినగర్ జెట్టీ వద్ద మత్స్యకారులతో మాట్లాడి బోట్లు, ప్రాణనష్టం తదితర వాటి గూర్చి అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా తీరప్రాంత గ్రామాల్లో జరిగిన పంట నష్టం మత్స్యకారులు, ఎస్సీ గ్రామాల్లో జరిగిన నష్టం గూర్చి వివరాలు నమోదు చేసుకున్నారు.యానాం ను అన్నివిధాలా ఆదుకోవాలి రేషన్ కార్డుకు రూ.5వేలు నుంచి రూ.10వేలు ఇవ్వాలి ఎమ్మెల్యే అశోక్ వినతి... తుఫాను మిగిల్చిన నష్టంనుంచి బయట పడేవిధంగా యానాం నియోజకవర్గాన్ని ప్రభుత్వం ఆర్థికసహాయం అందించి అండగా నిలవాలని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ కోరారు. బుధవారం యానాం అత్యవసర పర్యటనకు వచ్చిన పుదుచ్చేరి ఆర్థిక, రెవెన్యూ కార్యిదర్శి ఉప్పు కృష్ణ మోహన్ కు నష్టం గూర్చి తెలిపే నివేదికను ఆయనకు అందజేశారు. ప్రతిరేషన్కార్డుకు రూ.5 వేలు నుంచి రూ.10వేలు ఇవ్వాలని, ఎకరానికి రూ.20వేలు ఇవ్వాలని, మత్స్యకారుల బోట్లుకు పరిహారం అందించాలని తదితర వాటి గూర్చి కోరారు. ఇప్పటికే సిఎం రంగసామి, ఎల్జీ కైలాస నాదన్, చీఫ్ సెక్రటరీ చౌహాన్ వినతిపత్రం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

## రైతులకు కూటమి ప్రభుత్వం భరోసా... : రూరల్ ఎమ్మెల్యే పంతం

**కాకినాడ రూరల్ /కరప, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ కరప మండలంలో గల అరట్లకట్ట గొడ్డటిపాలెం, జేడ్. భావారం గ్రామాలలో తుఫాన్ కారణంగా మునిగిపోయిన వరి పొలాలను వ్యవసాయ రెవిన్యూ అధికారులతో కలిసి సందర్శించి రైతులతో మాట్లాడి అన్ని విధాలుగా కూటమి ప్రభుత్వం ఆదుకుంటదని రైతులకు భరోసా ఇచ్చిన కాకినాడ రూరల్ శాసనసభ్యులు పంతం నానాజీ. ఈ కార్యక్రమంలో కరప మండలం జనసేన పార్టీ అధ్యక్షులు బండారు మురళి జనసేన పార్టీ కరప మండలం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ ముద్రగడ రమేష్, కరప మండలం వ్యవసాయ నీటి సంఘం ప్రెసిడెంట్లు రైతులు కరప మండలం జనసేన పార్టీ గ్రామ అధ్యక్షులు కూటమి నాయకులు జనసైనికులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.



### తుఫాను వల్ల దెబ్బ తిన్న పంట పొలాలను

## పరిశీలించిన సిపిఎం నాయకులు



**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పి.మల్లవరం మరియు సుంకటరేవు గ్రామాలలో తుఫానుకు దెబ్బతిన్న వరిచేలను బుధవారం సిపిఎం పార్టీ జిల్లా నాయకులు కెఎస్ శ్రీనివాస్ మరియు టేకుమూడి ఈశ్వరరావు పరిశీలించడం జరిగింది. పంట నష్ట పరిహారం వ్యక్తిగతంగా సర్వే చేసి నిజమైన సాగుదారులకు పంట నష్టపరిహారం అందించాలని కోరారు. నిజమైన లబ్ధిదారులకు రైతులకు పంట నష్టం అదే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టేకుమూడి ఈశ్వరరావు, కేఎస్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### పిల్లంకలో రోడ్డు, ఇళ్లపై పడిన చెట్లను తొలగించిన

## ఏపీ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది




**తాళ్ళరేవు, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా తాళ్ళరేవు మండలం పిల్లంక గ్రామంలో తుఫాను ప్రభావంతో ఇల్లు రోడ్లపై అనేకచోట్ల చెట్లు విరిగిపడ్డాయి. ఏపీ ఫైర్ సర్వీసెస్ సిబ్బంది, ఎన్ డి ఆర్ ఎఫ్ సిబ్బంది కలిసి రోడ్డుపై పడిన చెట్లను తొలగించి, భవనాలపై పడిన చెట్లను క్లియర్ చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తొలగించారు.

### ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే

## కూటమి ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే వనమాడి

**కాకినాడ సిటీ, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రతి కుటుంబాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందులతో సతమవుతమవుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందని శాసనసభ్యులు వనమాడి కొండబాబు పేర్కొన్నారు. వైద్య చికిత్స నిమిత్తం మంజూరి అయిన 10 లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ ను బుధవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా కొండబాబు మాట్లాడుతూ వైద్య చికిత్స నిమిత్తం ఆర్థిక ఇబ్బందులతో సతమవుతమవుతున్న కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకోవడం జరుగుతుందని నేడు దుమ్ములపేట ప్రాంతానికి చెందిన మోసా దేవరాజు లివర్ వైద్య చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రివర్యులు దృష్టికి తీసుకువెళ్లగానే వెంటనే 10 లక్షల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని ఇప్పటివరకు కాకినాడ నగరంలో కూటమి ప్రభుత్వం వైద్య చికిత్స నిమిత్తం సుమారు 5.5 కోట్ల రూపాయలు బాధిత కుటుంబాలకు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తుమ్మల రమేష్, చోడిపిల్లి సతీష్, ఏరిపిల్లి రాము, మోస పేతురు, మూగు రాజు, తిరిగి ఎల్లయమ్మ, సీరం చిన్న, అర్జిల్లా దాసు, నూకరాజు, మోస విజయ్ తదితరులు పాల్గొన్నారు.



## తుపాను పునరావాస కేంద్రాలను పర్యవేక్షించిన డీపీఓ



**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ రూరల్ మండలం తూరంగి గ్రామంలో రాజుల తూరంగి జిల్లా పరిషత్ హైస్కూలు, పగడాలపేట జిల్లా పరిషత్ హైస్కూల్లో ఏర్పాటుచేసిన తుఫాను పునరావాస కేంద్రాలను బుధవారం కాకినాడ జిల్లా పంచాయితీ అధికారి వి.రవికుమార్ సందర్శించారు. సెంటర్లలో ఉన్న తుఫాను బాధితులకు ఉదయం టిఫిన్ 300 మందికి మధ్యాహ్నము, రాత్రి భోజనాలు, 700 మందికి వసతులు ఏర్పాటు చేయడం జరిగిందని, సెంటర్లో ఉన్న వారికి ఏ ఇబ్బందులు లేకుండా చూడాలని సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు. తుఫాను ప్రభావం ఇంకా 24 గంటలు ఉంటుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎండిఓ పి.సతీష్, సత్యారెడ్డి, డిప్యుటీ ఎంపీడీవోలు శ్రీరామ్, ఐ.శ్రీనివాస్, ఆర్ డబ్ల్యూస్ జేఈ.మారుతి రామ్, ఏపీవో ఎం.గణేష్, పంచాయతీ కార్యదర్శులు నాగఫణి బాబు, టి.సత్యనారాయణ, ఎం.నాగేశ్వరరావు, ఎం.శివ, వీఆర్వో శ్రీనివాస్, మాజీ ఎంపిటిసి పితాని వెంకట రాము తదితరులు పాల్గొన్నారు.

## కొంతంగి కొత్తూరు రోడ్డులో రెండు బైకులు ఢీ..

**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గం శంఖవరం మండలంలోని శాంతి ఆశ్రమం అడ్డు రోడ్డు నుండి కొంతంగి కొత్తూరు గ్రామం వెళ్ళే రోడ్డులో ఊహించని రీతిలో బుధవారం మధ్యాహ్నం ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు బైకులు బలంగా ఢీకొన్నాయి. కొంతంగి కొత్తూరు గ్రామానికి చెందిన అప్పన రాంబాబు కత్తిపూడి నుండి కొంతంగి కొత్తూరు వైపు వెళ్తుండగా ఇతనికి ఎదురుగా కొత్తూరు నుండి కత్తిపూడి వైపుగా వెళ్తున్న గరగా పండు అనుకోని రీతిలో ప్రమాద వశాత్తూ తమ బైకులతో బలంగా ఢీకొట్టుకున్నారు. ఫలితంగా రెండు బైకులూ బలంగి ఢీ కొట్టుకుని నుజ్జు, నుజ్జు అయ్యాయి. అదృష్ట వశాస్తూ వాహనాల చోదకులు ఇరువురికీ తృటిలో ప్రాణాపాయ ప్రమాదం తప్పింది. శాంతి ఆశ్రమం అడ్డు నుంచి కొంతంగి వరకు రోడ్డుకు ఇరువైపులా తుప్పలు బాగా పేరుకుపోవడంతో అష్టావక్రాలుగా ఉన్న ఈ రోడ్డులో మలుపుల వద్ద ఎదురెదురుగా వస్తున్న వాహన చోదకులు ఒకరికి మరొకరికి పరస్పరం కనిపించక తరచుగా ఇలా ప్రమాదాలు చోటుచేసు కుంటున్నాయి. ఈ వాహనాల ప్రమాదం జరిగిన వెంటనే కొత్తూరు జనసేన పార్టీ అధ్యక్షుడు, విజయవాడ రైల్వే డివిజనల్ బోర్డ్ కమిటీ మెంబర్ గొర్లి నాగేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకుని తన సొంత ఖర్చులతో బైకులను మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చి ఇరువురి తగాదాను అక్కడికక్కడే పరిష్కరించారు. రెండు వర్గాలనూ శాంతింప చేసారు. ప్రతీ రోజూ ఇదే రోడ్డు మార్గం నుండి అనేక మంది ప్రయాణికులు ప్రయాణిస్తూ ఉండడం వలన తరచుగా ప్రమాదాలు చోటు చేసుకుంటూ ఉన్నాయని దీనిపై ఆర్ అండ్ బి అధికారులు వెంటనే చొరవ చూపి సమస్యను పరిష్కరించ వలసిందిగా గ్రామస్తులు కోరుతున్నారు. ఈ రాదారి సమస్య పరిష్కారానికి కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్ శ్రీనివాస్ ను తానే స్వయంగా వెళ్లి వివరిస్తాని గొర్లి నాగేశ్వరరావు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.



## తుఫాను భాదితులకు సహాయక చర్యలు




**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను నేపథ్యంలో గౌరవ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు కాకినాడ రూరల్ నియోజకవర్గం సముద్ర తీర ప్రాంత ప్రజలకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రంలో ఆశ్రయం పొందుతున్న ప్రజలకు ప్రత్యేకంగా చంటిపిల్లతో ఉన్న తల్లులు బాలింతలకు అవసరమైన వస్తువులు ఇవ్వటం. అలానే దుప్పట్లు బిస్కెట్లు వంటివి అందజేయటం జరిగింది. దీనికి కాకినాడ లైన్స్ క్లబ్ సంకల్ప వారు సహాయం అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ కడలి ఈశ్వరి కాకినాడ జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ (దిశ) కమిటీ సభ్యురాలు దోమదుల స్వాతి అడ్వకేట్ హేమ మరియు తదితర నాయకులు పాల్గొన్నారు.

## 'సేవ' సామాజిక బాధ్యత.. జమ్మలమడక నాగమణి..

### కాకినాడ గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం పంపిణీ..

### మొంథా తుఫాను బాధితులకు బాసటగా జమ్మలమడక.. - పునరావాస కేంద్రాల్లో ఆహారం, బిస్కెట్లు, పళ్లు అందజేత..

**కాకినాడ రూరల్, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు బాసటగా నిలిచారు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మహిళా విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జమ్మలమడక నాగమణి.. మంగళవారం జమ్మలమడక నాగమణి యువసేన ఆధ్వర్యంలో కాకినాడ, చీరాలలో పలు సేవా కార్యక్రమాలను చేపట్టారు.. ఆమె గౌరవాధ్యక్షురాలిగా ఏర్పాటైన కాకినాడ గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్, చీరాల కృతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆహారం, పళ్లు, బిస్కెట్లు అందించారు.. కాకినాడ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ ప్రభుత్వాస్పత్రి వద్ద రోగులకు వారి బంధువులకు ఆహారాన్ని అందించారు.. అదే సమయంలో చీరాల మండలం చినగంజాం ప్రభుత్వాస్పత్రిలో కృతి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఆకురాతి అశ్వని ఆధ్వర్యంలో రోగులకు వారి బంధువులకు ఆహారాన్ని అందజేసారు.. సుమారు 500 మందికి ఇంటిలో వండించిన రుచికరమైన వేడి వేడి ఆహారాన్ని అందించారు.. పరోపకారమే పరమావధిగా ఫౌండేషన్ సేవలు కొనసాగిస్తున్నామని ఈ సంధర్భంగా జమ్మలమడక నాగమణి పేర్కొన్నారు.. సమాజంలో అవకాశం ఉన్న ప్రతీ ఒక్కరు సేవ ను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు.. అనంతరం మొంథా తుపాన్ నేపధ్యంలో చీరాల చినగంజాం అంధుల పాఠశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావస కేంద్రాన్ని అక్కడ తుపాను ప్రభావిత ప్రాంతాల ప్రజలకు పళ్లు, బిస్కెట్లు అందించారు.. తుపాను తీరం దాటినా దాని ప్రభావం మరో 24 గంటలు ఉంటుందని ప్రభుత్వం, అధికారులు సూచిస్తున్న తరుణంలో ప్రజలు సురక్షితంగా పునరావస కేంద్రాల్లో తలదాచుకోవాలని జమ్మలమడక నాగమణి అక్కడి ప్రజలను కోరారు..ఈ కార్యక్రమంలో గ్లోబల్ హెల్పింగ్ ఆర్మీ ఫౌండేషన్, కృతి ఫౌండేషన్ సభ్యులు, వాలంటీర్లు పాల్గొన్నారు.



# వరి పంట నష్టంపై ఎమ్మెల్యే నల్లమిల్లి అధికారులతో సమీక్షా





**అనపర్తి, విశ్వంవాయిస్ న్యూస్ :** బుధవారం ఉదయం పెదపూడి ఎంపీడీఓ కార్యాలయంలో అగ్రికల్చర్, రెవిన్యూ, మండల ప్రజాపరిషత్ అధికారులతో "మొంథా" తుఫాను వలన నష్టపోయిన పంట వివరములు గురించి సమీక్షా సమావేశాన్ని అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి నిర్వహించారు. ఈ సందర్భంగా అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి సమావేశం లో మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తుఫాను తీవ్రంగా ఈ రాష్ట్రాన్ని తప్పించే పరిస్థితి ఉండడం ముఖ్యమంత్రి అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేయడం కూటమి నాయకులు అందరిని అప్రమత్తం చేయడం తద్వారా తద్వారా ప్రాణం నష్టం ఆస్తి నష్టం నివారించటం జరిగింది. ముఖ్యంగా ప్రకృతి కృప వల్ల భగవంతుని కృప వల్ల అనుకున్న స్థాయిలో తుఫాన్ కూడా తన ప్రభావాన్ని చూపించక పోవడం వలన ముఖ్యంగా ఆస్తి నష్టం కాని ప్రాణ నష్టం గానీ లేదనే చెప్పాలి కానీ రైతాంగం తీవ్రంగా నష్టపోయారు రైతులు ముఖ్యంగా ఉభయ గోదావరి జిల్లాలో వరి పండించే ప్రాంతం ఏద్దైతే ఉందో వరి మినుము గాని పూర్తిగా నష్టపోవడం జరిగింది అటువంటి పరిస్థితుల్లో వరి రైతులు కూడా దాదాపు పది రోజులు 15 రోజులలో పంట చేతికి వస్తుందని సమయంలో ఈ తుఫాను ప్రభావం రావటం దానివలన పంట నేల కొరగడం జరిగింది పంట నేల కొలగడంతో పాటు కొన్నిచోట్ల నీటిలో ములగడం అలాగే మొలకలు వచ్చే పరిస్థితి ఇవాళ చూసాం. ఇటువంటి పరిస్థితుల్లో రైతాంగాన్ని ఆదుకోవాలి రైతు ఎంత నష్టపోయాడు కానీ వివరాలను కూడా అధికారులతో సేకరించి వ్యవసాయ శాఖ ద్వారా అందించడం జరగాలని ఉద్దేశంతో మంగళవారం బుధవారం వ్యవసాయ శాఖ అలాగే రెవెన్యూ శాఖ అధికారులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ముఖ్యంగా ఇది చాలా విపత్కర పరిస్థితి మొట్ట మొదటిసారిగా ఇటువంటి పరిస్థితిని ఇవాళ మనం చూస్తున్నాం ప్రభుత్వం మార్గదర్శకాలు ఒక విధంగా ఉన్నాయి ఇవాళ పంట నష్టపోయిన వాస్తవం పరిస్థితులు మరొక విధంగా ఉన్నాయి బాధ్యత ప్రజా ప్రతినిధులుగా మాపై ఉంది దానికి తగిన విధంగా ఈ విషయాన్ని వాస్తవ పరిస్థితులను మార్గదర్శకాలను రెండు ముఖ్యమంత్రి దగ్గర ఉంచి అనేక నిబంధనలను సరళీకృతం చేసి ఇవాళ రైతులను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. అందుకోసమే వాస్తవ పరిస్థితులను బేరిజు వేయడం కోసం ఎక్కువగా క్షేత్రస్థాయిలో సమీక్ష చేస్తూ పూర్తి అవగాహన చేసుకోవడం కోసం ప్రయత్నం చేస్తా ఉన్నాం. ఈరోజు అంచనా ప్రకారంగా దాదాపుగా పదివేల ఎకరాలు పంట నీట మునిగింది అయితే నేల కొరిగింది అయితే అంచనాకు రావడం జరిగింది పెదపూడి మండలంలో ,అదేవిధంగా ఉదయం అనపర్తి బిక్కవోలు మండలంలో కూడా పర్యటించడం జరిగింది. మరోపక్క రంగంపేట మండలం కూడా పర్యటన చేయడం కూడా జరుగుతా ఉంది ఇవన్నీ కూడా రేపు ఎల్లుండి సమీక్ష చేసుకుని పూర్తి స్థాయిలో నివేదికను ముఖ్యమంత్రి దగ్గరకు వెళ్లి రైతులను ఆదుకోవాలి రైతులకు ముఖ్యంగా యజమానులు కౌలుదారులు అక్కడ కూడా నిబంధనలను సవరించాల్సిన అవసరం ఉంది ఇవన్నీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినప్పుడు ముఖ్యమంత్రి ఒక నిర్ణయం తీసుకునే వెసులుబాటు వస్తుంది. అందువలన ఇవాళ క్షేత్రస్థాయిలో ఉన్న అధికారులు అగ్రికల్చర్ అసిస్టెంట్లు,వీఆర్వో స్థాయి నుంచి మండలంలో ఉన్న అగ్రికల్చర్ అధికారులు , రెవెన్యూ అధికారులు జిల్లా స్థాయిలో ఉన్న అధికారులు జిల్లా కలెక్టర్లు అందరూ వాస్తవ పరిస్థితులను ముఖ్యమంత్రికి నివేదించమని కొరతా ఉన్నాం తప్పనిసరిగా రైతులకు పూర్తి సంపూర్ణమైన న్యాయం చేయడం కోసం ప్రజాప్రతినిధులు మా వంతు మేము కృషి చేస్తామని ఈ సందర్భంగా తెలియజేస్తూ ఈరోజు కార్యక్రమానికి ఏడి అగ్రికల్చర్ అధికారులతో వ్యవసాయ శాఖ అధికారులు అదేవిధంగా మండల స్థాయిలో ఉన్న రెవెన్యూ మండల పరిషత్ అధికారులు ముఖ్యంగా కూటమి నాయకులు అందరూ ప్రజాప్రతినిధులు హాజరు కావడం జరిగింది అందరికీ పేరుపేరునా కృతజ్ఞతలు తెలియజేసుకుంటూ అందరూ క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవ పరిస్థితులను సంపూర్ణంగా నాకు తెలియ జేయాల్సిందిగా మరొకమారు కృతజ్ఞతలు తెలియ జేసుకుంటూ ముఖ్యంగా ఈ రెండు రోజులపాటు ప్రాణమాష్టం ఆస్తి నష్టం జరగకుండా అప్రమత్తంగా ఉండి సహాయపడిన కోటమి నాయకులు అధికారులు అందరికీ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను ఇవాళ ముఖ్యమంత్రి ఆదేశాలతో 24/7 పెద్ద ఎత్తున ప్రమాదం సంభవించకుండా కాపాడారు,అదే విధమైన చొరవ స్ఫూర్తి రైతుల విషయంలో చూపించమని అధికారులని కోరామనీ రామకృష్ణారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో పెదపూడి మండల ప్రజా పరిషత్ అధికారులు, పెదపూడి మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మొంథా తుఫాను ప్రభావాన్ని జిల్లా కలెక్టర్ పరిశీలన

**నల్లజర్ల, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావం నేపథ్యంలో నల్లజర్ల మండలంలోని అనంతపల్లి గ్రామం వద్ద ఎర్ర కాలువ వరద నీటి ప్రవాహాన్ని జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి బుధవారం ప్రత్యక్షంగా పరిశీలించారు. కలెక్టర్ వెంట కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, తహసీల్దార్ నల్లజర్ల, ఇరిగేషన్ శాఖ డీఈఈ మరియు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. ఎర్ర కాలువలో నీటి మట్టం పెరుగుదల, ముంపు ప్రభావిత ప్రాంతాలు, జంగారెడ్డిగూడెం వద్ద జరుగుతున్న ప్రాజెక్టు నిర్మాణ స్థితి వంటి అంశాలపై కలెక్టర్ కీర్తి చేకూరి క్షేత్ర స్థాయిలో సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ "ఖమ్మం జిల్లా, భద్రాది కొత్తగూడెం జిల్లాల నుంచి ఎర్ర కాలువకు వరద నీరు వస్తోందనీ, ఎగువ ప్రాంతాల నుంచి ఎంత వరద నీరు వస్తే ఇక్కడ ముంపు ప్రభావం ఉంటుందో ఇరిగేషన్ అధికారులతో సమీక్షించారు. కాలువ మొత్తం 4 టీఎంసీ సామర్థ్యం కలిగి ఉండగా, ప్రస్తుతం 2.5 టీఎంసీ నీరు ఉందని అధికారులు పేర్కొన్నారు." రూట్ మ్యాప్ ఆధారంగా వరద నీటి ప్రవాహ దిశ, ముంపు ప్రమాద ప్రాంతాలను ఇంజినీరింగ్ బృందంతో సమీక్షించిన కలెక్టర్ అవసరమైన నియంత్రణ చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి, కలెక్టర్ రైతులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసు కున్నారు. నల్లజర్ల మండల పరిధిలో 1,235 హెక్టార్లలో వరి సాగు జరగగా, మొంథా తుఫాను ప్రభావంతో 110 హెక్టార్ల పంట పడిపోయి, నష్టం వాటిల్లిందన్నారు. ఇప్పటి వరకు సేకరించిన డేటా ప్రకారం మండలంలోని 12 గ్రామాలకు చెందిన 83 మంది రైతులకు ఈమేరకు నష్టం జరిగిందన్న



అంచనాలకి వొచ్చినట్లు అధికారుల నుంచి ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. పంట పొలాల్లో నీరు నిల్వ ఉండకుండా పిల్లకాల్వలు ఏర్పరచి, నీరు బయటకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలని రైతులకు కలెక్టర్ సూచించారు. వ్యవసాయ అధికారులు సూచనలు మేరకు పూర్తిగా పడిపోయిన కంకులను కట్టలుగా నిలబెట్టి, ధాన్యాన్ని రక్షించుకోవడం, మొలక రాకుండా ఉండటానికి 5% ఉప్పు ద్రావణాన్ని పిచికారి చేయడం వంటి చర్యలు తీసుకోవాలని సూచించారు. కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ, "ప్రజల భద్రత మరియు రైతుల పంట రక్షణ రాష్ట్ర ప్రభుత్వ ప్రాధాన్యత. తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో రైతుల నష్టాలను అంచనా వేసి, తక్షణ సాయం అందించే చర్యలు చేపడతాం అన్నారు. ప్రభుత్వం ప్రజలతో పాటు నిలబడి, ప్రతి కుటుంబానికి అవసరమైన సహాయం అందిస్తుందన్నారు. అధికారులు శాఖల మధ్య సమన్వయంతో పని చేసి ఎవరూ ఆందోళన చెందకుండా చూడాలనీ పేర్కొన్నారు.

# వరి పంట నష్టం అంచనాతో రైతులను ఆదుకుంటాం..

**– మొంథా తుఫాను ప్రభావం పరిశీలించి సహాయచర్యల్లో డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల**

**కడియం, విశ్వం వాయిస్ న్యూస్ :** రాజమహేంద్రవరం రూరల్ స్థానిక కడియం మండలంలో ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి ఆదేశాను సారం... మొంథా తుఫాన్ ప్రభావంతో విసిన భారీ గాలుల వల్ల కడియం మండలం ఆవ పొలాల్లో నేలనంటిన వరి పంటను తెలుగు దేశం పార్టీ యువ నాయకులు రాష్ట్ర ఆరోగ్య విభాగం ప్రధాన కార్యదర్శి డాక్టర్ రవిరామ్ కిరణ్ గోరంట్ల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ రవి రామ్ కిరణ్ మాట్లాడుతూ సుమారు 1800 ఎకరాల్లో వరి పంటను సాగు చేస్తున్న రైతులు,అందులో 1000 ఎకరాలు వరి పంట దెబ్బతినడం, ఆరుగాలం పండించిన పంట మరో



20 రోజుల్లో చేతికి వచ్చే సమయంలో కళ్ళముందే నేలనంటడం చాలా దురదృష్టకరమని, నేల నంటిన వరి పంటను పరిశీలించిన అనంతరం ఈ విషయాన్ని మన ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరికి, ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి రైతులందరినీ ఆదుకుంటామని పంట నష్టం అంచనా వేయాలని అధికారులకు సూచించారు. అనంతరం కడియం గ్రామంలో పునరావాస కేంద్రాన్ని పరిశీలించి వారికి అందుతున్న వసతి సౌకర్యాల వివరాలు అడిగి తెలుసుకోని భోజనాలు వడ్డించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కడియం ఎంపీపీ వెలుగుబంటి ప్రసాద్, కడియం మండలం టీడీపీ అధ్యక్షులు వెలుగుబంటి నాని, బీజేపీ మండల అధ్యక్షులు బొరుసు సుబ్రహ్మణ్యం, కూటమి నాయకులు సూరపురెడ్డి జానకిరామ్, చిరుకూరి ప్రభ, చిరుకూరి నాగేశ్వరావు, గారపాటి తాతబ్బాయి, ఉండమట్ల ప్రభాకర్, చిక్కాల శ్రీను, ఆవ రైతులు జగత వెంకటేష్, ఆకుల దుర్గాప్రసాద్ గేదాడ శ్రీను, ఆకుల నాగబాబు, వారణాసి గోవిందు, శాఖ ఆదినారాయణ, ఆకుల పెద్దకపు, ఆకుల రామకృష్ణ, గల్లా పెద్దకపు, కుపాల్లా నాగు, అధికారులు ఎంపీడీవో రమేష్, తహసీల్దార్ సునీల్, విఆర్వోలు జానకి, ప్రశంస, అగ్రికల్చర్ సిబ్బంది ప్రత్యూష పలువురు అధికారులు పాల్గొన్నారు.

# వరద బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

**పునరావాస కేంద్రం పరిశీలించిన బత్తుల వెంకటలక్ష్మి**



**కోరుకొండ, విశ్వం వాయిస్ న్యూస్ :** మండలంలోని శ్రీరంగపట్నం పునరావాస కేంద్రంలో తల దాచుకున్న వరద బాధితులను జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి పరామర్శించి, బాధితులకు ప్రభుత్వం అన్ని విధాల అండ దండగా ఉంటుందని వెంకటలక్ష్మి అన్నారు. బుధవారం శ్రీరంగపట్నంలో ముంపు ప్రాంతాన్ని సందర్శించి, పునరావాస కేంద్రానికి వెళ్లి బాధితులతో కొద్దిసేపు మాట్లాడి, మెరుగైన సౌకర్యాలు కల్పించాలని అధికారులకు తెలిపారు. అనంతరం బాధితులకు ఆమె స్వయంగా వడ్డం చేశారు. వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్య, శానిటేషన్ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలు అందించాలన్నారు. సచివాలయం సిబ్బంది గ్రామంలో ఎటువంటి వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యల్లో భాగంగా శానిటేషన్కు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు, అధికారులు, సచివాలయ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


**చినకొండేపూడిలో నేలవాలిన వరి పంటలను**

# పరిశీలించిన బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను కారణంగా కురిసిన భారీ వర్షాలకు రాజానగరం నియోజకవర్గంలో వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈనేపథ్యంలో రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్‌చార్జి & రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి సీతానగరం మండలం, చినకొండేపూడి గ్రామంలోని ముంపునకు గురైన వరి పొలాలను సందర్శించారు. చేతికొచ్చిన పంట నేలవాలడం, నీటిలో మునిగిపోవడంతో తీవ్రంగా నష్టపోయిన వరి పొలాలను పరిశీలించి, నష్టం తీవ్రతను అంచనా వేశారు. పంట నష్టంపై రైతులు తమ ఆవేదనను, అప్పుల బాధలను బొడ్డు వెంకటరమణ చౌదరికి వివరించారు. రైతులకు అండగా ఉంటామని హామీ ఇస్తూ, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసేలా, అలాగే నష్టపోయిన ప్రతి ఎకరాకు ఇన్‌పుట్ సబ్సిడీ (నష్టపరిహారం) వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రికి విజ్ఞప్తి చేస్తానని తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల అధికారులు తక్షణం ఉమ్మడిగా సర్వే నిర్వహించి, నియోజకవర్గంలోని పంట నష్టం వివరాలతో కూడిన వాస్తవ నివేదికను ప్రభుత్వానికి పంపాలని ఆయన ఆదేశించారు. ఈ పర్యటన ద్వారా తుఫాను వల్ల ఆర్థికంగా కుంగిపోయిన రైతులకు తక్షణ సహాయం, నష్టపరిహారం అందేలా ప్రభుత్వ యంత్రాంగాన్ని అప్రమత్తం చేశారు.

# తుఫాన్ కారణంగా కూనవరంలో పాడి గేదె మృతి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** సీతానగరం మండలం కూనవరం గ్రామంలో ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలకు నల్లమోతు సుబ్బారావుకు చెందిన పాడి గేదె మృతి చెందింది. ఈ విషయం స్థానిక నాయకుల ద్వారా రాజానగరం నియోజకవర్గ జనసేన పార్టీ నా సేన కోసం నావంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి తెలుసుకొని రైతు సుబ్బారావును పరామర్శించి సంఘటన గురించి వివరాలు అడిగి తెలుసుకొని వారికి మనోధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

**మార్గాని భరత్ ఆధ్వర్యంలో**

# తుఫాను నిరాశ్రయులకు సహాయం



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంవల్ల నిరాశ్రయలకు, నిరు పేదలకు మాజీ ఎంపీ వైసీపీ జాతీయ అధికార ప్రతినిధి మార్గాని భరత్ రామ్ సహాయం అందించారు.వైసీపీ అధినేత వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆదేశాలు మేరకు మార్గాని భారత్ రామ్ ఆధ్వర్యంలో స్థానిక రాజమండ్రి పుష్కర్ ఘాట్ దగ్గర సుమారు 200మంది పేద ప్రజలకు దుప్పట్లు, రగులు, బ్రెడ్లు పంపిణీ చేశారు. వైసీపీ సిటీ యూత్ అధ్యక్షుడు బిల్డర్ చిన్న సమక్షంలో వీటిని పంపిణీ చేశారు.కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి రోక్కం త్రినాథ్,24 వార్డు వైసీపీ నాయకులు కటకం చిన్న, బోర్రా కనక లింగేశ్వరావు, గౌరి శంకరరావు, సత్తిరాజు, ఉండ్రాజవరపు సూర్య, రమణ,తదితరులు పాల్గొన్నారు.

**పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేసిన**

# రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి



**సీతానగరం, విశ్వం వాయిస్ న్యూస్ :** రుడా చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాజానగరం నియోజకవర్గ ఇన్చార్జ్ మరియు రాష్ట్ర కార్యదర్శి బొడ్డు వెంకటరమణ చౌదరి సిఫార్సుతో సీతానగరం మండలం పురుషోత్తపట్నం గ్రామానికి చెందిన కాజా సుబ్రహ్మణ్యంకు రూ 1,62,000/లు, బొబ్బిలిలంక గ్రామానికి చెందిన చేబ్రోలు వెంకటలక్ష్మికి రూ.21 974/ల, చినకొండేపూడి గ్రామానికి చెందిన యర్రంశెట్టి గంగరాజుకు 25,000/ల మనురైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను బొడ్డు వెంకటరమణ చౌదరి చేతుల మీదుగా అందజేశారు.

# ప్రపంచ పోలియో దినోత్సవంలో అవగాహన ర్యాలీ







**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** ప్రపంచ పోలియో దినోత్సవం సందర్భంగా రోటరీ రాజమహేంద్రవరం ఐకాన్స్ వారు బుధవారం ఉదయం ప్రత్యేకమైన పోలియో అవగాహన ర్యాలీను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జి.ఎస్.ఎల్ మెడికల్ కాలేజ్ విద్యార్థులు మరియు ఆదిత్య కాలేజ్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ డా.నాగేశ్వరరావు పాల్గొన్నారు.ర్యాలీని పోలియో చైర్ డైరెక్టర్ రోటేరియన్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించగా, క్లబ్ ప్రెసిడెంట్ రొటేరియన్ మండవెల్లి వెంకన్న బాబు, చార్టర్డ్ ప్రెసిడెంట్ రొటేరియన్ తీగెల రాజా మాట్లాడుతూ రోటరీ అంతర్జాతీయంగా పోలియోని తూదముట్టించిందని 1985 నుండి ప్రపంచం అంతటికీ పోలియో అందించిందని నేడు ప్రపంచంలో పోలియో కొన్ని దేశాలలో మాత్రమే చిన్నగా ఉన్నదని ముందు జాగ్రత్త చర్యలుగా పోలియోపై సమరాన్ని కొనసాగిస్తూ పిల్లలందరికీ కూడా పోలియో డ్రాప్స్‌ని యాంచాలని ప్రజలకు అవగాహన కొరకు ర్యాలీ ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాస్ట్ ప్రెసిడెంట్ రొటేరియన్ వెంకట్, క్లబ్ సెక్రటరీ రఘునాథ్ రాజు, క్లబ్ ట్రెజరర్ రొటేరియన్ దావూద్, రోటేరియన్లు వీరేంద్ర, నవీన్, ఐశ్వర్య, స్వాతి,అనుకుమార్, జోహార్ కృష్ణ,వజ్రాల, శ్యామ్ పొన్నాడ తదితరులు పాల్గొన్నారు.

**కె.ఎస్.ఆర్.హాస్పటల్, మానవతా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో**

# ఉచిత వైద్య శిబిరం

**ఎముకల సాంద్రత పరీక్షలు ఉచితంగా మందులు పంపిణీ**




**రాజమహేద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ, కె.ఎస్.ఆర్.హాస్పటల్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఉదయం కె.ఎస్.ఆర్.హాస్పటల్ ఆవరణలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి వృద్ధులకు, స్త్రీలకు ఉచితంగా ఎముకల సాంద్రత(బిఎండి) పరీక్షలు చేసి మందులు అందచేశారు. ముఖ్య అతిధిగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ రీజనల్ చైర్మన్ సి.పి.రెడ్డి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొమ్మ శ్రీనివాస రావు,డాక్టర్ కొమ్మ సుస్మిత శిబిరంలో పాల్గొన్న సుమారు 100 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణి చేశారు. 45 సంవత్సరాలు దాటిన ప్రతి ఒక్కరూ మెనోపాజ్ వచ్చిన స్త్రీలు పరీక్షలు చేయించు కోవాలని దీనివల్ల ఎముకల దృఢత్వం తెలుస్తుందని వైద్యులు చెప్పారు. ఎముకలు గుల్లబారకుండా ఉండడానికి కాల్షియం అధికంగా ఉండే పాలు, ఆకుకూరలు, నువ్వులు, రాగులు తీసుకోవాలని సూచించారు. ప్రతిరోజు సూర్యరశ్మి తగిలేలా ఎండలో 15 నిముషాలు ఉండాలని వారు సూచించారు. కార్యక్రమంలో ధర్మారెడ్డి, గాంధీ మాస్టారు, కె.రుద్రమదేవి, కె.రాజ్యలక్ష్మి, ఎస్.విశ్వనాథ్, సబ్బిశెట్టి రాం బాబు, ఏ.శ్రీనివాస్, యు.శ్రీరామమూర్తి, కె.రామ్మోహన్, పి.అప్పారావు, బి.అప్పారావు, సబ్బిశెట్టి లీలా సుందరి, భాగవతి శిరీష, శ్రీకాకోళపు ప్రియాంక, స్వాతి, మెహర్ మధు, తమ్మా రవి, కృష్ణప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. కె.ఎస్.ఆర్.హాస్పటల్ మేనేజింగ్ డైరెక్టర్ కొమ్మ ఉజ్వల్ సహాయ సహకారాలు అందించారు.

### మొంథా తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు

# నిత్యావసర సరుకులు సకాలంలో అందజేయాలి : కలెక్టర్ షణ్మోహన్




**కాకినాడ, విశ్వంవాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలు సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేయడంతో పాటు నష్టం అంచనాల ప్రక్రియ ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కాకినాడ తన క్యాంపు కార్యాలయం నుంచి రెవెన్యూ, వ్యవసాయం, మత్స్య, పౌరసరఫరాలు, చేనేత శాఖల అధికారులతో జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. తుఫాను ప్రభావిత ప్రాంత ప్రజలకు నిత్యావసర సరుకుల పంపిణీ, పునరావాస కేంద్రాల్లోని కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం, తుఫాను నష్ట గణన ప్రక్రియకు చేపట్టాల్సిన చర్యలపై ఆయన చర్చించి, అధికారులకు దిశా నిర్దేశనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ షణ్మోహన్ మాట్లాడుతూ తుఫాను బాధితులకు సకాలంలో నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో మొంథా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లోని ప్రజలకు రోజువారీ నిత్యావసరాలను ఉచితంగా పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలు వెంటనే చేపట్టాలని జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పునరావాస కేంద్రాల్లోని ప్రతి కుటుంబానికి రూ. 3వేలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ప్రతి బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం (మత్స్యకారులకు 50 కేజీల బియ్యం), 1కిలో పప్పు, 1లీటరు వంట నూనె, 1కిలో ఉల్లిపాయలు, 1కిలో బంగాళాదుంపలు, 1కిలో చక్కెర అందజేయాలని ఆయన తెలిపారు. అదేవిధంగా తుఫాను నష్ట గణన ప్రక్రియ చేపట్టాలన్నారు. ఇందుకు సంబంధిత శాఖల అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నివేదికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అధికారులను సూచించారు. మొంథా తుఫాను తీరం దాటినప్పటికీ బుధవారం దాని ప్రభావం ఉంటుందని ప్రజలు అప్రమత్తంగా ఇంటి వద్ద సురక్షితంగా ఉండాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. జూమ్ కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటరావు, వ్యవసాయ, మత్స్య శాఖ అధికారులు ఎన్.విజయ్ కుమార్, పి.కృష్ణారావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.దేవులా నాయక్, డీఎస్వో ప్రసాద్ రావు, కాకినాడ, పెద్దాపురం ఆర్డీవోలు ఎస్ మల్లి బాబు, కె.శ్రీరమణి, పాడా పీడీ చైత్ర వర్షిణి ఎస్బీ డీఎస్పీ సత్యనారాయణ, చేనేత శాఖ ఏడీ పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

# తుఫాను ప్రభావంతో నష్టపోయిన రైతులను అన్ని విధాలా ఆదకుంటాం..



**అంబాజీపేట, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో రైతులను ప్రభుత్వపరంగా అన్ని విధాల ఆదుకుంటామని అమలాపురం ఎంపీ గంటి హరీష్ బాలయోగి , పి గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సంయుక్తంగా పేర్కొన్నారు. మొంథా తుఫాను ప్రభావంతో పలు ప్రాంతాల్లో బుధవారం పర్యటించారు. అంబాజీపేట మండలంలోని మోసలపల్లి గ్రామాన్ని సందర్శించి, దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతును ప్రభుత్వం ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. చెట్లు పడిపోవడం, విద్యుత్ స్తంభాలు కూలిపోవడం వంటి సమస్యలు చోటుచేసుకున్నప్పటికీ, అధికారులు తీసుకున్న తక్షణ చర్యల కారణంగా విద్యుత్ సరఫరా పునరుద్దించబడిందని తెలిపారు. పునరావాస కేంద్రాల్లో ఉన్న కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ. 3,000 చొప్పున ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళిక చర్యల వల్ల ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఉండటం ప్రభుత్వపు యంత్రాంగ సమర్థతని వెల్లడిస్తోందని అన్నారు.అంతేకాకుండా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ దూరదృష్టి, నాయకత్వం వలన పెద్ద నష్టం తప్పించుకోవడం సాధ్యమైందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# చంద్రబాబు, జగన్ ఫీజు రియంబర్సెంట్ పథకానికి తూట్లు

## విపత్కర పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ నిలిచిపోవడం ప్రభుత్వ వైఫల్యం : డాక్టర్ టి.కె విశ్వేశ్వరరెడ్డి



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాన్ వల్ల ప్రజల ప్రాణాలకు, ఆస్తులకు ఎటువంటి నష్టం కలగకపోవడం అందరూ ప్రశాంతంగా ఊపిరి పీల్చుకున్నారని, అన్ని శాఖల అధికారులు సమర్థవంతంగా పనిచేసారని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో టీకే మాట్లాడుతూ ఇటువంటి విపత్కర పరిస్థితుల్లో ఆరోగ్యశ్రీ పథకం సేవలు నిలిచిపోవడం ప్రభుత్వ వైఫల్యమని ధ్వజమెత్తారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకాలను నిర్వీర్యం చేస్తున్న చంద్రబాబును ఏమనాలని ప్రశ్నించారు. పేదలు ఇబ్బంది పడుతుంటే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గతంలో జగన్ కూడా ఫీజు రీఎంబర్స్‌మెంట్ పథకానికి తూట్లు పొడిచారని, ఇప్పుడు చంద్రబాబు కూడా అలాగే వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. అందరూ స్వదేశీ వస్తువులు వాడాలంటున్న మోదీ మాత్రం విదేశీ వస్తువులే వాడుతున్నారని ఆరోపించారు. ఎల్ఐసిలో 32 వేల కోట్ల అదానీ సంస్థల అక్కౌంట్‌కు ఎందుకు ట్రాన్స్‌ఫర్ చేసారో చెప్పాలని డిమాండ్ చేసారు. ఎయిర్‌పోర్టులు, కేంద్ర ప్రభుత్వ సంస్థలను అమ్మేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. కాంగ్రెస్ నాయకులు కిశోర్‌కుమార్ జైన్, మేడవరకు భద్రం దొర, బిల్డర్ బాబీ, చిన్నం మురళీకృష్ణ,డాక్టర్ రాజశేఖర్,బర్రే సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# అన్నదాతకు అండగా ఉంటాం..

### ప్రతి ధాన్యం గింజను కొనుగోలు చేస్తాం..
### సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశాలు : మంత్రి సుభాష్



**కాజులూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** అన్నదాతలను ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ చిత్తశుద్ధితో ఉందని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలు, గాలివానలు,తుఫాన్ కారణంగా కాజులూరు మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగి, నేలమట్టమైన గ్రామాల్లో కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,రెవెన్యూ, వ్యవసాయ శాఖ అధికారులతో కలిసి మంత్రి విస్తృతంగా పర్యటించారు. మండలంలోని చేదువాడ, తర్లంపూడి,శీల గ్రామాల్లో పంట పొలాలను మంత్రి పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ రైతులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. నియోజకవర్గంలో సుమారు 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ సాగవుతుందని,భారీ వర్షాలు,తుఫాను తాకిడికి 80 శాతం మేర పంట పొలాలు నేలమట్టం అయ్యాయని అన్నారు. పంట నష్టం వివరాలను ఒక సమగ్ర నివేదిక అందజేయాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు.అధైర్య పడవద్దు,కూటమి ప్రభుత్వం మీకు అన్నివేళలా అండగా ఉంటుందని రైతులకు భరోసా ఇచ్చారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ రామచంద్రపురం,కె. గంగవరం,కాజులూరు మండలాల్లో మొత్తం 51 వేల 800 ఎకరాల్లో ఖరీఫ్ పంటలు సాగులో ఉన్నాయని,అందులో సుమారు 41 వేల ఎకరాల్లో పంటలు నేలమట్టం అయినట్టు గుర్తించామన్నారు. ప్రస్తుతం పంటలు గింజ గట్టిపడే దశ నుండి పాలు నిండే దశలో ఉన్నాయన్నారు.పంటలు చేతికొచ్చే దశలో తుఫాన్, అకాల వర్షాల కారణంగా పంటలు నేలకొరిగి రైతాంగం ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనలు చేసి నష్టపోయిన రైతులకు అవసరమైన సహాయక చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశామన్నారు. అన్నదాతలు కలత చెందవద్దని,రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని స్పష్టం చేశారు.కూటమి పార్టీ నాయకులు వాసంశెట్టి సత్యం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రైతుల పక్షపాతిగా ఉండి అన్నివేళలా ఆదుకుంటుందని , అన్నదాతలు ఆందోళన చెందవద్దని అన్నారు. మంత్రి సుభాస్ పంట నష్టాలను సీఎం దృష్టికి తీసుకెళ్లి తగు న్యాయం జరిగేలా చూస్తారని పేర్కొన్నారు.మంత్రి సుభాష్ వెంట కాజులూరు తహసిల్దార్ ఠాగూర్, వ్యవసాయ శాఖ అధికారి వి అశోక్,పలువురు అధికారులు,కూటమి పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### భారీ తుఫాన్‌లో కూడా గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి

# వ్యక్తి ప్రాణాలను కాపాడిన కాకినాడ పోలీసులు






**కాకినాడ, విశ్వం వాయిస్ న్యూస్ :** కాకినాడ జిల్లా ఎస్పీ జి.బింధుమాధవ్, ఉత్తర్వులు ప్రకారం 28/29.10.2025 వ తేదీన అర్ధరాత్రి 12.00 గంటల నుండి 2.00 మధ్య సమయంలో అవయవాలు తరలించు నిమిత్తం కాకినాడ "మెడికోవర్ హాస్పిటల్ నుండి ట్రస్ట్ మరియు అపోలో హాస్పిటల్ వరకు అంబులెన్సు లకు గ్రీన్ ఛానల్ ఏర్పాటు చేసి, అంబులెన్సు లకు ఎటువంటి అంతరాయం లేకుండా సరైన సమయంలో తీసుకెళ్లడం వలన వ్యక్తి ప్రాణాలను కాపాడిన కాకినాడ పోలీసులు తమ మానవత్వాన్ని చాటారు. అవయవ దాత యొక్క వివరాలు: పేరు: గుడాల మహేష్, వయస్సు: 23 సంవత్సరాలు, తండ్రి శ్రీను. గువ్వలవారి వీధి, అమలాపురం, కోనసీమ జిల్లా. సదరు విషయంపై కాకినాడ ప్రజలు పోలీసు వారిని మరియు హాస్పిటల్స్ యాజమాన్యం వారిని హర్షధ్వానాలతో అభినందించారు.

# తుఫాను బాధితులను సాయంతో శ్రేణులు ఆదుకోవాలి

### నా జన్మదిన వేడుకలను నేను దూరం - పార్టీ నాయకులు, కార్యకర్తలు విచ్చేయవద్దు..



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** తుఫాను 'మొంథా'ప్రభావంతో అనపర్తి నియోజకవర్గంలో రైతులు,ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇలాంటి సందర్భంలో ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం, వారికి అండగా నిలబడడం ప్రతి నాయకుడి కర్తవ్యం. ఈ నేపథ్యంలో, అక్టోబర్ 31న జరగాల్సిన నా జన్మదిన వేడుకలను రద్దు చేస్తున్నాను.తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పార్టీ శ్రేణులు, అభిమానులు ప్రజలకు అండగా ఉండాలని కోరుతున్నాను. ప్రజలు ఇబ్బందుల్లో ఉన్న సందర్భంలో వేడుకలు జరుపుకోవడం సరికాదు అని భావిస్తూ, నా జన్మదిన వేడుకలను రద్దు చేస్తున్నాను.అందువల్ల,నా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేయడానికి ఎవరూ అనపర్తికి విచ్చేయవద్దు. ఇది నాకు ఇచ్చే నిజమైన బహుమతి అని మాజీ శాసన సభ్యులు,అనపర్తి నియోజకవర్గ వైయస్ఆర్‌సీపీ సమన్వయ కర్త డాక్టర్ సత్తి సూర్య నారాయణ రెడ్డి ప్రాధేయపడ్డారు.

# మొంథా తుఫాన్ అనపర్తిలో రైతాంగానికి భారీ నష్టం

**పలు మండలాల్లో సుడిగాలి పర్యటనలు చేసిన ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**
**వర్షాలతో పంటలు నేలకొరిగి ధాన్యపు గింజలు నీటిలో నానుతున్న వైనం**
**ఎక్కడికక్కడ రైతులతో మమేకమై పంట నష్టం తెలుసుకుంటూ రైతులను ఓదార్చిన రామకృష్ణారెడ్డి**
**అధికారులను పంట నష్టంపై నివేదికలు ఇవ్వండి - అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి**



**అనపర్తి, విశ్వం వాయిస్ న్యూస్ :** అనపర్తి, బిక్కవోలు, పెదపూడి మండలాలలో వరి చేలు, రంగంపేట మండలంలో మినుములు ఎక్కువగా నష్టపోయాయన్న నల్లమిల్లి పంట నేలకొరిగిన క్రమంలో ప్రభుత్వ నిబంధనలను అనుసరించి సాయం రాదని కానీ ఇక్కడ పండిన ధాన్యం నీటిలో తడిచి మొలకలు రావడాన్ని గుర్తించాలని అధికారులకు సూచించిన మీరు రైతు పక్షపాతిగా వ్యవహరించి నివేదికలు పంపితే నేను ముఖ్యమంత్రితో మాట్లాడి రైతులకు తగు సాయం అందేందుకు కృషి చేస్తున్నాం.. ప్రభుత్వం పెద్ద మనసు చేసుకుని రైతులకు అండగా ఉండాలి అని ఎంఎల్ఏ నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం, బుధవారం పర్యటనలలో తనను కలసి విలపిస్తున్న రైతులకు భరోసానిస్తూ ధైర్యం చెప్పి, ఓ ప్రక్కన భోరున వాన కురుస్తున్నా లెక్క చేయకుండా నేడు పలు గ్రామాలలో పంట చేలను తన క్యాడర్ తో కలసి పరిశీలించిన శాసన సభ్యుడు నల్లమిల్లి ప్రాథమిక అంచనాల ప్రకారం నాలుగు మండలాల రైతాంగానికి రూ 150 కోట్ల మేర నష్టం వాటిల్లిందని నల్లమిల్లి రామకృష్ణారెడ్డి పాత్రికేయులకు ఓ ప్రకటనలో విడుదల చేశారు.

### విద్యుత్ షాక్‌తో మృతి చెందిన

# రెండు కుటుంబాలకు మంత్రి సుభాష్ ఆర్థిక సాయం





**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** విద్యుత్ షాక్‌తో మృతి చెందిన ఇద్దరు వ్యక్తుల కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారు. ఇటీవల ద్రాక్షారామ గ్రామానికి చెందిన దొంగల భీమశంకరం (భీమన్న) కాలభైరవ స్వామి ఆలయం సమీపంలో పని చేస్తూ విద్యుత్ షాక్కు గురై మరణించారు. ఆ కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.25 వేలు ఆర్థిక సహాయం చేశారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ఈవో, సహాయ కమిషనర్ అల్లు వెంకట దుర్గా భవాని తన నెల జీతంతో పాటు, ఆలయ సిబ్బంది వ్యక్తిగతంగా సమకూర్చిన రూ.2 లక్షలు వెరసి రూ.2 లక్షల 25 వేలు మంత్రి సుభాష్ ద్వారా ఆ కుటుంబానికి అందించి మానవత్వం చాటుకున్నారు. అలాగే రామచంద్రపురం ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో బుధవారం విద్యుత్ ఘాతానికి గురై మృత్యువాత పడిన బూర్ల చైతన్య కృష్ణ కుటుంబానికి మంత్రి సుభాష్ రూ.25 వేలు అందించగా,మంత్రి సూచన మేరకు జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ రూ.10 వేలు, చందమామ వాసు మరో రూ.15 వేలు వెరసి రూ.50 వేలు మృతుని తండ్రి రాంబాబుకు అందించారు. వ్యక్తిగతంగా సహాయం చేయడంతో పాటు తన ద్వారా కూటమి పార్టీ నాయకులతో సహాయం అందించడం పట్ల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేశారు.మంత్రి సుభాష్ వెంట కూటమి పార్టీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం,జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి ఉపాధ్యక్షులు చందమామ వాసు,టేకిమూడి సత్యనారాయణ, కంచుమర్తి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

### పితృ వియోగంతో బాధపడుతున్న

# సీనియర్ జర్నలిస్ట్ మణి రాజును పరామర్శించిన జగ్గిరెడ్డి



**ఆలమూరు, విశ్వం వాయిస్ న్యూస్ :** పితృ వియోగంతో బాధపడుతున్న ఆలమూరు మండలం పెదపళ్ళ గ్రామా నికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ మూరా మణిరాజు కుటుంబ సభ్యులను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, కొత్తపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి బుధవారం ప్రమర్శించారు. తొలుత దివంగత మూరా చంటియ్య చిత్రపటానికి నివాళులర్పించారు. మూరా కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట కర్రీ నాగిరెడ్డి, వైసిపి మండల కన్వీనర్ తమ్మన శ్రీనివాస్, వైసిపి సీనియర్ నాయకులు నెక్కంటిబుజ్జి, ఏడిద మెహర్, నూకపెయ్య సూరిబాబు, మేడవరపు లక్ష్మణరావు (బాబి) గంట శ్రీనివాస్, దొడ్డారపు సుబ్బారావు, అలుగోజు శ్రీనివాసరావు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు తదితరులున్నారు.

# ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్ఫర్ స్థంభం

**మెయిన్ రోడ్‌లో పక్కకు ఒరిగిన కరెంట్ పోల్ – రద్దీగా ప్రజలు తిరిగే ప్రధాన రహదారి పక్కనే**
**–నిర్లక్ష్యం చేస్తే ప్రజా ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశం**
**– విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి**



**రామచంద్రపురం, విశ్వం వాయిస్ న్యూస్ :** రామచంద్రపురం పట్టణంలో రాజగోపాల్ సెంటర్‌లో ట్రెండ్స్ షాపింగ్ మాల్ ఎదురుగా ఆర్ఆర్ గ్రాండ్ పక్కన మెయిన్ రోడ్ కు అనుకోని ఉన్న విద్యుత్ ట్రాన్స్ఫర్ స్థంభం తుఫాన్ ప్రభావం వలన విచే గాలిగి ఒకపక్కకు ఒరిగిపోవడం జరిగింది.అయితే ఈ ట్రాన్స్ఫార్మర్ ఉన్న స్థంభం ప్రధాన మెయిన్ రోడ్ పక్కనే ఉంది.ఈ మెయిన్ రోడ్ నందు రద్దీగా ప్రజా రవాణా కొనసాగుతుండటం వలన ప్రమాదం జరిగితే ప్రజా ప్రాణాలు ప్రమాదంలో పడే అవకాశాలు చాలా తీవ్రంగానే ఉంటాయి అనే విషయంలో సందేహంమె లేదు.కాబట్టి విద్యుత్ అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించి చర్యలు చెప్పట్టాలని ప్రజలు కోరుతున్నారు.

### పంట నష్టపోయిన కౌలు, అన్నదాతలకు

# కూటమి ప్రభుత్వం అండ

### కాకినాడ రూరల్ టీడీపీ నేతలు నులుకుర్తి, డాక్టర్ చప్పిడి



**కాకినాడ రూరల్( కరప), విశ్వం వాయిస్ న్యూస్ :** మొంథా తుఫాను కారణంగా పంట నష్టపోయిన కౌలు, రైతులకు కూటమి ప్రభుత్వం అన్నివేళలా అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నాయకులు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, రాష్ట్ర శెట్టిబలి వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు భరోసా ఇచ్చారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు వారు బుధవారం కరప మండలంలోని కూరాడ, వాకాడ, యండమూరు, గొర్రిపూడి(మంత్రాలతూము) గ్రామాల్లో తుఫాను ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు, గాలివానల కారణంగా నేలకొరిగిన, నీట మునిగిన పంట పొలాలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా వారు రైతులు ఎవరూ అధైర్య పడవద్దనీ, తడిసిన ధాన్యాన్ని సైతం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని స్పష్టం చేశారు. రైతులు క్రాప్ ఇన్సూరెన్స్ చేయించుకున్న వివరాలతో ఒక నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఫోన్ చేసి కోరారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కరప మండలంలో ఖరీఫ్ సాగులో సుమారు 2850 ఎకరాల్లో వరి పంటలు పడిపోయినట్లు గుర్తించినట్లు తెలిపారు. తుఫాను కారణంగా కౌలు రైతులు ఆందోళన చెందుతున్నారని అన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు పూర్తిస్థాయిలో పంటల పరిశీలనలను క్షేత్రస్థాయిలో నిర్వహిస్తూ, నష్టపోయిన కౌలు రైతులకు అవసరమైన సహాయక చర్యలు చేపట్టేందుకు తక్షణమే చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్నదాతలు కలత చెందవద్దని, కౌలు రైతులు నష్టపోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని వారు పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు దేవు వెంకటేశ్వర్రావు (వెంకన్న), సర్వసిద్ధి ఏడుకొండలు, మేడిశెట్టి పాండురంగ, సింహాచలం, బొమ్మతి చిట్టిబాబు, మారెళ్ళ ఈశ్వరరావు, పాలిక శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

# మొంథా తుఫాన్ బాధితులను తక్షణం ఆదుకోండి


### జిల్లా జనసేన కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు



**శంఖవరం, విశ్వం వాయిస్ న్యూస్ :** గత 3 రోజుల నుండి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలు, మొంథా తుఫాన్ సృష్టించిన బీభత్సం కారణంగా వ్యవసాయ భూముల్లోని ప్రత్తి, బొప్పాయి, వరి, అరటి, దొండ వంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. కాబట్టి తమ పంటలకు ప్రభుత్వం నుంచి నష్ట పరిహారాన్ని ఇప్పించాలని కాకినాడ అగ్రికల్చర్ అసిస్టెంట్ డైరెక్టర్ పి.స్వాతిని రైతులు కోరారు. కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గం గొల్లప్రోలు మండలం దుర్గాడ గ్రామంలో ఆమె బుధవారం ఉదయం పర్యటించారు. ఈ సందర్భంగా ఆమెను గ్రామ సచివాలయం -1 కార్యాలయంలో జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు, జనసేన నాయకులు బాధిత రైతులు ఆమెను కలిసి పంట నష్టాలపై సర్వే చేసి తగు నష్టపరిహారాన్ని యిప్పించాలని కోరుతూ విజ్ఞాపన పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి జ్యోతుల శ్రీనివాసు మాట్లాడుతూ రైతులుకు పంట చేతికి వచ్చే దశలో ఈ మొంథా తుఫాన్ బీభత్సం కారణంగా పంటలను పూర్తిగా కోల్పోయారని, అదేవిధంగా దుర్గాడ గ్రామం భూములు అన్నీ నల్లరేగడి, చిత్తడి నేలలు అయినందున పంటలన్నీ పెద్ద ఎత్తున నాశనం అయ్యాయని, రైతులు బగా నష్టపోయారని శ్రీనివాస్ వివరించారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి పంట నష్టాదపై సర్వే చేయించి, తగు నష్టపరిహారానికి ప్రభుత్వానికి సిఫారసు చేయాలని స్వాతిని జ్యోతుల శ్రీనివాసు కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, జన సైనికులు, పంటలు కోల్పోయిన రైతులు, ఇతర రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారని శంఖవరం మండలం కత్తిపూడిలోని జ్యోతుల శ్రీనివాస్ కు చెందిన సాయిప్రియా సేవా సమితి ప్రధాన కార్యాలయం బుధవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపింది.

### ఏపీలో మొంథా తుఫాన్

# తెలంగాణలో భారీ వర్షాలు



బంగాళాఖాతంలో ఏర్పడిన మొంథా తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటినా, ఆ ప్రభావం కొనసాగనుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. వచ్చే 24 గంటలు ఏపీతోపాటు తెలంగాణలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరికలు జారీ చేశారు. అదేసమయంలో రానున్న ఐదు రోజులు కూడా మోస్తరు వర్షాలు కురవనున్నట్లు చెబుతున్నారు. ఏపీలోని నరసాపురం సమీపంలో తుఫాన్ తీరం దాటగా, పలు ప్రాంతాల్లో సుమారు 20 సెం.మీ. చొప్పున వర్షం కురిసింది. తెలంగాణలో నాగర్ కర్నూల్ జిల్లాలో ఉప్పునుంతలలో అత్యధికంగా 20.8 సెం.మీ. వర్షం పడింది. అదేవిధంగా అదే జిల్లాలోని అమ్రాబాద్ లో 19.7 సెం.మీ. నల్గొండ జిల్లా తెల్దేవరపల్లిలో 18.5 సెం.మీ. నాగర్ కర్నూలు జిల్లా వెల్టూరులో 18.3 సెం.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. ఇక హైదరాబాద్ నగరంతోపాటు చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ భారీ వర్షం కురిసింది. ఈ రోజు కూడా ఏపీతోపాటు తెలంగాణలోనూ భారీ వర్షాలు కురుస్తాయని చెబుతున్నారు. తెలంగాణలోని ఆదిలాబాద్, నిర్మల్, జగిత్యాల, మంచిర్యాల పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కరీంనగర్, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అతిభారీ వర్షం కురిసే అవకాశం ఉందని చెబుతున్నారు. ఈ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేశారు. కుమురం భీం, నిజామాబాద్, రాజన్న సిరసిల్ల, సిద్ధిపేట, హన్మకొండ, జనగామ, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ తోపాటు నల్గొండ, సూర్యాపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో తేలకపాటి నుంచి మోస్తరు వర్షాలు కురవనున్నాయి. మరోవైపు ఏపీలో ఈ రోజు కూడా మొంథా ఎఫెక్ట్ తో భారీ వర్షాలు కురవనున్నట్లు వాతావరణశాఖ తెలియజేసింది. రాష్ట్రంలోని 13 జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, మరో తొమ్మిది జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు, నాలుగు జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఒక ప్రకటనలో తెలియజేసింది. అదేవిధంగా వచ్చే నాలుగు రోజులు సైతం రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కొనసాగనున్నాయని తెలిపింది. అయితే రానున్న నాలుగు రోజులు సాధారణ వర్షాలు మాత్రమే కురిసే అవకాశాలు ఉన్నట్లు తెలిపింది. ఈ రోజు కోస్తాలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, ఏలూరు, కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలియజేశారు. కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్ఆర్ కడప జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయి. సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడతాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలియజేసింది. ఇక ఈ రోజు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఆకస్మిక వరదలు వచ్చే అవకాశం కూడా ఉన్నందున ప్రజలు ఇళ్లల్లో ఉండాలని సూచించింది. ఎప్పటికప్పుడు స్థానిక వాతావరణ పరిస్థితులు తెలుసుకోవాలని, ద్విచక్ర వాహనాలపై ఒంటరి ప్రయాణాలు మానుకోవాలని, లోతట్టు ప్రాంతాలకు వెళ్లకుండా ఉండాలని హెచ్చరికలు జారీ చేసింది. అదేవిధంగా వేడిచేసిన క్లోరినేషన్ చేసిన నీళ్లు మాత్రమే తాగాలని స్పష్టం చేసింది.

### మూడు గంటల్లో మూడు జిల్లాలు

# చంద్రబాబు సుడిగాలి పర్యటన



ఏపీని వణికించిన మొంథా తుఫాను విషయంలో అనుక్షణం అప్రమత్తంగా వ్యవహరించిన సీఎం చంద్రబాబు.. ఈ తుఫాను తీరం దాటిన వెంటనే ఆయన ఆయా తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన చేశారు. మూడు గంటల్లో మూడు జిల్లాలను ఆయన చుట్టి వచ్చారు. దీనికి గాను.. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ సేవల కోసం పంపించిన చేతక్ హెలికాప్టర్‌ను వినియోగించుకున్నారు. విపత్తుల సమయంలోనూ ఈ హెలికాప్టర్ చురుగ్గా పనిచేస్తుంది. అంతేకాదు.. కొంత మేరకు ప్రతికూల వాతావరణం ఉన్నా.. ఈ హెలికాప్టర్ సహకరిస్తుంది. ఈ నేపథ్యంలో సీఎం చంద్రబాబు బుధవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4 గంటల మధ్య మూడు జిల్లాల్లో సుడిగాలి పర్యటనలు చేసి.. తుఫాను మిగిల్చిన నష్టాన్ని ప్రత్యక్షంగా వీక్షించారు. సహాయక చర్యలకు కూడా ఆదేశించారు. తొలుత ఉండవల్లి నుంచి బాపట్లకు చేరుకున్న ఆయన.. దెబ్బతిన్న పంటపొలాలు, ఇళ్లు, గ్రామాలను పరిశీలించారు. అనంతరం.. కలెక్టర్ ఆఫీసులో నిర్వహించిన సమీక్షలోనూ పాల్గొన్నారు. బాధితులను ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. ఇక, అక్కడి నుంచి కృష్ణా జిల్లాకు వచ్చారు. ఇక్కడ కూడా దెబ్బతిన్న ప్రాంతాలను ఏరియల్ సర్వే ద్వారా పరిశీలించారు. అటు నుంచినేరుగా కోనసీమ జిల్లాకు వెళ్లారు.

అయితే.. ఇక్కడ ఏరియల్ సర్వే అనంతరం.. కలెక్టర్ ఆఫీసుకు వెళ్లేందుకు కాన్వాయ్ రెడీ అయినా.. కొంత ఇబ్బంది ఏర్పడింది. దీంతో ఆయన ఓ కార్యకర్తకు చెందిన ఇన్నోవా కారులో ప్రయాణించి.. బాధితులకు ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి చేరుకున్నారు. అక్కడ వారితో నేరుగా మాట్లాడారు. బాధలు సమస్యలు తెలుసుకున్నారు. ముఖ్యంగా మత్స్యకారుల సమస్యలు విన్నారు. వారి కుటుంబాలకు భరోసా కల్పించారు. ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని వారికి హామీ ఇచ్చారు. ఇలా.. మూడు గంటల్లో ఏరియల్ సర్వేతో పాటు.. కలెక్టర్ల కార్యాలయాల్లో సమీక్షలు.. చేయడం పునరావాస కేంద్రాల్లో ని బాధితులకు ఓదార్పు ఇవ్వడం గమనార్హం.

**సీఎం ప్రకటించిన సాయం ఇదే..**

పునరావాస కేంద్రాల్లోని బాధితులకు రూ.1000 నుంచి రూ.3000 వరకు గరిష్ఠంగా సాయం.

ప్రతి కుటుంబానికీ 25 కిలోల బియ్యం, గోధుమలు 3 కిలోలు.. నిత్యావసరాలు పంపిణీ.

దెబ్బతిన్న రహదారులను 48 గంటల్లో పునరుద్ధరించడం.

పంటల నష్టం అంచనాకు మూడు రోజుల సమయం

వెంటనే కేంద్రానికి లేఖ.. సాయం రాగానే.. రైతులకు అందజేత.

# తాడేపల్లిలో జగన్.. బెంగళూరు నుంచి ఎలా వచ్చారంటే..?



మాజీ సీఎం, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహనరెడ్డి తాడేపల్లిలోని తన నివాసానికి చేరుకున్నారు. గత వారం తాడేపల్లి నుంచి బెంగళూరులోని యలహంకలో నివాసానికి వెళ్లిన జగన్ మంగళవారం తిరిగి రావాల్సివుంది. అయితే మొంథా తుఫాన్ కారణంగా మాజీ సీఎం జగన్ పర్యటన రద్దు చేసుకున్నారు. మంగళవారం తుఫాన్ తీవ్రత దృష్ట్యా గన్నవరం నుంచి విశాఖ, హైదరాబాద్, బెంగళూరు విమాన సర్వీసులను రద్దు చేశారు. ఈ నేపథ్యంలో జగన్ పర్యటన వాయిదా వేశారు. అయితే బుధవారం తుఫాన్ ప్రభావం తగ్గడంతో విమాన సర్వీసులు పునరుద్ధరించారు. దీంతో బెంగళూరులో ఉండిపోయిన మాజీ సీఎం ఈ రోజు మధ్యాహ్నం గన్నవరం చేరుకున్నారు. మధ్యాహ్నం 1 గంట సమయంలో జగన్ గన్నవరం విమానాశ్రయానికి చేరుకున్నారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో తాడేపల్లికి బయలుదేరి వెళ్లారు. విమానాశ్రయంలో వైసీపీ అధినేతకు పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికారు. ఎన్టీఆర్ జిల్లా పార్టీ అధ్యక్షుడు దేవినేని అవినాశ్, పార్టీ సీనియర్ నేత పోతుల మహేశ్ తోపాటు వందల మంది కార్యకర్తలు జగన్ ను కలిశారు. ఇక తాడేపల్లి చేరుకున్న మాజీ సీఎం జగన్ మొంథా తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించే అవకాశం ఉందని చెబుతున్నారు. అయితే ఆయన ఎక్కడకు వెళ్లేది? ఎప్పుడు వెళ్లేది ఇంకా ఖరారు కాలేదు. మంగళవారం అర్ధరాత్రి తీరం దాటిన తుఫాను ప్రభావం తగ్గింది. అయితే ఈ రోజు కూడా భారీ వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ శాఖ ఇప్పటికే ప్రకటించింది. రేపటి నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది. అయినప్పటికీ రేపు లేదా ఎల్లుండి జగన్ పర్యటన ఉంటుందని వైసీపీ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తుఫాన్ ప్రభావంతో ఉత్తరాంధ్రతోపాటు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల్లో పలు ప్రాంతాలు దెబ్బతిన్నాయి. పంటలు నేలకొరిగాయి. వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వేల మందిని ప్రభుత్వం పునరావాస కేంద్రాలకు తరలించింది. అయితే పునరావాస కేంద్రాల్లో తగిన సౌకర్యాలు కల్పించలేదని వైసీపీ నేతలు విమర్శలు చేస్తున్నారు. తమ హయాంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బందితోపాటు ప్రభుత్వ అధికారులు అందుబాటులో ఉంటూ తక్షణ సహాయ చర్యలు చేశారని, కానీ ఇప్పుడు ప్రభుత్వం ప్రేక్షక పాత్ర మాత్రమే వహిస్తోందని వైసీపీ సోషల్ మీడియాలో ఆరోపణలు చేస్తోంది.

# సముద్రుడి ఉగ్ర రూపం... మొంథాని మరిపించేలా..!



మొంథా తుఫాన్ ఎట్టకేలకు ఏపీలో తీరాన్ని దాటింది. అంతర్వేదిపాలెం వద్ద అది కాస్తా మంగళవారం రాత్రి ప్రవేశించి అర్ధరాత్రి దాటిన తరువాత పూర్తిగా ల్యాండ్ అయింది. ఇక అనంతరం మొంథా తుఫాన్ బలహీనపడిపోయింది. అయితే గత కొన్ని రోజులుగా సముద్రంలో ఉంటూ నానా విధాలుగా ఏపీని ఇబ్బంది పెట్టిన మొంథా తుఫాన్ తీవ్ర అల్ప పీడనంగా రూపాంతరం చెందినా సముద్రం మాత్రం ఇంకా శాంతించలేదు. ఏపీలో చాలా చోట్ల చూస్తే సముద్రం ముందుకు దూసుకుని వచ్చింది. తీరాన్ని భారీగా కోసేసింది. దీంతో సాగరుడి ఉగ్ర రూపం చూసి తీర ప్రాంత ప్రజలు భీతిల్లుతున్నారు

**ఎందుకిలా అంటే :** సముద్రంలోనే అనేక పీడనాలు ఉంటాయి. అక్కడే మూల కేంద్రం. అందులో ఒకటి మరింతగా బలపడి ఒక తుఫానుగా అవతారం ఎత్తుతుంది. దాని ప్రభావం నాలుగైదు రోజులు ఉంటుంది. అది కాస్తా తీరం దాటి తిరిగి మెల్లగా సముద్రంలోకే వెళ్తుంది. అంటే ఈ అలజడి సముద్రంలోనే అలాగే ఉంటుంది అన్న మాట. తీరం చేరినపుడు తిరిగి సముద్రంలోకి వెళ్ళినపుడు కూడా సముద్రం తీవ్ర ఆటుపోట్లకు గురి అవుతుంది. అదే సమయంలో ఈదురు గాలులు బలంగా వీస్తాయి. మరో వైపు ఈ గాలి వేగానికి అలజడులకు సముద్రం అతలాకుతలం అయి కెరటాలు పెద్ద ఎత్తున ఎగిసిపడతాయి దాంతో పాటు వెనక ఉన్న నీళ్ళన్నీ ముందుకు తోసుకుని వస్తాయి. ఆ జోరులో సముద్రం రెండు అంగలు ముందుకు వేసి తీరాన్ని మరింతగా చొచ్చుకుని వచ్చినట్లుగా కనిపిస్తుంది. తుఫాన్ అనంతరం సముద్రం సాధారణ స్థితికి చేరుకోవడానికి కనీసం రెండు రోజులు పడుతుందని ఒక అంచనా ఉంది.

**శ్రీకాకుళం నుంచి :** ఏపీకి పొడవైన తీర ప్రాంతం ఉంది. శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా తడ వరకూ తీరం అంతా ఒకే రేఖ మీద సాగుతుంది. ఇపుడు చూస్తే మొంథా తుఫాన్ తరువాత మొత్తం తొమ్మిది ఉమ్మడి జిల్లాలోని తీర ప్రాంతంలో సముద్రం ఒక్కసారిగా కొన్ని అడుగులు ముందుకు జరిగి తీరాన్ని భారీగా తాకుతోంది. దాంతో సముద్రం ముందుకు వచ్చింది అని స్థానిక జనాలు భయపడుతున్నారు. శ్రీకాకుళం జిల్లాలో డొంకూరు నుంచి ఉమ్మడి నెల్లూరు జిల్లా తడ వరకూ ఇదే విధంగా సముద్రం ముందుకు వచ్చి తీరాన్ని వణికించేస్తోంది. బుధవారం ఈ రకమైన పరిస్థితిని చూసి స్థానికంగా నివాసం ఉంటున్న మత్స్యకార కుటుంబాలు తీవ్రంగా భయపడుతున్నారు.

**పూజలు చేస్తూ :** తుఫాన్ ఎపుడు వచ్చినా సముద్రం అల్లకల్లోలంగానే ఉంటుంది. అయితే అదే సాగరం మీద జీవనం సాగిస్తూ దాని మీదనే ఆరుగాలం ఆధారపడిన మత్స్యకార కుటుంబాలకు ఇవన్నీ తెలుసు అందుకే సముద్రం ఆగ్రహంగా ఉందని గ్రహించి శాంతించమంటూ పూజలు చేస్తున్నారు. మత్స్యకార మహిళలు పూజలు చేస్తూ ప్రశాంతంగా ఉండాలని కోరుకుంటున్నారు. కాకినాడ తీరంలో చూసినా ఇదే రకమైన పరిస్థితి కనిపిస్తోంది. ఇక్కడ తాళ్ళరేవు వద్ద సముద్రం బీభత్సంగా మారింది. తీరాన్ని పూర్తిగా తవ్వేస్తూ మొత్తం అన్ని కోస్తా జిల్లాలలో సముద్రం చేస్తున్న అలజడికి జనాలు ఉలిక్కిపడుతున్నారు. అయితే ఇదంతా మరి కొన్ని గంటల వరకూ ఉంటుందని ఆ మీదట మెల్లగా పరిస్థితిలో మార్పు కనిపిస్తుందని అధికారులు చెబుతున్నారు. అయితే ఎవరూ సముద్రం వైపు వెళ్ళవద్దని బీచ్ లకు అసలు పోవద్దని సూచిస్తున్నారు యధాతథంగా వాతావరణం వచ్చేంతవరకూ తగిన జాగ్రత్తలో ప్రజలు ఉండాలని, మత్స్యకారులు అయితే నవంబర్ నెల వచ్చేంతరవకూ ఇళ్ళ వద్దనే ఉండాలని కోరుతున్నారు.

# తనయుల కోసం సోనియా, లాలూ ఆరాటం

అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గరపడుతుండటంతో బీహార్ రాష్ట్రంలో రాజకీయాలు వేడెక్కాయి. ప్రధాన పార్టీలు గెలుపే లక్ష్యంగా ప్రచారాన్ని ముమ్మరం చేశాయి. ఈ క్రమంలో పార్టీల నేతలు ఒకరిపై ఒకరు తీవ్ర విమర్శలు చేసుకుంటున్నారు. ఇక ప్రతిపక్ష కూటమి మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థిగా తేజస్వీయాదవ్ పేరును ప్రకటించిన విషయం తెలిసిందే. అయితే, ఎన్డీయే కూటమి మాత్రం ఇప్పటి వరకూ సీఎం అభ్యర్థిని ప్రకటించలేదు. దీంతో ఎన్డీయే కూటమి సీఎం అభ్యర్థి ఎవరన్నదానిపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. దీనిపై ప్రతిపక్ష కూటమి పార్టీల నేతలు బీజేపీ, జేడీయూ లక్ష్యంగా విమర్శలకు ఎక్కుపెట్టాయి. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష పార్టీల విమర్శలకు కేంద్ర హోం మంత్రి అమిత్‌షా కౌంటర్ ఇచ్చారు. బీహార్‌లో దర్భంగాలో బుధవారం జరిగిన ర్యాలీలో అమిత్ షా కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఏ సీటూ ఖాళీగా లేదని వ్యాఖ్యానించారు. కేంద్రంలో ప్రధానిగా నరేంద్రమోదీ ఉంటారన్నారు. బీహార్ ముఖ్యమంత్రిగా నీతీశ్ కుమార్ కొనసాగుతారని స్పష్టం చేశారు. బీహార్ ఎన్నికలు రెండు విడతల్లో జరగనున్న విషయం తెలిసిందే. నవంబర్ 6న తొలి విడత, నవంబర్ 11న రెండో విడత ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది.



**లాలూయాదవ్, రాహుల్‌గాంధీ అక్రమార్కులకు రక్షకులు**

ఆర్జేడీ అధ్యక్షుడు లాలూ ప్రసాద్ యాదవ్ కాంగ్రెస్ పార్టీ అగ్ర నాయకుడు రాహుల్‌గాంధీ అక్రమార్కులకు రక్షకులుగా ఉంటున్నారని కేంద్ర హోంమంత్రి అమిత్ షా విమర్శించారు. ఓటర్ల జాబితాలో అక్రమంగా చేరినవాళ్లను తొలగించవద్దని వారు డిమాండ్ చేస్తున్నారని మండిపడ్డారు. బెగుసరాయ్‌లో జరిగిన ఎన్నికల ప్రచార సభలో అమిత్ షా ప్రసంగించారు. దేశంలో అక్రమంగా చొరబడి ఓటర్ల జాబితాల్లో పేర్లు నమోదు చేసుకున్నవారిని తొలగించాలా.. వద్దా..? అని ఓటర్లను ఉద్దేశించి షా ప్రశ్నించారు. యావత్ బీహార్‌ను ఇస్లామిక్ రాష్ట్రంగా మార్చాలనే లక్ష్యంతో ఇక్కడ పీపుల్స్ ఫ్రంట్ ఆఫ్ ఇండియా పురుడుపోసుకుందని షా ఆరోపించారు. కానీ ప్రధాని నరేంద్రమోదీ దేశవ్యాప్తంగా 100 ప్రదేశాల్లో సోదాలు చేయించి పీఎఫ్ఐ సభ్యులను అరెస్ట్ చేయించారని, అందరినీ జైల్లో పెట్టించారని అమిత్ షా తెలిపారు. మీరంతా ఆ పీఎఫ్ఐ సభ్యులను వదిలిపెట్టాలని కోరుకుంటున్నారా..? అని ఓటర్లను ప్రశ్నించారు. పీఎఫ్ఐ అనేది జాతి వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే సంస్థ అని, అందుకే ప్రధాని మోదీ ఆ సంస్థపై నిషేధం విధించారని తెలిపారు. కానీ ఇప్పుడు లాలూ ప్రసాద్ యాదవ్ పీఎఫ్ఐ సభ్యులను పగటి కలల్లో విహరింప జేస్తున్నారని, తాము అధికారంలోకి రాగానే మిమ్మల్ని జైళ్ల నుంచి విడుదల చేస్తామని వారికి హామీ ఇచ్చారని అమిత్ షా ఆరోపించారు. కానీ ప్రధాని మోదీ మాత్రం భారత భూభాగంపైన ఉగ్రవాదాన్ని, నక్సలిజాన్ని తుడిచిపెట్టే పనిలో ఉన్నారని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి 31 కల్లా దేశంలో నక్సలిజం అంతం కాబోతోందని అన్నారు.

# అల్యూమినియం ఉత్పత్తిలో ఏఐ ఆధారిత మెషిన్ హియరింగ్, విజన్ టెక్నాలజీలను పరిచయం చేసిన రుసల్

విజయవాడ


ప్రపంచంలోని అతిపెద్ద అల్యూమినియం ఉత్పత్తిదారులలో ఒకటైన రుసల్, దాని ఉత్పత్తి ప్రక్రియలలో సామర్థ్యాన్ని పెంచడం, ఉత్పత్తి నాణ్యతను మెరుగుపరచడం వంటి రెండు ముఖ్యమైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీలను ప్రవేశపెట్టింది. ప్రపంచ కార్యకలాపాలతో రష్యా ప్రధాన కార్యాలయం కలిగిన ఈ కంపెనీ వరుసగా అల్యూమినా ఉత్పత్తి, అల్యూమినియం మెల్ట్ తయారీని మెరుగుపరచడానికి మెషిన్ హియరింగ్, మెషిన్ విజన్ టెక్నాలజీలను అమలు చేసింది. మిల్లు కార్యకలాపాల నుండి వచ్చే శబ్ద కంపనాలను విశ్లేషించడానికి గణిత అల్గారిథమ్‌లను ఉపయోగించే మెషిన్ హియరింగ్ టెక్నాలజీని కంపెనీ అమలు చేసింది, బాక్సైట్ ధాతువు లోడింగ్ యొక్క ఆప్టిమైజేషన్‌ను అనుమతిస్తుంది.. పరికరాల దుస్తులు ధరిస్తుంది. శక్తి వినియోగాన్ని తగ్గిస్తుంది. అసంబద్ధమైన శబ్దాన్ని విస్మరిస్తూ ధ్వని నమూనాలు, మిల్లు లోడింగ్ మధ్య ఖచ్చితమైన సంబంధాన్ని గుర్తించడానికి అల్గోరిథం శిక్షణ పొందింది. శక్తి సామర్థ్యం, గ్రైండింగ్ నాణ్యత, పరికరాల భద్రతకు సరైన మిల్లు లోడింగ్‌ను నిర్వహించడం చాలా ముఖ్యం. మిల్లులో అండర్‌లోడ్ చేయడం వల్ల విద్యుత్ వృధా అవుతుంది. గ్రైండింగ్ బంతులు ధాతువుకు బదులుగా మిల్లు లైనింగ్‌ను తాకుతాయి, ఫలితంగా దుస్తులు ధరిస్తాయి. మరోవైపు, ఓవర్‌లోడింగ్ ముతక, తక్కువ నాణ్యత గల గ్రైండింగ్‌ను ఉత్పత్తి చేస్తుంది, ఇది తదుపరి లీచింగ్ ప్రక్రియ సామర్థ్యాన్ని తగ్గిస్తుంది. అల్యూమినా దిగుబడిని తగ్గిస్తుంది. దీర్ఘకాలిక ఓవర్‌లోడ్ మిల్లు మరమ్మతుల ఫ్రీక్వెన్సీని కూడా పెంచుతుంది. మిశ్రమ లోహ ఉత్పత్తిలో, 20 వరుస కార్యకలాపాలను కలిగి ఉన్న అల్యూమినియం మెల్ట్ తయారీ యొక్క సంక్లిష్ట ప్రక్రియను పర్యవేక్షించడానికి రుసల్ ఏఐని వర్తింపజేస్తోంది. యంత్ర దృష్టిని ఉపయోగించి కరిగే తయారీని పర్యవేక్షించడానికి ప్రత్యేకంగా శిక్షణ పొందిన న్యూరల్ నెట్‌వర్క్‌ను కలిగి ఉన్న వ్యవస్థను రుసల్ అభివృద్ధి చేసింది. ఈ సాంకేతికత ఆపరేటర్‌కు అవసరమైన మిశ్రమ రసాయన శాస్త్రాన్ని సాధించడానికి, తక్కువ-నాణ్యత గల లోహాన్ని ఉత్పత్తి చేసే ప్రమాదాన్ని తగ్గించడానికి సహాయపడుతుంది. “యంత్ర దృష్టిని ఉపయోగించి పనిచేసే ఈ వ్యవస్థ, మానవ తప్పిదాల ప్రభావాన్ని తగ్గిస్తుంది ఎందుకంటే ఇది మిశ్రమ లోహ తయారీ సమయంలో కీలకమైన క్షణాలను కోల్పోకుండా ఆపరేటర్‌కు సహాయపడుతుంది. దాని శుభ్రపరిచే సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి వేడి కరిగే ఉపరితలంపై చెత్త ప్రాంతాలను బాగా గుర్తిస్తుంది.” అని రుసల్ ఇంజనీరింగ్, టెక్నాలజీ సెంటర్‌లోని ప్రొడక్షన్ ఆటోమేషన్ డైరెక్టర్ మిఖాయిల్ గ్రినిషిన్ అన్నారు.

# కోట్లు కుమ్మరించారు.. ఢిల్లీలో వర్షం కురవలేదు

**ఢిల్లీ:** ఢిల్లీలో క్లౌడ్ సీడింగ్‌కు బ్రేక్ పడింది. కాలుష్య రాజధానిగా మారిన ఢిల్లీలో వాయు కాలుష్య భూతాన్ని తరిమి కొట్టాలని రేఖా గుప్తా సారథ్యంలోని ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన క్లౌడ్ సీడింగ్ ఫెయిల్ అయ్యింది. మేఘాలను చల్లబరిచి వర్షింపజేసే రసాయనాలను చల్లే విమానాలను రంగంలోకి దింపింది. ఐఐటీ-కాన్పూర్ సహకారం, సమన్వయంతో నిన్న (అక్టోబర్ 28, మంగళవారం) రాజధానిలో మేఘావృత గగనతలంలో మేఘమథన క్రతువుకు శ్రీకారం చుట్టింది. మరికొన్ని రోజుల పాటు ఈ విమానాలు రసాయనాలను వెదజల్లే ప్రక్రియ కొనసాగుతుందని కూడా ప్రభుత్వం వెల్లడించింది. అయితే, మేఘాల్లో తగినంత తేమ లేకపోవడంతో వర్షం కురవలేదు. దీంతో ఈ ప్రక్రియను రాష్ట ప్రభుత్వం నిలిపివేసింది. ఢిల్లీలో కాలుష్య నియంత్రణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రయత్నాలు సాగిస్తోంది. వర్షించని మేఘాల నుంచి చినుకులు కురిసేలా చేసే ఈ ప్రక్రియను సాధారణంగా క్లౌడ్-సీడింగ్ అంటారు. ఇందుకోసం ప్రభుత్వం సుమారు రూ.3.21 కోట్లు కేటాయించింది. అయితే, ఇది వాయు కాలుష్యానికి తాత్కాలిక ఉపశమనంగా పనిచేస్తుందని, ఖరీదైన ఈ ప్రక్రియను శాశ్వత పరిష్కారంగా భావించకూడదని పలువురు పర్యావరణవేత్తలు అంటున్నారు. ఐఐటీ కాన్పూర్ డైరెక్టర్ మనీంద్ర అగర్వాల్ ఇవాళ(బుధవారం) మీడియాతో మాట్లాడుతూ.. క్లౌడ్ సీడింగ్ ప్రయోగం ద్వారా కృత్రిమ వర్షం రాలేదు కానీ భవిష్యత్తు ప్రయత్నాలకు ముఖ్యమైన సమాచారం లభించిందని తెలిపారు. ఢిల్లీలో ఏర్పాటు చేసిన 15 మానిటరింగ్ స్టేషన్ల ద్వారా సేకరించిన



డేటా ప్రకారం, %పీఎం 2.5,ాపీ% 10 మలినాల స్థాయిల్లో 6%-%10 శాతం తగ్గుదల కనిపించిందని ఆయన చెప్పారు. కాగా, ఢిల్లీ స్థానిక ప్రాంతాలను కృత్రిమ వర్షాలతో తడిసి ముద్దచేసేందుకు ప్రత్యేక విమానాలు మంగళవారం(అక్టోబర్ 28) కాన్పూర్ నుంచి బయల్దేరాయి. ఢిల్లీలోని బురారీ, నార్త్ కరోల్ బాగ్, మయూర్ విహార్ వంటి ప్రాంతాల మీది మేఘాలపై ఈ విమానాలు సిల్వర్ అయోడైడ్, సోడియం క్లోరైడ్ మిశ్రమాలను చల్లాయి. దాదాపు 20 శాతం తేమ ఉన్న మేఘాలను కృత్రిమ వర్షాల కోసం ఎంపిక చేశారు. సెస్నా రకం విమానం ఒక్కోటి 2%-%2.5 కేజీల బరువైన రసాయన మిశ్రమాన్ని వేర్వేరు చోట్ల వెదజల్లింది. దాదాపు 8 ప్రాంతాల్లో క్లౌడ్%-%సీడింగ్‌ను చేపట్టారు.



## ప్రైవేటు బస్సులో రూ.కోటి సీజ్

**బెంగళూరు:** గోవా నుంచి బెంగళూరుకు అక్రమంగా ప్రైవేట్ బస్సులో కోటి రూపాయలను తరలిస్తుండగా ఉత్తర కన్నడ జిల్లా కారవార%-%గోవా సరిహద్దులోని మజాళి చెక్‌పోస్ట్‌లో పోలీసులు పట్టుకున్నారు. చెక్‌పోస్టులో పోలీసులు తనిఖీలు చేయగా గోనె సంచిలో దాచిన నోట్ల కట్టలు లభించాయి. బెంగళూరుకు చెందిన కల్లేశ, రాజస్థాన్‌కు చెందిన బమరరామ్‌లు ఈ డబ్బు తరలిస్తున్నారు. పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. కల్లేశ, బరమరామ్‌లు గోవాలో ఓ వ్యక్తి నుంచి నగదు తీసుకొని బెంగళూరుకు తీసుకెళుతున్నట్లు చెప్పారు. చిత్తాకుల పోలీసులు నగదు స్వాధీనం చేసుకోని కేసు నమోదు చేశారు.

## రఫేల్‌లో రాష్ట్రపతి గగన విహారం



అంబాలా

రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము శత్రు భీకర రఫేల్ యుద్ధ విమానంలో బుధవారం గగన విహారం చేశారు. హరియాణాలోని అంబాలాలో ఉన్న భారత వాయుసేన (ఐఏఎఫ్) స్థావరం నుంచి ఈ యుద్ధ విమానంలో నింగిలోకి దూసుకెళ్లిన ఆమె.. దాదాపు 30 నిమిషాల్లో 200 కిలోమీటర్ల మేర దూరం ప్రయాణించారు. దీంతో- వాయుసేనకు చెందిన రెండు వేర్వేరు యుద్ధ విమానాల్లో ప్రయాణించిన తొలి రాష్ట్రపతిగా ముర్ము చరిత్ర సృష్టించారు. 2023 ఏప్రిల్‌లో ఆమె అస్సాంలోని తేజ్‌పూర్ నుంచి సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానంలో గగన విహారం చేసిన సంగతి గమనార్హం. 2006 జూన్‌లో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం, 2009 నవంబరులో అప్పటి దేశ ప్రథమ పౌరురాలు ప్రతిభాపాటిల్ సుఖోయ్ 30 ఎంకేఐ యుద్ధ విమానాల్లో ప్రయాణించారు.

**జీ సూట్‌లో.. సన్‌గ్లాసెస్‌తో..**

త్రివిధ దళాల సుప్రీం కమాండర్ అయిన ముర్ము.. రఫేల్‌లో విహరించడానికి ముందు అంబాలాలో గౌరవ వందనం స్వీకరించారు. జీ సూట్‌లో, సన్‌గ్లాసెస్ ధరించి, చేతిలో హెల్మెట్ పట్టుకుని పైలట్‌తో ఫొటోలు దిగారు. మన దేశంలో రఫేల్ యుద్ధ విమాన తొలి మహిళా పైలట్‌గా ఖ్యాతికెక్కిన స్క్వాడ్రన్ లీడర్ శివాంగీ సింగ్ కూడా రాష్ట్రపతితో ఫొటోలకు పోజిచ్చారు. ముర్ము ప్రయాణించిన యుద్ధ విమానాన్ని గ్రూప్ కెప్టెన్ అమిత్ గెహానీ నడిపారు. ఉదయం 11:27 నిమిషాలకు అది టేకాఫ్ అయింది. ప్రయాణంలో సముద్ర మట్టం నుంచి 15 వేల అడుగుల ఎత్తు వరకు చేరుకుంది. దాదాపు గంటకు 700 కిలోమీటర్ల గరిష్ఠ వేగంతో దూసుకెళ్లింది. రఫేల్‌లో రాష్ట్రపతి విహారాన్ని స్వయంగా పర్యవేక్షించిన ఎయిర్ చీఫ్ మార్షల్ ఎ.పి.సింగ్ అంబాలా స్థావరం నుంచే మరో విమానంలో ప్రయాణించారు. రఫేల్‌లో ప్రయాణంపై రాష్ట్రపతి స్పందిస్తూ.. ఇది తనకు మరువలేని అనుభూతి అని పేర్కొన్నారు. దేశ రక్షణ సామర్థ్యాలపై తన విశ్వాసాన్ని ఈ విహారం మరింతగా ఇనుమడింపజేసిందన్నారు. సందర్శకుల పుస్తకంలో ఈ మేరకు సందేశంతో తన ఆనందాన్ని పంచుకున్నారు. ఈ ఏడాది మేలో ఆపరేషన్ సిందూర్‌లో భాగంగా.. పాక్‌లోని ఉగ్రవాద శిబిరాలపై రఫేల్ జెట్లతో భారత్ దాడులు జరిపింది. ఈ యుద్ధ విమానంలో ప్రస్తుతం రాష్ట్రపతి గగన విహారం చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది.

## ఓట్ల కోసం మోదీ దేనికైనా రెడీ



ముజఫ్ఫర్‌పుర్/ దర్భంగా

ఓట్ల కోసం ప్రధాని మోదీ ఏం చేయడానికైనా వెనకాడబోరని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ ధ్వజమెత్తారు. బుధవారం బిహార్‌లో శాసనసభ ఎన్నికల ప్రచారాన్ని ఆయన ప్రారంభించారు. ఇండియా కూటమి ముఖ్యమంత్రి అభ్యర్థి, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్‌తో కలిసి ముజఫ్ఫర్‌పుర్, దర్భంగా జిల్లాల్లో సభలను ఉద్దేశించి ప్రసంగించారు. “ఛఠ్ పూజ నిర్వహించేందుకు మోదీ యమునా నదీ స్నానానికి వెళ్తున్నారంటూ జరిగిన డ్రామాను చూసే ఉంటారు. పూర్తిగా కలుషితమైన యమునా నదిలో ఆయన స్నానం ఆచరించడానికి శుద్ధ జలాలతో ప్రత్యేక ఏర్పాటు చేశారన్న విషయం బయటకు రావడంతో ఆ కార్యక్రమాన్ని రద్దు చేసుకున్నారు. ఎలాంటి డ్రామాకైనా ఆయన సిద్ధమే. నృత్యం చేస్తే మీకే ఓటేస్తామని చెప్పండి.. మోదీ వెంటనే భరతనాట్యం చేసి చూపుతారు” అని రాహుల్ ఎద్దేవా చేశారు. తేజస్వీ యాదవ్ నేతృత్వంలో కొత్త ప్రభుత్వం ఈసారి బిహార్‌లో ఏర్పాటు కాబోతోందని రాహుల్ జోస్యం చెప్పారు. “మీరు (మోదీ) ధరించే దుస్తులపై మేడిన్ చైనా అనే లేబుల్ ఉంటుంది. మేడిన్ బిహార్ అనే లేబుల్ ఉన్న దుస్తులు మీరు ధరిస్తే చూడాలనుకుంటున్నాను. పాక్ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చెబుతున్నది అబద్ధమైతే ఆ విషయాన్ని ఆయనకు చెప్పే ధైర్యం మోదీకి లేదు. ప్రధాని ఎలా ఉండాలో మా నానమ్మ ఇందిరాగాంధీని చూసి తెలుసుకోండి” అని సూచించారు. మహాగఠ్‌బంధన్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని తేజస్వి హామీ ఇచ్చారు.

## రజనీ రిటైర్మెంట్!

చెన్నై

74 ఏళ్ళ వయస్సు లో కూడా స్టార్ హీరోలతో సరిసమానంగా బాక్స్ ఆఫీస్ రికార్డ్స్ ని పాన్ ఇండియా లెవెల్ లో బద్దలు కొడుతూ ముందుకు దూసుకెళుతున్న ఏకైక సూపర్ స్టార్ రజినీకాంత్ మాత్రమే. ఇండియా లో ఎంతో మంది సూపర్ స్టార్స్ రావొచ్చు, వెళ్లొచ్చు, కానీ రజినీకాంత్ లాంటి సూపర్ స్టార్ ని భవిష్యత్తులో మరొకరిని చూడలేము. అలాంటి హిస్టరీ ని క్రియేట్ చేసిన రజినీకాంత్ ఫిల్మోగ్రఫీ కి త్వరలోనే ఎండ్ కార్డు పడబోతుందా అంటే అవుననే అంటున్నాయి కోలీవుడ్ వర్గాలు. ప్రస్తుతం చేతిలో ఉన్న సినిమాలను పూర్తి చేసి, శాశ్వతంగా సినీ కెరీర్ నుండి తప్పుకొని, హిమాలయాల్లో శేష జీవితాన్ని గడపాలని రజినీకాంత్ నిర్ణయం తీసుకున్నట్టు కోలీవుడ్ వర్గాల్లో జోరుగా ఒక ప్రచారం జరుగుతుంది. ఈ ఏడాది రజినీకాంత్ నుండి ‘కూలీ’ అనే చిత్రం విడుదలైందిఈ సినిమాకు డివైడ్ టాక్ వచ్చినప్పటికీ కూడా 520 కోట్ల రూపాయలకు పైగా గ్రాస్ వసూళ్లను రాబట్టింది. ఈ చిత్రం తర్వాత ఆయన ‘జైలర్ 2’ చేస్తున్నాడు. శరవేగంగా షూటింగ్ కార్యక్రమాలను జరుపుకుంటున్న ఈ చిత్రం కోసం ఇండియా మొత్తం ఎదురు చూస్తోంది. ఈ సినిమా పూర్తి అయ్యాక, కమల్ హాసన్ తో కలిసి ఆయన ఒక మల్టీస్టారర్ చిత్రం చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసాడు. కథ సిద్ధమైంది,కానీ దర్శకుడు ఎవరు అనే విషయం లో నిన్న మొన్నటి వరకు చిన్నపాటి అయోమయ్యం ఉండేది. మొదట్లో ఈ చిత్రాన్ని లోకేష్ కనకరాజ్ తెరకెక్కిస్తాడని అనుకున్నారు, కానీ ఆయన అందుకు అంగీకరించలేదు. ఆ తర్వాత డ్యూడ్ మూవీ హీరో ప్రదీప్ రంగనాథన్ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తాడనే ప్రచారం జరిగింది. దీనికి ప్రదీప్ స్పందిస్తూ తన ఫోకస్ మొత్తం ఇప్పుడు నటన పైనే ఉంది, దర్శకత్వం వహించే ఛాన్స్ లేదని తేల్చి చెప్పాడు.

బిజినెస్ వాయిస్

## పండుగ సీజన్‌లో క్రెడిట్ కార్డులదే హవా




దేశవ్యాప్తంగా ఈ ఏడాది పండుగ సీజన్‌కు కొనుగోళ్లలో రికార్డులు నమోదయ్యాయి. ముఖ్యంగా దీపావళి సందర్భంగా చాలామంది క్రెడిట్ కార్డు కస్టమర్లు ఎక్కువ కొనుగోళ్లు జరిపారని ప్రముఖ డిజిటల్ మార్కెట్‌ప్లేస్ పైసాబజార్ సర్వేలో తేలింది. ముఖ్యంగా ఈ-కామర్స్ కంపెనీలు అందించిన సేల్స్, ఆఫర్ల కారణంగా 42 శాతం క్రెడిట్ కార్డు కస్టమర్లు రూ. 50,000కు పైగా ఖర్చు చేశారు. మరో 22 శాతం మంది రూ. 50,000 నుంచి రూ. లక్ష వరకు కొనుగోళ్లు నిర్వహించారని సర్వేలో తెలిపింది. ఈ కొనుగోళ్లలో క్రెడిట్ కార్డు ఆఫర్ల అత్యధికంగా ఉన్నాయి. 91 శాతం మంది క్రెడిట్ కార్డు ఆఫర్‌ల చుట్టూ జరిగాయి. 10 శాతం కంటే తక్కువ మంది మాత్రమే డిస్కౌంట్‌లు లేదా క్యాష్‌బ్యాక్ కోసం చూడకుండా షాపింగ్ చేశామని చెప్పారు. 13 శాతం మంది క్రెడిట్ కార్డు నుంచి రూ. 10,000 కంటే తక్కువ షాపింగ్ చేశారు. 21 శాతం మంది రూ. 10-25 వేలు, 24 శాతం మంది రూ. 25-50 వేలు, 22 శాతం మంది రూ. 50 వేల నుంచి రూ. లక్ష మధ్య షాపింగ్ చేశారు. రూ. లక్ష కంటే ఎక్కువ షాపింగ్ క్రెడిట్ కార్డు ద్వారా చేసినవారు 20 శాతం మంది ఉన్నారు. వీరిలో అత్యధికంగా గృహోపకరణాలు (25 శాతం), మొబైల్స్, గాడ్జెట్‌లు, ఇతర ఉత్పత్తులు (23 శాతం), దుస్తులు (22 శాతం) కొనేందుకు క్రెడిట్ కార్డును ఉపయోగించారు.

## టాటా గ్రూపులో ట్రస్టీగా మెహ్లి మిస్త్రీ పునఃనియామకానికి లభించని ఆమోదం




దివంగత రతన్ టాటా సన్నిహితుడు, వ్యాపారవేత్త మెహ్లి మిస్త్రీని టాటా ట్రస్టుల్లో ఎదురుదెబ్బ తగిలింది. టాటా ట్రస్టుల చైర్మన్ నోయెల్ టాటా, ఆయనకు సన్నిహితులుగా భావిస్తున్న మరో ఇద్దరు ట్రస్టీలు, ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ పునఃనియామకాన్ని అడ్డుకున్నారు. ఈ పరిణామంతో టాటా గ్రూప్ హోల్డింగ్ కంపెనీని నియంత్రించే దాతృత్వ విభాగంలో విభేదాలను మరింత పెంచిందని సంస్థ వర్గాలు చెబుతున్నాయి. టాటా గ్రూప్‌లో అంతర్గత విభేదాలున్నాయనే ఊహాగానాలకు ఇది మరింత ఊతమిచ్చినట్టు అయింది. టాటా గ్రూపునకు చెందిన కీలకమైన మూడు దాతృత్వ ట్రస్టులకు జీవితకాల ట్రస్టీగా తిరిగి నియమించడానికి చేసిన ప్రతిపాదనను ఆమోదించలేదు. ఈ నిర్ణయంతో మిస్త్రీకి టాటా ట్రస్టులతో సంబంధాలు తెగినట్టేనని తెలుస్తోంది. గత వారం టాటా ట్రస్ట్ సీఈఓ సర్ రతన్ టాటా ట్రస్టుతో పాటు సర్ దోరాబ్జీ టాటా ట్రస్ట్, బాయి హీరాబాయి జమ్షెడ్జీ టాటా నవ్సారీ ఛారిటబుల్ ఇన్‌స్టిట్యూషన్‌కు ట్రస్టీగా మెహ్లీ మిస్త్రీ నియామకాన్ని ప్రతిపాదించారు. దీనికి ట్రస్టీలు నోయల్ టాటా, వేణు శ్రీనివాసన్, విజయ్ సింగ్ వ్యతిరేకించారు.

## మూడేళ్ల పరిమితి తొలగింపు..

# తగ్గనున్న ఈఎంఐ!

వేర్వేరు అవసరాల కోసం లోన్లు తీసుకునే వారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరుగుతుంది. అయితే.. ఇక్కడ లోన్లు తీసుకునే విషయంలో వడ్డీ రేట్లు రెండు రకాలుగా ఉంటాయి. ఒకటి ఫిక్స్‌డ్ రేటు లోన్లు, రెండోది ఫ్లోటింగ్ రేటు లోన్లు. ఫిక్స్‌డ్ రేటు అంటే.. లోన్ టెన్యూర్ మొత్తం అదే వడ్డీ రేటు వర్తిస్తుంది. ఫ్లోటింగ్ రేటు అంటే ఆర్బీఐ మధ్యలో రెపో రేటు సవరిస్తే.. సదరు బ్యాంకులు కూడా బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్లను సవరిస్తుంటాయి. దీనికి తగ్గట్లుగా బ్యాంకులు రుణ రేట్లను తగ్గించడం, పెరగడం చేస్తుంటాయి. అప్పుడు ఈఎంఐ ఇదివరకు వెంటనే తగ్గకపోయేది. ఇప్పుడు ఆర్బీఐ 2025, అక్టోబర్ 1 నుంచి కొత్త రూల్స్ ప్రకటించింది. దీంతో కస్టమర్లకు భారీ ఉపశమనం దక్కనుంది. ఇంతకీ ఏం నిర్ణయం తీసుకుందో చూద్దాం. రుణాలపై వడ్డీ రేట్లను లెక్కించే విధానంలో స్ప్రెడ్ అనేది కీలక పాత్ర పోషిస్తుంది. ఇక్కడ స్ప్రెడ్ అంటే బెంచ్‌మార్క్ లెండింగ్ రేటు. ఉదాహరణకు ఎంసీఎల్ఆర్, ఈబీఎల్ఆర్ వంటివి ఉంటాయి. ఆర్బీఐ రెపో రేటుకు అదనంగా బ్యాంకులు వసూలు చేసే వడ్డీ రేటు. ఇక్కడ బ్యాంక్ లాభాల మార్జిన్, నిర్వహణ ఖర్చులు, రుణ గ్రహీత క్రెడిట్ స్కోరు ఆధారంగా నిర్ణయించేటువంటి అంశాలు మొదలైనవి ఉంటాయి. అంతకుముందు క్రెడిట్ రిస్క్ ప్రీమియం కాని బెంచ్‌మార్క్ లెండింగ్ రేట్లను మూడేళ్ల వరకు మార్చేందుకు వీల్లేదు. కానీ కొత్త మార్గదర్శకాల ప్రకారం.. మూడేళ్ల కంటే ముందుగానే తగ్గించేందుకు వీలు కల్పిస్తుంది. ఈ మార్పుతో ఫ్లోటింగ్ వడ్డీ రేటు రుణాలు తీసుకున్న వారికి



తక్షణ ప్రయోజనం చేకూరే అవకాశం ఉంటుంది. ఇక్కడ ఆర్బీఐ రెపో రేటు తగ్గించిన వెంటనే.. బ్యాంకులు స్ప్రెడ్‌లోని ఈ వడ్డీ రేటు భాగాల్ని కూడా తగ్గించేందుకు వెసులుబాటు కలగడంతో .. ఆ ప్రయోజనం ఈఎంఐ తగ్గింపు రూపంలో వేగంగా రుణ గ్రహీతలకు చేరుతుంది. ఇంకా.. లోన్ తీసుకున్న తర్వాత రుణ గ్రహీతల క్రెడిట్ స్కోరు మెరుగుపడితే కూడా.. వారి క్రెడిట్ యోగ్యత ఆధారంగా.. వడ్డీ రేట్లను తగ్గించమని బ్యాంకుల్ని కోరొచ్చని కొత్త నిబంధనల్లో ఉంది. ఎంసీఎల్ఆర్ రుణాలపై వడ్డీ రేటు మార్చేందుకు.. 6-12 నెలల వరకు సమయం పట్టేది. ఇప్పుడు ఈ బదిలీ మరింత వేగవంతం అవుతుంది. అయితే ఈ మార్పు పూర్తిగా ఆటోమేటిక్‌గా జరగదు.

## ట్రంప్ అదిరిపోయే ప్రకటన.. మళ్లీ కుప్పకూలిన బంగారం ధరలు

బంగారం ధర కొంత కాలంగా వరుసగా తగ్గుతున్న సంగతి తెలిసిందే. 10 రోజుల కిందట ఇంటర్నేషనల్ మార్కెట్లో స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు ఏకంగా 4,380 డాలర్ల మార్కు వద్ద ఆల్ టైమ్ గరిష్ట స్థాయిని తాకినప్పటి నుంచి పతనం అవుతూనే ఉంది.ఇక్కడ ప్రధానంగా.. అమెరికా- చైనా మధ్య వాణిజ్య ఒప్పందం కుదురుతుందన్న సానుకూల సంకేతాల నడుమ.. ఇన్వెస్టర్లు ప్రాఫిట్ బుకింగ్ చేసుకోవడం వల్లేనన్న సంగతి తెలిసిందే. దీంతో బంగారం ధర అప్పటి నుంచి పడిపోతూ వచ్చింది. ఈ క్రమంలోనే అంతర్జాతీయ మార్కెట్లో వారం కిందట ఒక్క సెషన్‌లో ఔన్సుకు 200 డాలర్లకుపైగా తగ్గగా.. తర్వాత కాస్త స్వల్పంగా తగ్గుతూ వచ్చింది. అయితే.. ఇప్పుడు మళ్లీ భారీగా తగ్గుముఖం పట్టింది. అంతర్జాతీయ మార్కెట్లో పెద్ద మొత్తంలో పతనం కాగా.. ఈ ప్రభావం మంగళవారం ఉదయం 10 గంటల తర్వాత కనిపిస్తుందని చెప్పొచ్చు. ఇంటర్నేషనల్ మార్కెట్లో ఉదయం స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు 4100 డాలర్ల పైన ఉండగా.. ఇప్పుడు వార్త రాసే సమయంలో దాదాపు 3 శాతం తగ్గి 3,985 డాలర్ల స్థాయికి చేరింది. సిల్వర్ రేటు కూడా 48.30 డాలర్ల స్థాయి నుంచి 2 డాలర్లకుపైగా పతనమైంది. ఇదే సమయంలో రూపాయి మరింత పతనమైంది. ప్రస్తుతం డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ. 88.27 వద్ద ట్రేడవుతోంది. అయినప్పటికీ ఈ ఏడాదిలో బంగారం ధర ఇప్పటికే 55 శాతం వరకు పుంజుకుంది. దేశీయంగా ఇవాళ హైదరాబాద్‌లో ధర మరింత పతనమైంది. 22 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 2150 తగ్గి తులం రూ. 1,13,000 గా ఉంది. 24 క్యారెట్ల పసిడి ధర రూ. 2340 తగ్గడంతో 10 గ్రాములు రూ. 1,23,280 గా ఉంది. సిల్వర్ రేటు రూ. 1.70 లక్షలు గా ఉంది. బంగారం, వెండి ధరలు ఇప్పుడు ఒక్కసారిగా ఇంతలా



తగ్గేందుకు ప్రధాన కారణం.. కొంత కాలంగా తీవ్ర అంతర్జాతీయ అనిశ్చితికి కారణమైన.. అమెరికా- చైనా వాణిజ్య ఒప్పందానికి దగ్గరవుతున్నాయని ప్రకటన రావడం. అవును.. స్వయంగా అమెరికా ప్రెసిడెంట్ డొనాల్డ్ ట్రంప్ దీనిపై ప్రకటన చేశారు.

# భారత్- ఆస్ట్రేలియా తొలి టీ20 వర్షార్పణం

క్రీడా వాయిస్

కాన్‌బెర్రా వేదికగా భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన తొలి టీ20 వర్షం కారణంగా రద్దు అయింది. ఈ మ్యాచ్‌లో టాస్ గెలిచిన ఆస్ట్రేలియా కెప్టెన్ మిచెల్ మార్ష్ తొలుత టీమిండియాను బ్యాటింగ్ అహ్వానించాడు. అయితే భారత ఇన్నింగ్స్ ఐదవ ఓవర్ ముగిసిన వెంటనే వరుణుడు ఎంట్రీ ఇచ్చాడు. దీంతో ఆటను అంపైర్‌లు నిలిపివేశారు. వర్షం పూర్తిగా తగ్గుముఖం పట్టడంతో తిరిగి ఆటను ప్రారంభించారు. అయితే మ్యాచ్‌ను మాత్రం 18 ఓవర్లకు కుదించారు. తిరిగి క్రీజులోకి వచ్చిన సూర్యకుమార్ యాదవ్, శుభ్‌మన్ గిల్ ఆసీస్ బౌలర్లపై విరుచుకుపడ్డారు. ఇద్దరు బ్యాటర్లు మంచి జోరు మీద ఉన్న సమయంలో వర్షం మళ్లీ ఎంట్రీ ఇచ్చింది. భారత్ స్కోర్ 97/1(9.4 ఓవర్లు) వద్ద ఆటను నిలిపివేశారు. అయితే ఈసారి వర్షం తగ్గుముఖం పట్టే సూచనలు కన్పించకపోవడంతో అంపైర్‌లు మ్యాచ్‌ను రద్దు చేశారు. ఫలితం తేలని ఈ మ్యాచ్‌లో సూర్యకుమార్ యాదవ్(39 నాటౌట్), శుభ్‌మన్ గిల్(37 నాటౌట్), అభిషేక్ శర్మ 19 పరుగులు చేశారు. ఇక ఇరు జట్ల మధ్య రెండో టీ20 మెల్‌బోర్న్ వేదికగా శుక్రవారం జరగనుంది.

తుదిజట్లు: టీమిండియా అభిషేక్ శర్మ, శుబ్‌మన్ గిల్, సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), తిలక్ వర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, అక్షర్ పటేల్, హర్షిత్ రాణా, కుల్దీప్ యాదవ్, వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా.





ఆస్ట్రేలియా
మిచెల్ మార్ష్(కెప్టెన్), ట్రావిస్ హెడ్, జోష్ ఇంగ్లిస్(వికెట్ కీపర్), టిమ్ డేవిడ్, మిచెల్ ఓవెన్, మార్కస్ స్టొయినిస్, జోష్ ఫిలిప్, జేవియర్ బార్ట్‌లెట్, నాథన్ ఎల్లిస్, మాథ్యూ కుహ్నెమాన్, జోష్ హాజిల్‌వుడ్.

## సూర్యకుమార్ యాదవ్ ప్రపంచ రికార్డు



టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ సరికొత్త చరిత్ర సృష్టించాడు. టెస్టు హోదా ఉన్న జట్ల తరఫున అత్యంత వేగంగా 150 సిక్సర్లు బాదిన తొలి క్రికెటర్‌గా ప్రపంచ రికార్డు సాధించాడు. ముంబైకి చెందిన 35 ఏళ్ల సూర్యకుమార్ ఆలస్యంగానే టీమిండియాలో ఎంట్రీ ఇచ్చాడు. ఇంగ్లండ్‌తో స్వదేశంలో టీ20 సిరీస్ సందర్భంగా భారత్ తరఫున 2021లో అంతర్జాతీయ క్రికెట్లో అడుగుపెట్టిన సూర్యకుమార్ యాదవ్.. ఆ తర్వాత వన్డే, టెస్టుల్లోనూ అరంగేట్రం చేశాడు. అయితే, ఈ రెండు ఫార్మాట్లలోనూ సత్తా చాటలేక చతికిల పడ్డ సూర్య.. తనకు కలిసి వచ్చిన టీ20 క్రికెట్‌లో మాత్రం వరల్డ్ నంబర్ వన్ బ్యాటర్‌గా ఎదిగాడు.

**వరుస విజయాలు**

ఈ క్రమంలో గతేడాది ఏకంగా టీమిండియా టీ20 కెప్టెన్‌గా పగ్గాలు చేపట్టిన సూర్య.. వరుస విజయాలు సాధించాడు. ఇటీవలే ఆసియా టీ20 కప్-2025లో భారత్‌ను చాంపియన్‌గా నిలిపాడు. కానీ బ్యాటర్‌గా మాత్రం విఫలం కావడం విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా పర్యటనలో సత్తా చాటాలని పట్టుదలగా ఉన్న సూర్య.. తొలి టీ20లో ధనాధన్ ఇన్నింగ్స్‌తో అలరించాడు. కాన్‌బెర్రా వేదికగా టాస్ గెలిచిన ఆసీస్.. భారత్‌ను తొలుత బ్యాటింగ్‌కు ఆహ్వానించింది.

**వర్షం వల్ల మ్యాచ్ రద్దు**

ఈ క్రమంలో ఓపెనర్ అభిషేక్ శర్మ (14 బంతుల్లో 19) వేగంగా ఆడే ప్రయత్నంలోనే.. నాథన్ ఎల్లిస్ బౌలింగ్‌లో టిమ్ డేవిడ్‌కు క్యాచ్ ఇచ్చి తొలి వికెట్‌గా పెవిలియన్ చేరాడు. అతడి స్థానంలో వన్‌డౌన్‌లో వచ్చిన సూర్య.. మరో ఓపెనర్ శుబ్‌మన్ గిల్ తో కలిసి దంచికొట్టాడు. అయితే, వర్షం వల్ల ఈ మ్యాచ్ అర్ధంతరంగా ముగిసిపోయింది. అప్పటికి.. 9.4 ఓవర్ల ఆట సాగగా.. వికెట్ నష్టానికి 97 పరుగులు చేసింది టీమిండియా. గిల్ 20 బంతుల్లో నాలుగు ఫోర్లు, ఒక సిక్సర్ సాయంతో 37 పరుగులు చేయగా.. సూర్యకుమార్ 24 బంతుల్లో 39 పరుగులు సాధించాడు. అతడి ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, రెండు సిక్సర్లు ఉన్నాయి.

**205 సిక్సర్లతో టాప్‌లో రోహిత్**

ఇక ఈ మ్యాచ్ సందర్భంగా సూర్య అంతర్జాతీయ టీ20 ఫార్మాట్లో 150 సిక్సర్ల క్లబ్‌లో చేరాడు. ఈ జాబితాలో టీమిండియా దిగ్గజ కెప్టెన్ రోహిత్ శర్మ 205 సిక్సర్లతో టాప్‌లో ఉండగా.. సూర్య ఐదో స్థానంలో నిలిచాడు. అయితే, అత్యంత తక్కువ ఇన్నింగ్స్‌లోనే అంటే.. 86వ ఇన్నింగ్స్‌లోనే 150 సిక్సర్లు పూర్తి చేసుకున్నాడు సూర్య. తద్వారా ఐసీసీ ఫుల్ మెంబర్ల (టెస్టు హోదా) జట్ల తరఫున ఫాస్టెస్ట్ 150 సిక్సెస్ సాధించిన తొలి క్రికెటర్‌గా నిలిచాడు. ఇక అసోసియేట్ దేశమైన యూఏఈ తరఫున ముహమ్మద్ వసీం 66 ఇన్నింగ్స్‌లోనే ఈ ఘనత సాధించడం విశేషం.

## చరిత్ర సృష్టించిన రోహిత్ శర్మ.. వన్డే బ్యాటర్ల ర్యాంకింగ్స్‌లో టాప్



ముంబై: రోహిత్ శర్మ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ మెన్స్ వన్డే బ్యాటర్ ర్యాంకింగ్స్‌లో నెంబర్ వన్ స్థానాన్ని కైవసం చేసుకున్నాడు. ఆస్ట్రేలియాతో జరిగిన వన్డే సిరీస్ మూడో మ్యాచ్‌లో అద్భుతమైన సెంచరీ సాధించిన రోహిత్ ర్యాంకింగ్స్‌లో రెండు స్థానాలు ఎగబాకాడు. ఆ మ్యాచ్‌లో కోహ్లీతో కలిసి రోహిత్ దుమ్మురేపిన విషయం తెలిసిందే. ఆఫ్ఘనిస్తాన్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్, ఇండియన్ కెప్టెన్ శుభమన్ గిల్‌ను ర్యాంకింగ్స్‌లో రోహిత్ ఓవర్‌టేక్ చేశాడు. వన్డే ర్యాంకింగ్స్‌లో రోహిత్‌తో పాటు ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ ర్యాంకింగ్స్‌లో పైచేయి సాధించాడు. 781 రేటింగ్ పాయింట్లు సాధించాడు రోహిత్ శర్మ? ఇక ఇబ్రహీం 764 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. విరాట్ కోహ్లీ మాత్రం 725 పాయింట్లతో బ్యాటింగ్ ర్యాంకుల్లో ఆరో స్థానంలో ఉన్నాడు. 38 ఏళ్ల బ్యాటర్ రోహిత్ తన కెరీర్‌లో తొలిసారి వన్డే ర్యాంకుల్లో టాప్ ప్లేస్‌లో నిలిచాడు. ఇటీవల ఆసీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో ప్లేయర్ ఆఫ్ సిరీస్ అవార్డు గెలుచుకున్నాడతను. ఆ సిరీస్‌లో అతను 101 సగటుతో మొత్తం 202 రన్స్ స్కోరు చేశాడు. వన్డే బ్యాటర్ల జాబితాలో రోహిత్ శర్మ అగ్రస్థానంలో నిలవడం శుభదాయకం అవుతుంది. వన్డే భవిష్యత్తుపై అనుమానాలు కమ్ముకున్న నేపథ్యంలో .. రోహిత్ టాప్ ర్యాంకులో నిలవడం గమనార్హం. వన్డే కెప్టెన్సీని గిల్‌కు అప్పగించిన విషయం తెలిసిందే. రోహిత్ వన్డేల నుంచి రిటైర్ అవుతున్న ఊహాగానాలు కూడా వినిపించాయి. కానీ ఆసీస్ సిరీస్‌తో అద్భుతమైన బ్యాటింగ్ ప్రదర్శన కనబరిచాడతను.

## తాజ్‌మహల్ వివాదం.. పరేష్ రావల్ సినిమాపై ఢిల్లీ హైకోర్టులో పిటిషన్!

బాలీవుడ్ నటుడు పరేష్ రావల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న వివాదాస్పద చిత్రం 'ది తాజ్ స్టోరీ' ఈ సినిమా అక్టోబర్ 31న ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. అయితే ఈ సినిమా విడుదలని అడ్డుకోవాలంటూ ఢిల్లీ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. ఈ చిత్రం చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని పిటిషనర్ ఆరోపించారు.అడ్వకేట్ షకీల్ అబ్బాస్ ఈ పిటిషన్‌ను దాఖలు చేయగా.. ఇందులో ఆయన సెన్సార్ బోర్డు కేంద్ర ప్రభుత్వం, చిత్ర నిర్మాత, దర్శకుడు, నటుడు పరేష్ రావల్‌ను ప్రతివాదులుగా చేర్చారు. ఈ చిత్రం తాజ్ మహల్ చారిత్రక వాస్తవాలను వక్రీకరించడమే కాకుండా, మత సామరస్యాన్ని దెబ్బతీస్తుందని తెలిపాడు. అలాగే ఒక ప్రత్యేక రాజకీయ సిద్ధాంతాన్ని ఈ చిత్రం ప్రోత్సహిస్తోందని పిటిషనర్ ఆరోపించారు. ఈ సినిమా విడుదలైతే మత విద్వేషాలకు దారితీసే అవకాశం ఉందని ఇది దేశ లౌకిక స్ఫూర్తిని దెబ్బతీస్తుందని అబ్బాస్ ఆందోళన వ్యక్తం చేశారు. అయితే ఈ పిటిషన్‌పై ఢిల్లీ హైకోర్టు స్పందిస్తూ.. ఈ పిటిషన్‌ను తక్షణమే విచారించడానికి నిరాకరించింది. ఈ అంశాన్ని సాధారణ విచారణలో భాగంగా పరిశీలిస్తామని కోర్టు స్పష్టం చేసింది.





## చిరంజీవి సినిమాలో నేను లేను.. 'మెగా 158' రూమర్స్‌పై మాళవిక మోహనన్ క్లారిటీ

మెగాస్టార్ చిరంజీవి బాబీ కాంబినేషన్‌లో ఒక సినిమా రాబోతున్న విషయం తెలిసిందే. వాల్తేర్ వీరయ్య లాంటి సూపర్ హిట్ తర్వాత ఈ జోడి మళ్లీ కలిసి పనిచేయబోతుంది. మెగా 158 అంటూ రాబోతున్న ఈ ప్రాజెక్ట్ త్వరలోనే సెట్స్ మీదకి వెళ్లనుంది. అయితే ఈ ప్రాజెక్ట్‌లో హీరోయిన్‌గా మాళవిక మోహనన్ నటించబోతున్నట్లు వార్తలు వస్తున్న విషయం తెలిసిందే. తాజాగా ఈ వార్తలపై నటి స్పందిస్తూ.. అవన్నీ రూమర్స్ అంటూ తెలిపింది. ఈ మేరకు ఆమె సోషల్ మీడియా వేదికగా ఒక ప్రకటన విడుదల చేశారు. నేను 'మెగా 158' చిత్రంలో నటిస్తున్నానని ఆన్‌లైన్‌లో అనేక వార్తలు వస్తున్నాయి. అయితే నా కెరీర్‌లో ఏదో ఒక రోజు ఐకానిక్ చిరంజీవి సార్‌తో స్క్రీన్ పంచుకోవాలని నేను ఎంతగానో కోరుకుంటున్నాను. కానీ ప్రస్తుతం నేను ఈ ప్రాజెక్ట్‌లో భాగం కావడం లేదు. ఆ వార్తలు అవాస్తవం అంటూ మళావిక రాసుకోచ్చింది. దీంతో చిరంజీవి సరసన మాళవిక నటించబోతున్నారనే ఊహాగానాలకు తెరపడింది. త్వరలోనే ఈ చిత్రంలో నటించబోయే కథానాయిక గురించి చిత్ర బృందం అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.

## 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో' సినిమా ట్రైలర్ రిలీజ్



ఒకప్పుడు పెళ్లంటే పెళ్లి మాత్రమే. ఇప్పుడు పెళ్లి అంటే అంతకంటే ముందు చాలా ఉంటాయి. అందులో ప్రీ వెడ్డింగ్ షూట్ ఒకటి. ఇప్పుడు ఈ కాన్సెప్ట్‌పై తెలుగులో ఓ కామెడీ సినిమా తీశారు. అదే 'ద గ్రేట్ ప్రీ వెడ్డింగ్ షో'. మసూద మూవీ ఫేమ్ తిరువీర్ హీరోగా నటిస్తున్నాడు. టీనా శ్రావ్య హీరోయిన్. రాహుల్ శ్రీనివాస్ దర్శకుడు. నవంబర్ 7న మూవీ థియేటర్లలోకి రానుంది. ఈ సందర్భంగా తాజాగా ట్రైలర్ లాంచ్ చేశారు. ఇది బాగానే నవ్విస్తోంది. ట్రైలర్ బట్టి చూస్తే.. పల్లెటూరిలో ఉండే హీరో ఓ ఫొటోగ్రాఫర్. ఓసారి ఓ జంటకు ప్రీ వెడ్డింగ్ షూట్ చేస్తాడు. అనుకుని పరిస్థితుల్లో షూట్ చేసిన ఫుటేజీ ఉన్న మెమొరీ కార్డ్ పోతుంది. తర్వాత ఎలాంటి పరిస్థితులు ఎదురయ్యాయి? ఈ గండం నుంచి హీరో ఎలా బయటపడ్డాడనేదే స్టోరీలా అనిపిస్తుంది. ట్రైలర్ అయితే నవ్విస్తోంది. కామెడీ కూడా సహజంగా కుదిరింది. మరి మూవీ ఎలాంటి రిజల్ట్ అందుకుంటుందో చూడాలి? నవంబర్ 7న రష్మిక 'ద గర్ల్ ఫ్రెండ్', సుధీర్ బాబు 'జటాధర' చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. వీటితోపాటు ఈ సినిమా కూడా రానుంది. మరి మూడింటిలో ఏది ప్రేక్షకుల్ని అలరిస్తుందో చూడాలి. ఇదే తేదీన తమిళ డబ్బింగ్ బొమ్మ 'ఆర్యన్' కూడా తెలుగులో విడుదల కానుంది.



## స్పిరిట్‌లో ప్రభాస్.. యానిమల్ సీన్ రిపీట్ కానుందా?

రెబల్ స్టార్ ప్రభాస్ డైరెక్టర్ సందీప్‌రెడ్డి వంగా కాంబినేషన్‌లో వస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'స్పిరిట్'. ఈ ప్రాజెక్ట్ అప్‌డేట్స్ కోసం ఫ్యాన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ గురించి టాలీవుడ్‌లో పలు రకాల రూమర్స్ వినిపిస్తూనే ఉన్నాయి. ఈ మూవీలో ప్రభాస్ తండ్రిగా మెగా హీరో నటించబోతున్నట్లు గతంలో వార్తలొచ్చాయి. స్పిరిట్ చిత్రంలో మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్నారని తెగ టాక్ వినిపించింది. అయితే దీనిపై ఇంకా క్లారిటీ రాలేదు. అయితే ఇటీవలే అక్టోబర్ 23న ప్రభాస్ బర్త్‌డేను పురస్కరించుకుని ఆడియో గ్లింప్స్ రిలీజ్ చేశారు. 'సౌండ్ స్టోరీ ఆఫ్ ది ఫిలిం స్పిరిట్' అంటూ 1.31 నిమిషాల ఆడియో గ్లింప్స్ వదిలారు. తెలుగుతో పాటు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ గ్లింప్స్ రిలీజ్ చేశారు. తాజాగా ఈ మూవీకి సంబంధించిన మరో క్రేజీ న్యూస్ వైరలవుతోంది. ఈ చిత్రం కోసం సందీప్ రెడ్డి వంగా బిగ్ ప్లాన్ రెడీ చేసినట్లు తెలుస్తోంది. యానిమల్‌తో బోల్డ్ డైరెక్టర్‌గా ముద్ర వేసుకున్న సందీప్ రెడ్డి.. ప్రభాస్ స్పిరిట్‌లోనూ అదే పంథాను ఫాలో అవుతున్నట్లు అర్థమవుతోంది. అందుకే స్పిరిట్‌లోనూ బోల్డ్ సన్నివేశాలు ఉండనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ మూవీలో ప్రభాస్ ఓ సీన్‌లో నగ్నంగా కనిపించనున్నారని వార్తలొస్తున్నాయి.

గ్లింప్స్ డైలాగ్ వల్లే రూమర్స్..

ఇటీవల విడుదలైన గ్లింప్స్‌లో ప్రకాశ్ రాజ్ చెప్పిన డైలాగ్.. ఈ వార్తకు బలం చేకూరుతోంది. ఖైదీని బట్టలూడదీసి టెస్టులకు పంపండి అనే చెప్పిన డైలాగ్‌తోనే టాక్ వినిపిస్తోంది. దీంతో ప్రభాస్ సినిమాలో నగ్నంగా కనిపించే ఛాన్స్ ఉందని సోషల్ మీడియాలో చర్చ నడుస్తోంది. ఎందుకంటే సందీప్ రెడ్డి వంగా యానిమల్‌లో రణ్‌బీర్ కపూర్ ఓ సీన్‌లో న్యూడ్‌గా కనిపించారు. అదే పంథాను స్పిరిట్ విషయంలో ఫాలో అవుతున్నట్లు తెలుస్తోంది. ఇదే నిజమైతే స్టార్ హీరోలతో బోల్డ్ సీన్స్ చేయించడం ఒక్క సందీప్ రెడ్డికే సాధ్యమని చెప్పొచ్చు. కాగా.. ఈ చిత్రంలో యానిమల్ బ్యూటీ త్రిప్తి డిమ్రీ హీరోయిన్‌గా కనిపించనుంది. ఈ మూవీతో బాలీవుడ్ భామ టాలీవుడ్ ఎంట్రీ ఇవ్వనుంది.



## హీరోయిన్‌గా మహేష్ బాబు మేనకోడలు.. సంతోషం వ్యక్తం చేసిన మంజుల

ఘట్టమనేని కుటుంబం నుంచి మరో వారసురాలు రాబోతోంది. ఆమె మరెవరో కాదు కృష్ణ మనవరాలు, మంజుల కుమార్తె జాన్వీ స్వరూప్. త్వరలోనే సినీ రంగంలో అడుగుపెట్టేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. నటన, డాన్స్‌లో ప్రత్యేక శిక్షణ పొందిన జాన్వీ ఇప్పటికే కొన్ని కథలను విన్నట్టు సమాచారం. వాటిలో ఒక ప్రాజెక్ట్ కోసం అధికారిక ఒప్పందం కూడా పూర్తయిందని తెలుస్తుంది. త్వరలోనే ఆమె డెబ్యూ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడనుంది. ఇక జాన్వీ తల్లి మంజుల ఘట్టమనేనికి హీరోయిన్ కావాలనే కోరిక ఉండేది. ఒకప్పుడు ఆమెను కథానాయికగా ప్రకటించినప్పటికీ, కృష్ణ అభిమానులు "ఆమెని మేము హీరోయిన్‌గా చూడలేం" అంటూ వ్యతిరేకించడంతో ఆ ఆలోచన విరమించుకున్నారు. తరువాత మంజుల నిర్మాతగా, కొన్నిసార్లు నటిగా, అలాగే దర్శకురాలిగా కూడా ఇండస్ట్రీలో తన ముద్ర వేసుకున్నారు. ప్రస్తుతం ఆమె సినిమాల నుంచి కొంత దూరంగా ఉన్నారు. ఇప్పుడు అదే ఇంటి నుంచి మరో తరం తెరపైకి రావడానికి సిద్ధమవుతుండటంతో సినీ వర్గాల్లో ఆసక్తి పెరిగింది. మరోవైపు కృష్ణ చిన్న కుమారుడు రమేష్ బాబు తనయుడు కూడా అజయ్ భూపతి దర్శకత్వంలో ఓ సినిమాలో నటిస్తున్నాడు. దీంతో ఘట్టమనేని కుటుంబం నుంచి కొత్త తరం ఇండస్ట్రీకి వస్తుండడంపై ఫ్యాన్స్ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అభిమానులు ఇప్పుడు మహేష్ బాబు పిల్లలు గౌతమ్, సితార ఎప్పుడు సినిమాల్లోకి వస్తారోనని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మహేష్ బాబు ఈ విషయంలో ఏ నిర్ణయం తీసుకుంటారో చూడాలి. అయితే మంజుల తన కుమార్తె హీరోయిన్‌గా ఎంట్రీ ఇస్తుండటంతో ఆనందంతో ఉప్పొంగిపోతున్నారు. ఒకప్పుడు"నీవు హీరోయిన్‌గా ఎందుకు?"అని ప్రశ్నించినవారే ఇప్పుడు"నీ కుమార్తె సినిమాల్లో రావాలి"అని ప్రోత్సహిస్తున్నారని ఆమె చెబుతూ సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తన కుమార్తె చిరునవ్వే తన ప్రార్థనలకు సమాధానం అని మంజుల ఘట్టమనేని సంతోషంగా తెలియజేసింది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com